


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక : 111 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : హైదరాబాద్ మంగళవారం 3 మార్చి 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 111 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : HYDERABAD TUE 3 MARCH 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Hyderabad, Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur

## టీ20 ప్రపంచకప్‌లో కెనడా ఆడడం సంతోషం కలిగించింది

- భారత్-కెనడా సీఈవోల ఫోరమ్ సమావేశంలో పాల్గొన్న ప్రధాని మోదీ
- టీ20 మ్యాచ్‌లా ఇరు దేశాల బంధం ముందుకు సాగాలని ఆకాంక్ష
- కెనడా ప్రధాని మార్క్ కార్నీతో ద్వైపాక్షిక చర్చలు జరిపిన మోదీ
- భారత్ వేదికగా జరిగిన టీ20 వరల్డ్ కప్‌లో కెనడా పాల్గొనడంపై హర్షం



**పెన్ పవర్ డెస్క్:**ప్రధాని నరేంద్ర మోదీ, కెనడా ప్రధాని మార్క్ కార్నీ సోమవారం న్యూఢిల్లీలో జరిగిన 'ఇండియా–కెనడా సీఈవోల ఫోరమ్'లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ ఇరు దేశాల సంబంధాలను క్రికెట్‌తో పోల్చుతూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 2023లో ఖలిస్తానీ వేర్పాటువాద

- మిగతా 2లో

## ఆ మూడు యుద్ధ విమానాలను కువైట్ పొరపాటున కూల్చింది

- కువైట్ గగనతలంలో పొరపాటున అమెరికా విమానాల కూల్చివేత
- ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీలో పాల్గొన్న మూడు ఎఫ్-15 విమానాలు ధ్వంసం
- ఇరాన్ దాడుల సమయంలో శత్రువులుగా భావించి కాల్పులు
- ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడ్డ ఆరుగురు సిబ్బంది



**పెన్ పవర్ డెస్క్:**కువైట్ గగనతలంలో అనూహ్య ఘటన చోటుచేసుకుంది. ఇరాన్ పై ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీలో భాగంగా విధులు నిర్వర్తిస్తున్న మూడు అమెరికా ఎఫ్–15ఈ స్ట్రైక్ ఈగల్ యుద్ధ విమానాలు కుప్పకూలాయి. ఈ విమానాలను తామే కూల్చామని ఇరాన్ ఇప్పటికే ప్రకటించింది. అయితే ఇవి శత్రువుల దాడిలో కూలిపోలేదని.. మిత్రదేశమైన కువైట్ ఎయిర్ డిఫెన్స్ దళాలే వీటిని పొరపాటున కూల్చేశాయని అమెరికా సైన్యం ఓ ప్రకటన చేసింది. ఈ విషయాన్ని

- మిగతా 2లో

## పెద్దల ఇళ్లను బుల్డోజర్లతో పడగొడతాం

### కాంగ్రెస్ సర్కార్‌కు బండి సంజయ్ వార్నింగ్



- గాంధీ విగ్రహం పేరుతో పేదల ఇళ్లు కూల్చివేస్తున్నారన్న బండి సంజయ్
- తాము అధికారంలోకి వచ్చాక పెద్దల ఇళ్లను కూల్చివేస్తామని హెచ్చరిక
- మూటల కోసమే రాహుల్ గాంధీ తెలంగాణకు వచ్చారని విమర్శ

**హైదరాబాద్ పెన్ పవర్:**మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టులో భాగంగా గాంధీ విగ్రహం ఏర్పాటు కోసం పేదల ఇళ్లను కూల్చివేయడంపై కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈరోజు మీడియాతో మాట్లాడిన ఆయన... ప్రభుత్వం అనుసరిస్తున్న తీరుపై సంచలన వ్యాఖ్యలు చేశారు. బఫర్ జోన్, ఎఫ్టీఎల్ సాకుతో సామాన్యుల ఇళ్లను కూలిస్తే, తాము అధికారంలోకి వచ్చాక పెద్దల ఇళ్లను బుల్డోజర్లతో కూల్చివేస్తామని హెచ్చరించారు. గాంధీ విగ్రహం ఏర్పాటు చేసే సాకుతో వందలాది కుటుంబాలను రోడ్డున పడేయడం

- మిగతా 2లో

## డీసీసీలు పవర్ ఫుల్..

### జిల్లాకు వారే సుప్రీం: రాహుల్ గాంధీ

- ప్రధానమంత్రి పదవిని చేపట్టేందుకు సిద్ధం: రాహుల్ గాంధీ
- అనంతగిరి హిల్స్‌లో జరిగిన శిక్షణా తరగతుల సమావేశంలో రాహుల్ గాంధీ
- కాంగ్రెస్ విధానం అహింస, బీజేపీది హింసా విధానమని విమర్శ
- ట్రంప్‌కు మోదీ భయపడుతున్నారన్న రాహుల్ గాంధీ






## బీసీ రిజర్వేషన్లపై పార్లమెంటులో ప్రైవేటు బిల్లు


### తెలంగాణలో పార్టీ, ప్రభుత్వం కలిసి పనిచేస్తున్నయ్

### మోదీ అరాచకాలపై పోరాటం చేద్దాం

**హైదరాబాద్ పెన్ పవర్:**ప్రధానమంత్రి పదవిని చేపట్టేందుకు తాను సిద్ధంగా ఉన్నానని లోక్ సభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. వికారాబాద్ జిల్లా అనంతగిరి హిల్స్‌లో జరిగిన కాంగ్రెస్ పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ విధానం అహింసా పద్ధతి, కానీ బీజేపీది మాత్రం హింసా విధానమని అన్నారు. ఎలాగైనా అధికారంలోకి రావాలనేది బీజేపీ ఆలోచన

- మిగతా 2లో

## వారికి ఇష్టం లేకపోతే రంగులు చల్లొద్దు




- నేడు హోలీ పండుగ
- ఇతరులకు ఇబ్బంది కలిగిస్తే కఠిన చర్యలు తప్పవన్న సీపీ
- రంజాన్ ప్రార్థనలకు ఆటంకం కలగకుండా చూడాలని ఆదేశాలు
- బలవంతంగా రంగులు పూయడంపై నిషేధం
- నేడు ఉదయం 6 నుంచి సాయంత్రం 6 వరకు మద్యం బంద్
- న్యూసెన్స్ చేసే వారిపై షీ టీమ్స్ ప్రత్యేక నిఘా

- మిగతా 2లో

## ఇరాన్ తాత్కాలిక సుప్రీం లీడర్ ఎయిర్ స్ట్రైక్స్ లో హతమయ్యాడా?

- రెండు రోజుల క్రితం ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ మృతి
- తాత్కాలిక సుప్రీం లీడర్‌గా బాధ్యతలు చేపట్టిన అలీ రెజా అరాఫీ
- అరాఫీ కూడా మృతి చెందినట్లు కథనాలు
- ధృవీకరించని ఇరాన్ అధికార వర్గాలు

**పెన్ పవర్ డెస్క్:**అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్త వైమానిక దాడిలో ఇరాన్ తాత్కాలిక సుప్రీం లీడర్ అలీ రెజా అరాఫీ కూడా మరణించినట్లుగా మీడియాలో కథనాలు వస్తున్నాయి. రెండు రోజుల క్రితం ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ హతమైన విషయం తెలిసిందే. దీనితో అలీ రెజా అరాఫీ తాత్కాలిక



- మిగతా 2లో



## ఏపీ, తెలంగాణ కాంగ్రెస్ నేతలతో రాహుల్ గాంధీ సమావేశం

- తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పీసీసీల సంయుక్త భేటీకి రాహుల్ గాంధీ
- డీసీసీ అధ్యక్షుల శిక్షణా శిబిరంలో పాల్గొని దిశానిర్దేశం
- తెలంగాణలో రెండు రాజ్యసభ స్థానాల ఎన్నికలపై ప్రధానంగా చర్చ
- అభ్యర్థుల ఎంపికపై కసరత్తు.. రేసులో పలువురు సీనియర్ నేతలు
- రెండు సీట్లు గెలుచుకోవడంపై ధీమాతో ఉన్న కాంగ్రెస్ అధిష్ఠానం

- మిగతా 2లో

## దుబాయ్ లో చిక్కుకుపోయిన తుమ్మల నాగేశ్వరరావు.. క్షేమంగా ఉన్నానని వెల్లడి



- దుబాయ్‌పై క్షిపణులు ప్రయోగించిన ఇరాన్
- దుబాయ్ విమానాశ్రయంలో రాకపోకలు బంద్
- బంధువుని పరామర్శించేందుకు దుబాయ్ వెళ్లిన తుమ్మల

- మిగతా 2లో

## ఆరోగ్య బీమా రంగం... చైనా కంటే వెనుకబడి ఉన్న భారత్!

- భారత్‌లో 50 శాతం ఇన్సూరెన్స్ సంస్థలే కస్టమైజేషన్ సపోర్ట్ ఇస్తున్న వైనం
- చైనాలో ఇది 92 శాతంగా ఉందని ఏయాన్ నివేదిక వెల్లడి
- దేశంలో వేగంగా పెరుగుతున్న టెలీహెల్త్ సేవల వినియోగం
- అవగాహన లోపం, ధరల విషయంలో ఇంకా సవాళ్లు ఉన్నాయి

**పెన్ పవర్ డెస్క్:**భారతదేశంలో హెల్త్ ఇన్సూరెన్స్ రంగం వేగంగా డిజిటలైజ్ అవుతున్నప్పటికీ, క్లయింట్లకు అవసరమైన

- మిగతా 2లో




## తెలుగు రాష్ట్రాలపై భానుడి ప్రతాపం.. ఈసారి ఎండలు మామూలుగా ఉండవు!

- తెలుగు రాష్ట్రాల్లో ఎండలు మండుతాయన్న ఐఎండీ
- సాధారణం కంటే ఎక్కువ రోజులు వడగాల్పుల ప్రభావం
- ఉత్తర తెలంగాణ జిల్లాల్లో 45 డిగ్రీలు దాటే అవకాశం
- తమిళనాడులోనూ మూడు నెలల పాటు ఎండల తీవ్రత

**హైదరాబాద్ పెన్ పవర్:**తెలుగు రాష్ట్రాల ప్రజలకు భారత వాతావరణ శాఖ (ఐఎండీ) గట్టి హెచ్చరికలు జారీ చేసింది. ఈ ఏడాది మార్చి నుంచి మే నెల వరకు (ఎంఏఎం సీజన్...

- మిగతా 2లో






## రూ. 600ల కోట్ల విలువైన ప్రభుత్వ భూమికి హైడ్రా రక్షణ

- గంధంగూడలో 6.30 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని స్వాధీనం చేసుకున్న హైడ్రా
- ఐటీ కారిడార్ సమీపంలో రూ.600 కోట్ల విలువైన భూమి రక్షణ
- జలమండలికి కేటాయించిన స్థలంలో షెడ్ల తొలగింపు
- ఆక్రమణలు తొలగించి ఫెన్సింగ్ వేసిన అధికారులు
- సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ కోసం గతంలోనే స్థల కేటాయింపు

- మిగతా 2లో

# పెద్దల ఇళ్లను బుల్డోజర్లతో పడగొడతాం

- మొదటి పేజీ తరువాయి

గాంధీ సిద్ధాంతాలకే విరుద్ధమని మండిపడ్డారు. గతంలో ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీకి చెందిన కాలేజీల కూల్చివేత విషయంలో విద్యార్థుల పరీక్షలను సాకుగా చూపిన ప్రభుత్వం... ఇప్పుడు ఖమ్మంలో కూల్చివేతలు చేస్తున్నప్పుడు ఇంటర్ విద్యార్థుల పరీక్షలు, భవిష్యత్తు గుర్తుకు రాలేదా? అని ప్రశ్నించారు. ఒవైసీని ప్రసన్నం చేసుకోవడం కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం హిందువులపై కక్ష సాధింపు చర్యలకు దిగుతోందని బండి సంజయ్ ఆరోపించారు. హిందువులను జైల్లో వేస్తూ వేధింపులకు గురిచేస్తున్నారని, దీనికి ప్రజలంతా ఏకమై బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. బీజేపీ నేతలు తలుచుకుంటే కాంగ్రెస్ నాయకులు బయట తిరగలేరని, ఇప్పటికే ఆ పార్టీలో అంతర్యుద్ధం మొదలైందని ఎద్దేవా చేశారు. ఏఐసీసీ నేత రాహుల్ గాంధీ తెలంగాణ పర్యటనపై స్పందిస్తూ... ఆయన కేవలం 'మూటల' కోసమే రాష్ట్రానికి వచ్చారని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పాలన గాలికి వదిలేసి, ప్రజల ఆస్తులను ధ్వంసం చేస్తూ రాజకీయాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. పేదల పక్షాన బీజేపీ పోరాటం ఆగదని, అవసరమైతే బుల్డోజర్లతోనే సమాధానం చెబుతామని బండి సంజయ్ అన్నారు.

## ఎడిటర్ వ్యూ

# మోడీ తోనే ఢీ... కమలంలో కలవరం

గత పన్నెండేళ్ళుగా ఈ దేశాన్ని ఎంతో బలమైన నేతగా నరేంద్ర మోడీ ఏలుతున్నారు. అదే సమయంలో పార్టీని కూడా ఆయన గట్టిగానే తన ముద్రతో నడిపిస్తున్నారు. అధ్యక్షుడు ఎవరు ఉన్నా మోడీ ఇమేజ్ ముందు ఎవరూ పెద్దగా కనిపించని నేపథ్యం ఉంది. ఇదిలా ఉంటే 2014 లో మోడీ ఈ దేశానికి ప్రధాని అయ్యారు. అంతకు ఏడాది ముందు అంటే 2013లో ఆయన జాతీయ రాజకీయాల్లోకి వచ్చారు. బీజేపీకి ప్రధాని అభ్యర్థిగా ఆయన పార్టీ ఆమోదం పొందారు.

**బీజేపీ బలం :**

ఇదిలా ఉంటే మోడీ గుజరాత్ సీఎం గా ఉన్నపుడు జాతీయ రాజకీయాల్లోకి రాకముందు బీజేపీ సంస్థాగతంగా ఉన్న పరిస్థితి వేరు అని అగుర్తు చేస్తున్నారు. బీజేపీకి ప్రతీ రాష్ట్రంలో బలమైన నాయకత్వం ఉండేది. ఎంతో మంది నాయకులు రాష్ట్ర స్థాయిలో బాహుబలిగా కనిపించేవారు. అంతవరకూ ఎందుకు మోడీ గుజరాత్ లో తిరుగులేని లీడర్ గా ఉన్నారు. ఆయన అలా ఇమేజ్ పెంచుకోబట్టే జాతీయ స్థాయిలోకి కూడా సులువుగా రాగలిగారు. అయితే ఈ రోజున బీజేపీకి ఆ పరిస్థితి ఉందా అన్న ప్రశ్న వస్తోంది. రాష్ట్రాలలో సమర్ధవంతమైన నాయకత్వం కమలం పార్టీకి ఉందా అన్న చర్చ నడుస్తోంది.

**మోడీయే అభ్యర్ధిగా :**

దేశంలో ఎక్కడ ఎన్నికలు జరిగినా మోడీ ఒక వ్యూహం ప్రకారం అక్కడికి ప్రచారానికి వెళ్తారు అని అంటున్నారు. అంతే కాదు మోడీ ఆ రాష్ట్రంలో తానే ముఖ్యమంత్రి అభ్యర్థి అన్నంతగా విరివిగా ఎన్నికల సభలలో పాల్గొంటారు. ప్రత్యర్థులను ముగ్గులోకి లాగి వారి మీద విమర్శలు చేస్తారు. ప్రతి విమర్శలు కూడా ఉంటాయి. ఈ విధంగా ఎక్కడ అసెంబ్లీ ఎన్నికలు జరిగినా మోడీ వర్సెస్ అదర్స్ అన్నట్లుగా రాజకీయం సాగుతుంది. బీజేపీని గెలిపించడానికి ప్రధాని స్థాయిలో ఉన్న మోడీ రాష్ట్రాలకు ప్రచారానికి రావడం ఆయన జాతీయ రాజకీయాల్లోకి వచ్చాక వచ్చిన కొత్త ఒరవడి అని అంటున్నారు.

**వారికి ప్రోత్సాహం :**

అంతకు ముందు కూడా ప్రధానులు ప్రచారం చేసినా ఒకటి రెండు సభలతో సరిపెట్టేవారు, రాష్ట్రాలలో బలమైన నాయకులకు ప్రోత్సాహం లభించేది. దాంతో వారే ఎన్నికల వ్యూహాలను చూసుకునే వారు, ప్రత్యర్థులతో సరి జోడుగా నిలిచి గట్టిగా ఫైట్ చేసేవారు. జాతీయ నాయకత్వం మద్దతు ని పాక్షికంగా మాత్రమే తీసుకునే వారు అయితే ఇపుడు సీన్ మారడంతో రాష్ట్రాలలో బీజేపీకి బలమైన నాయకత్వం కనిపించడం లేదని అంటున్నారు ఒకవేళ బలంగా నాయకులు ఉన్న వారిని తగ్గించి కొత్త వారిని చాన్స్ ఇస్తూ పోతున్నారు. ఈ రోజున చూస్తే బీజేపీకి రాష్ట్రాలలో బలమైన నేతలు వేళ్ళ మీదనే కనిపిస్తారు అని అంటున్నారు. యూపీలో సీఎం యోగీ ఆదిత్యా నాథ్, మహారాష్ట్రలో దేవందర్ ఫడ్నవీస్ లాంటి వారు మాత్రమే ఉన్నారు. చాలా చోట్ల మాత్రం కొత్త వారే ఉన్నారు. ఇమేజ్ ని బిల్డప్ చేసుకునే లోగానే వారి ప్లేస్ మరొకరికి దక్కుతోంది అన్న చర్చ ఉంది.

**సంస్థాగతంగా ఫోకస్ :**

బీజేపీని తేడా గల పార్టీ అని గతంలో చెప్పుకునే వారు. ఆ పార్టీలో నాయకులు ముఖ్యం కాదు సంస్థ మాత్రమే ముఖ్యం. ఆ విధంగా చూస్తే కనుక పార్టీ కోసం అంతా కలసి పనిచేస్తారు. ఇక బలమైన నాయకులకు ప్రోత్సాహం కూడా లభిస్తూ ఉంటుంది. అయితే ఇపుడు ఆ స్థితి ఉందా అన్నదే పెద్ద ప్రశ్న. ఎందుకంటే ఈ ఏడాదిలోనే అనేక చోట్ల అసెంబ్లీలకు ఎన్నికలు జరుగుతున్నాయి. బీజేపీ తరపున మోడీ అమిత్ షా పెద్ద ఎత్తున ప్రచారం చేయడానికి రంగం సిద్ధం అవుతోంది. మరి ఆయా రాష్ట్రాలలో సీఎం అభ్యర్ధి కానీ బలమైన నేతలు కానీ ఉన్నారా అన్నదే కమలం పార్టీలో కలవరం రేపుతున్న అంశం. మోడీ ఉన్నంతవరకూ బీజేపీకి ఢోకా లేకపోవచ్చు. కానీ ఆయన రాజకీయ విరామం తీసుకుంటే బీజేపీ మళ్ళీ మొదటి నుంచి మొదలెట్టాలా అన్నదే పెద్ద ప్రశ్న మరి.

# ఏపీ, తెలంగాణ కాంగ్రెస్ నేతలతో రాహుల్ గాంధీ సమావేశం

లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ సీనియర్ నాయకులు రాహుల్ గాంధీ ఇవాళ తెలంగాణలో పర్యటించారు. తెలంగాణ, ఏపీ కాంగ్రెస్ పార్టీల రాజకీయ వ్యవహారాల కమిటీల (పీఏసీ) సంయుక్త సమావేశంలో ఆయన పాల్గొన్నారు. వికారాబాద్‌లోని ఎస్ఏపీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీలో ఈ సమావేశం జరిగింది. పార్టీ సంస్థాగత బలోపేతం, ముఖ్యంగా తెలంగాణలో జరగనున్న రాజ్యసభ ఎన్నికలపై ఈ పర్యటనలో ప్రధానంగా చర్చలు జరిగాయి. ఇవాళ ఉదయం ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో కలిసి శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్న రాహుల్ గాంధీకి సీఎం రేవంత్ రెడ్డి ఘన స్వాగతం పలికారు. అక్కడి నుంచి సీఎం రేవంత్‌తో కలిసి ఆయన వికారాబాద్‌కు బయలుదేరారు. వికారాబాద్‌లో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రాహుల్‌కు స్వాగతం పలికారు. పీఏసీ సమావేశం అనంతరం రాహుల్ గాంధీ అనంతగిరి హిల్స్‌లోని హరిత రిసార్ట్‌కు వెళ్లారు. అక్కడ తెలంగాణ, ఏపీకి చెందిన నూతన డీసీసీ అధ్యక్షుల కోసం ఏర్పాటు చేసిన 10 రోజుల శిక్షణా శిబిరం ముగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు. క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేసే లక్ష్యంతో ఈ శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షులను ఉద్దేశించి రాహుల్ ప్రసంగించి, పార్టీని బలోపేతం చేయడానికి సమర్థవంతంగా పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. ఈ పర్యటనలో భాగంగా తెలంగాణలో ఖాళీ అవుతున్న రెండు రాజ్యసభ స్థానాల ఎన్నికలపై రాహుల్ గాంధీ రాష్ట్ర నాయకత్వంతో చర్చించారు.

ఈ నెల 16న ఎన్నికలు జరగనుండగా, నామినేషన్ల దాఖలుకు 5 చివరి తేదీ. కాంగ్రెస్ సీనియర్ నేతలు శ్యామ్ మోహన్ అనంతుల, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, వి. హనుమంతరావు, ప్రణాళికా సంఘం ఛైర్మన్ జి. చిన్నారెడ్డి, మాజీ ఎంపీ మధు యాష్కీ గౌడ్, రైతు సంక్షేమ కమిషన్ ఛైర్మన్ ఎం. కోదండరెడ్డి తదితరులు రాజ్యసభ టికెట్లను ఆశిస్తున్నారు. ప్రస్తుతం సిట్టింగ్ సభ్యులుగా ఉన్న అభిషేక్ మను సింఘ్వీ, కేఆర్ సురేశ్ రెడ్డి పదవీకాలం ఏప్రిల్ 9తో ముగియనుంది. 119 మంది సభ్యులున్న అసెంబ్లీలో కాంగ్రెస్‌కు 66 మంది ఎమ్మెల్యేలు, మిత్రపక్షం సీపీఐకి ఒకరు, స్నేహపూర్వక పార్టీ ఎంఐఎంకు ఏడుగురు సభ్యుల మద్దతు ఉండటంతో రెండు స్థానాలనూ సునాయాసంగా గెలుచుకునే అవకాశం ఉంది. సింఘ్వీని మళ్లీ నామినేట్ చేసేందుకు కాంగ్రెస్ అధిష్ఠానం మొగ్గు చూపుతున్నట్లు సమాచారం. అభ్యర్థులపై అధికారిక ప్రకటన ఈ నెల 4న వెలువడే అవకాశం ఉంది.

### దుబాయ్ లో చిక్కుకుపోయిన తుమ్మల నాగేశ్వరరావు..

# క్షేమంగా ఉన్నానని వెల్లడి

అమెరికా, ఇజ్రాయెల్ – ఇరాన్ మధ్య రేగిన భీకర పోరు ప్రపంచ దేశాల్లో ఆందోళన కలిగిస్తోంది. ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ మృతికి ప్రతీకారంగా ఇరాన్ క్షిపణులతో విరుచుకుపడుతుండటంతో గల్ఫ్ దేశాలన్నీ యుద్ధ క్షేత్రాలుగా మారాయి. ఈ అనూహ్య పరిణామాల నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దుబాయ్‌లో చిక్కుకుపోయారు. తన కుటుంబ సభ్యుల్లో ఒకరు అనారోగ్యానికి గురి కావడంతో వారిని పరామర్శించేందుకు ఐదు రోజుల క్రితమే ఆయన దుబాయ్ వెళ్లారు.

అయితే ఇరాన్ తన క్షిపణి దాడుల లక్ష్యాన్ని యూఏఈ, కువైట్, ఖతార్ వంటి దేశాల్లోని అమెరికా సైనిక స్థావరాలు, విమానాశ్రయాల వైపు మళ్లించడంతో అక్కడ యుద్ధ వాతావరణం నెలకొంది. భద్రతా కారణాల దృష్ట్యా దుబాయ్ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని అక్కడి ప్రభుత్వం తాత్కాలికంగా మూసివేయడంతో పాటు అన్ని విమాన సర్వీసులను రద్దు చేసింది. ప్రస్తుతం దుబాయ్‌పై ఇరాన్ దాడుల నేపథ్యంలో అక్కడి జనజీవనం పూర్తిగా స్థంభించిపోయింది. విమానాల రాకపోకలు నిలిచిపోవడంతో తుమ్మల నాగేశ్వరరావు తన కుటుంబంతో కలిసి అక్కడే ఉండిపోవాల్సి వచ్చింది. ప్రస్తుతం

ఆయన సురక్షితంగానే ఉన్నప్పటికీ, విమానాశ్రయ అధికారులు క్లియరెన్స్ ఇచ్చే వరకు స్వదేశానికి తిరిగి రావడం సాధ్యం కాదని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో తుమ్మల స్పందిస్తూ... తాను సురక్షితంగానే ఉన్నానని తెలిపారు. విమాన సర్వీసులు ప్రారంభమైన వెంటనే హైదరాబాద్ కు బయల్దేరుతానని చెప్పారు.

# రూ. 600ల కోట్ల విలువైన ప్రభుత్వ భూమికి హైడ్రా రక్షణ

హైదరాబాద్ నగరంలో ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణే ధ్యేయంగా ఏర్పడిన హైడ్రా మరో భారీ ఆపరేషన్ చేపట్టింది. ఐటీ కారిడార్‌కు ఆనుకుని ఉన్న గంధంగూడ ప్రాంతంలో అత్యంత విలువైన ప్రభుత్వ భూమిని ఆక్రమణదారుల చెర నుంచి విడిపించింది. సుమారు రూ.600 కోట్ల విలువ చేసే 6.30 ఎకరాల స్థలాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం గంధంగూడ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 86/పి లో ఉన్న 6.30 ఎకరాల ప్రభుత్వ భూమిని సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ నిర్మాణం కోసం ప్రభుత్వం గతంలోనే జలమండలికి కేటాయించింది. అయితే, ఈ విలువైన స్థలంపై కన్నేసిన కొందరు అక్రమార్కులు రకరకాల పేర్లతో ఆక్రమణలకు పాల్పడుతూ వచ్చారు. అంతేకాకుండా, ఆ స్థలంలో అనధికారికంగా షెడ్లను కూడా నిర్మించి కబ్జా చేశారు. ఈ విషయంపై జలమండలి అధికారుల నుంచి వచ్చిన విజ్ఞప్తి మేరకు హైడ్రా రంగంలోకి దిగింది. మున్సిపల్, రెవెన్యూ అధికారులతో కలిసి హైడ్రా బృందం క్షేత్రస్థాయిలో పక్కాగా సర్వే నిర్వహించింది. ఇది ప్రభుత్వ భూమేనని నిర్ధారించుకున్న అనంతరం, అక్కడ వెలసిన అక్రమ నిర్మాణాలను, షెడ్లను అధికారులు కూల్చివేశారు. ఆక్రమణలన్నీ తొలగించిన తర్వాత మొత్తం 6.30 ఎకరాల స్థలం చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. భవిష్యత్తులో ఆక్రమణలకు తావులేకుండా ఇది ప్రభుత్వ స్థలం అని స్పష్టం చేస్తూ హైడ్రా హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేసింది.

# వారికి ఇష్టం లేకపోతే రంగులు చల్లొద్దు

హైదరాబాద్‌లో హోలీ పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని, ఇతరులకు ఇబ్బంది కలిగించేలా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని నగర పోలీస్ కమిషనర్ వి.సి.సజ్జనార్ హెచ్చరించారు. సోమవారం ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌లో పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన ఆయన.. పండుగ నేపథ్యంలో నగరంలో పలు ఆంక్షలు విధించారు. ఎవరికైనా ఇష్టం లేకపోతే, లేని వారిపై బలవంతంగా రంగులు చల్లడం, పాదచారులు, వాహనాలపై రంగులు లేదా రంగు నీళ్లు చల్లడం నిషేధమని స్పష్టం చేశారు. ప్రస్తుతం రంజాన్ మాసం కొనసాగుతున్నందున ముస్లింల ప్రార్థనలకు ఎలాంటి ఆటంకం కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. సమస్యాత్మక ప్రాంతాల్లో అదనపు భద్రత ఏర్పాటు చేయాలని, పీస్ కమిటీలతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. నగరవ్యాప్తంగా విజిబుల్ పోలీసింగ్, బ్లూ కోల్ట్స్, పెట్రోలింగ్ సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించే ఆకతాయిలపై షీ టీమ్స్ ప్రత్యేక నిఘా ఉంచుతాయని తెలిపారు. హోలీ వేడుకల్లో డీజేలకు అనుమతి లేదని, రసాయన రంగులకు బదులుగా సహజ రంగులు వాడాలని సీపీ సూచించారు. యువకులు రోడ్లపై గుంపులుగా తిరుగుతూ న్యూసెన్స్ చేస్తే వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. మంగళవారం ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో మద్యం దుకాణాలు, బార్లు, కల్లు కాంపౌండ్లు మూసివేయాలని ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై సిటీ పోలీస్ యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తామని, ఎక్కడైనా సమస్య తలెత్తితే వెంటనే డయల్ 100కు సమాచారం ఇవ్వాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# తెలుగు రాష్ట్రాలపై భానుడి ప్రతాపం.. ఈసారి ఎండలు మామూలుగా ఉండవు!

- మొదటి పేజీ తరువాయి

మార్చి–ఏప్రిల్–మే) ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఎండల తీవ్రత అత్యధికంగా ఉండనుందని స్పష్టం చేసింది. సాధారణంగా వేసవిలో ఉండే ఉష్ణోగ్రతల కంటే ఈసారి పరిస్థితి మరింత తీవ్రంగా ఉంటుందని, ముఖ్యంగా వడగాల్పుల రోజులు గణనీయంగా పెరుగుతాయని ఐఎండీ డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ్ మహాపాత్ర వెల్లడించారు. ఇప్పటికే ఫిబ్రవరి నెలలో 2001 తర్వాత అత్యల్ప వర్షపాతం నమోదు కావడం, చలి తీవ్రత తక్కువగా ఉండటం రాబోయే కఠిన వేసవికి సంకేతాలని అధికారులు విశ్లేషిస్తున్నారు.

**తెలంగాణ, ఏపీల్లో పరిస్థితి ఇలా..**

ఈ వేసవిలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో వడగాల్పులు వీచే రోజుల సంఖ్య 3 నుంచి 15 రోజుల వరకు, కొన్ని ప్రాంతాల్లో అంతకంటే ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. ముఖ్యంగా తెలంగాణలోని ఉత్తర జిల్లాలపై సూర్యుడు నిప్పులు చెరిగే ప్రమాదం ఉంది. నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, కామారెడ్డి, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, మెదక్, సిద్దిపేట్, హనుమకొండ జిల్లాల్లో పగటి ఉష్ణోగ్రతలు 45 డిగ్రీల సెల్సియస్‌ను దాటే అవకాశాలు మెండుగా ఉన్నాయి. గత ఏడాదితో పోలిస్తే ఈసారి ఎండల తీవ్రత ఎక్కువగా ఉంటుందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. హైదరాబాద్‌లోనూ ఉష్ణోగ్రతలు 42 డిగ్రీల పైనే నమోదయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. ఎన్సో న్యూట్రల్ పరిస్థితులు ఏర్పడుతుండటంతో వాతావరణంలో ఈ మార్పులు చోటుచేసుకుంటున్నాయి.

**ఆరోగ్య భద్రత ముఖ్యం**

తీవ్రమైన ఎండల కారణంగా వృద్ధులు, చిన్నారులు, దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలు ఉన్నవారు బయట తిరగడం తగ్గించుకోవాలని ఐఎండీ సూచించింది. పెరిగే ఉష్ణోగ్రతలు ప్రజల ఆరోగ్యంపైనే కాకుండా నీటి వనరులు, విద్యుత్ డిమాండ్‌పైనా తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. ప్రభుత్వ యంత్రాంగం, స్థానిక సంస్థలు నీటి ఎద్దడి తలెత్తకుండా, వడదెబ్బ మరణాలు సంభవించకుండా ముందుగానే ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని వాతావరణ శాఖ సూచించింది.

**తమిళనాడులో మిశ్రమ వాతావరణం**

మరోవైపు పొరుగున ఉన్న తమిళనాడులోనూ పరిస్థితి భిన్నంగా ఏమీ లేదు. అక్కడ కూడా మార్చి నుంచి మే వరకు మూడు నెలల పాటు తీవ్రమైన ఉష్ణోగ్రతలు నమోదవుతాయని ఐఎండీ తెలిపింది. ముఖ్యంగా ఆ రాష్ట్ర ఉత్తర జిల్లాల్లో సాధారణం కంటే 2 నుంచి 3 డిగ్రీల ఉష్ణోగ్రతలు ఎక్కువగా నమోదు కానున్నాయి.

అయితే, కోమరిన్ ప్రాంతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావంతో పశ్చిమ కనుమల ప్రాంతాల్లోని జిల్లాల్లో మాత్రం రాబోయే రెండు నుంచి ఐదు రోజుల పాటు మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని, ఇది స్థానికులకు కాస్త ఉపశమనం కలిగించవచ్చని వాతావరణ కేంద్రం పేర్కొంది. మిగిలిన ప్రాంతాల్లో మాత్రం పొడి వాతావరణంతో పాటు, చెన్నై వంటి నగరాల్లో ఉదయం వేళల్లో పొగమంచు కనిపించే అవకాశం ఉంది.

### బీసీ రిజర్వేషన్లపై పార్లమెంటులో

# ప్రైవేటు బిల్లు

- మొదటి పేజీ తరువాయి

అని విమర్శించారు. కానీ కాంగ్రెస్‌కు అధికారం ముఖ్యం కాదని అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు భయపడుతున్నారని అన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, ఓ కాంగ్రెస్ కార్యకర్తగా నేను కోరుకునేది ఒకటేనని, రాహుల్ గాంధీని ప్రధానిగా చేద్దామని పిలుపునిచ్చారు. ఈ వ్యాఖ్యలపై స్పందించిన రాహుల్ గాంధీ మోదీపై యుద్ధానికి సిద్ధమని అన్నారు. డీసీసీ శిక్షణా తరగతుల ఈ ముగింపు కార్యక్రమంలో రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డితో పాటు ఏపీసీసీ చీఫ్ షర్మిల తదితరులు పాల్గొన్నారు.

# ఇరాన్ తాత్కాలిక సుప్రీం లీడర్ ఎయిర్ స్ట్రైక్స్ లో హతమయ్యాడా?

- మొదటి పేజీ తరువాయి

సుప్రీం లీడర్‌గా బాధ్యతలు చేపట్టారు. బాధ్యతలు చేపట్టిన గంటల్లోనే ఆయన కూడా ఈ వైమానిక దాడుల్లో మృతి చెందినట్లుగా తెలుస్తోంది. అయితే ఈ మృతిని ఇరాన్ అధికార వర్గాలు ధృవీకరించవలసి ఉంది. ఖమేనీ హత్యను మొదట ఇజ్రాయెల్ అధికారులు ప్రకటించారు. ఆ తర్వాత ఇరాన్ అధికారులు ధృవీకరించారు. ఇదిలా ఉండగా, ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ లక్ష్యంగా ఇరాన్ దాడులు నిర్వహిస్తోంది. ఇజ్రాయెల్ ప్రధానమంత్రి కార్యాలయంపై వైమానిక దాడులు చేస్తోంది.

# టీ20 ప్రపంచకప్‌లో కెనడా ఆడడం సంతోషం కలిగించింది

- మొదటి పేజీ తరువాయి

కార్యకలాపాల కారణంగా దెబ్బతిన్న ద్వైపాక్షిక సంబంధాలను పునరుద్ధరించుకునే దిశగా ఇరువురు నేతలు చర్చలు జరిపారు. ఈ సమావేశంలో ప్రధాని మోదీ మాట్లాడుతూ.. "మీలో చాలామంది క్రికెట్‌ను గమనిస్తూనే ఉంటారు. భారత్ వేదికగా జరుగుతున్న టీ20 వరల్డ్ కప్‌లో కెనడా జట్టు ఆడటం మనందరికీ ఎంతో సంతోషాన్నిచ్చింది. టీ20 క్రికెట్‌లో వేగవంతమైన నిర్ణయాలు, భయంలేని స్ట్రోక్స్, మ్యాచ్ విన్నింగ్ పార్ట్‌నర్‌షిప్‌లు ఎలా ఉంటాయో.. అలాగే భారత్, కెనడా కూడా కలిసి భవిష్యత్తును తీర్చిదిద్దుకుంటాయి" అని పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తితో భారత్ అభివృద్ధి ప్రయాణంలో భాగం కావాలని ఆయన పారిశ్రామికవేత్తలను ఆహ్వానించారు. మరోవైపు, భారత్‌లో జరిగిన 2026 ఐసీసీ మెన్స్ టీ20 వరల్డ్ కప్‌లో కెనడా ప్రదర్శన అంతంతమాత్రంగానే సాగింది. గ్రూప్–డిలో దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్, ఆఫ్ఘనిస్తాన్, యూఏఈ వంటి జట్లతో పోటీపడిన కెనడా.. ఆడిన నాలుగు మ్యాచ్‌లలోనూ ఓటమిపాలై గ్రూప్ దశలోనే నిష్క్రమించింది. యూఏఈతో జరిగిన మ్యాచ్‌లో చివరి ఓవర్ వరకు పోరాడినా 5 వికెట్ల తేడాతో ఓడిపోయింది. బ్యాటింగ్‌లో అప్పుడప్పుడు మెరుపులు మెరిపించినా, నిలకడలేమి కారణంగా సూపర్–8 రేసులోకి రాలేకపోయింది.

# ఆ మూడు యుద్ధ విమానాలను కువైట్ పొరపాటున కూల్చింది

- మొదటి పేజీ తరువాయి

అమెరికా సెంట్రల్ కమాండ్ అధికారికంగా ధృవీకరించింది. అమెరికా కాలమానం ప్రకారం మార్చి 1వ తేదీ రాత్రి 11:03 గంటల సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఆ సమయంలో ఇరాన్ నుంచి యుద్ధ విమానాలు, డ్రోన్లు, బాలిస్టిక్ క్షిపణులతో దాడులు జరుగుతున్నాయి. ఈ తీవ్ర ఉద్రిక్తతల నడుమ.. అమెరికా విమానాలను శత్రువుల విమానాలుగా పొరబడిన కువైట్ బలగాలు కాల్పులు జరపడంతో అవి కూలిపోయాయి. దీన్నే సైనిక పరిభాషలో 'ఫ్రెండ్లీ ఫైర్' అంటారు. అదృష్టవశాత్తు మూడు విమానాల్లోని మొత్తం ఆరుగురు పైలెట్లు (ఎయిర్ క్రూ) పారాచూట్ల ద్వారా సురక్షితంగా కిందకు దిగారు. వారిని వెంటనే రక్షించామని, ప్రస్తుతం వారంతా ఆరోగ్యంగా ఉన్నారని అధికారులు తెలిపారు. ఈ ఘటనపై కువైట్ స్పందించిందని.. ఇది పొరపాటున జరిగిన చర్యగా అంగీకరించిందని యూఎస్ సెంట్రల్ కమాండ్ వెల్లడించింది. ఈ క్లిష్ట సమయంలో కువైట్ రక్షణ దళాలు అందిస్తున్న సహకారానికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు అమెరికా పేర్కొంది. ఘటనకు దారితీసిన పూర్తి కారణాలపై దర్యాప్తు జరుగుతోంది.

# ఆరోగ్య బీమా రంగం... చైనా కంటే వెనుకబడి ఉన్న భారత్!

- మొదటి పేజీ తరువాయి

విధంగా సేవలందిచడంలో (కస్టమైజేషన్) ఇంకా వెనుకబడే ఉందని ప్రముఖ సంస్థ 'ఏయాన్' తన తాజా నివేదికలో వెల్లడించింది. సోమవారం విడుదలైన ఈ నివేదిక ప్రకారం.. 1,000 కంటే ఎక్కువ ఉద్యోగులున్న సంస్థలకు కస్టమైజేషన్ సపోర్ట్ అందించడంలో చైనాలోని 92 శాతం బీమా సంస్థలతో పోలిస్తే, భారత్‌లో కేవలం 50 శాతం సంస్థలు మాత్రమే ముందంజలో ఉన్నాయి. భారత హెల్త్ ఇన్సూరెన్స్ రంగం కవరేజీని విస్తరిస్తున్నప్పటికీ.. అవగాహన లేకపోవడం, సేవల ప్రమాణాలు, సామాన్యులకు అందుబాటు ధరలు వంటి విషయాల్లో ఇంకా సవాళ్లను ఎదుర్కొంటోందని నివేదిక పేర్కొంది. దీనిపై ఏయాన్ ఏపీఏసీ వెల్బీయింగ్ సొల్యూషన్స్ హెడ్ సూసన్ ఫ్యానింగ్ మాట్లాడుతూ, "భారత హెల్త్ ఇన్సూరెన్స్ మార్కెట్ ప్రస్తుతం అత్యంత కీలక దశలో ఉంది. యజమానులు, ఉద్యోగుల నుంచి అంచనాలు పెరుగుతున్నాయి. ఖర్చులను అదుపులో ఉంచుతూనే, మెరుగైన ఫలితాలను అందించేందుకు బీమా సంస్థలు వినూత్న మార్గాలను ఎంచుకోవాల్సిన అవసరం ఉంది" అని అభిప్రాయపడ్డారు. దేశంలో టెలీహెల్త్ సేవలు బాగా విస్తరించాయని, సర్వే చేసిన వాటిలో 83 శాతం బీమా సంస్థలు జనరల్ ఫిజీషియన్ కన్సల్టేషన్లు, దీర్ఘకాలిక వ్యాధుల నిర్వహణ, ఈ–ప్రిస్క్రిప్షన్ వంటి సేవలను అందిస్తున్నాయని రిపోర్ట్ తెలిపింది. అయితే, వీటి వల్ల అవుతున్న ఖర్చు ఆదా మాత్రం చాలా తక్కువగా (1.1 నుంచి 1.5 శాతం మాత్రమే) ఉందని పేర్కొంది. అలాగే, 67 శాతం సంస్థలు ఫోన్, ఆన్‌లైన్ ద్వారా ఇంగ్లీష్, హిందీతో పాటు ప్రాంతీయ భాషల్లోనూ ఎంప్లాయీ అసిస్టెన్స్ ప్రోగ్రామ్ (ఈఏపీ) సేవలను అందిస్తున్నాయని, అయితే వీటి వినియోగం ఇంకా పెరగాల్సి ఉందని నివేదిక స్పష్టం చేసింది. మానసిక ఆరోగ్యానికి ప్రాధాన్యత పెరుగుతున్న తరుణంలో, స్థానిక అవసరాలకు తగ్గట్టుగా మార్పులు చేస్తేనే మెరుగైన ఫలితాలు ఉంటాయని సూచించింది.

# బుద్ధవనాన్ని విశ్వశాంతి కేంద్రంగా తీర్చిదిద్దుతాం



**హైదరాబాద్ పెన్ పవర్:** రాష్ట్రంలోని బౌద్ధక్షేత్రాలను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లడానికి ప్రభుత్వం తగు ప్రణాళికలతో ముందుకు సాగుతోందని పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. నాగార్జునసాగర్‌లో సోమవారం మూడో దమ్మ పాదయాత్ర ముగింపు కార్యక్రమానికి ఆయన కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామితో కలిసి హాజరై మాట్లాడారు. సాగర్‌లోని బుద్ధవనాన్ని అంతర్జాతీయ విశ్వశాంతి కేంద్రంగా తీర్చిదిద్దుతామన్నారు. ప్రపంచ శాంతిని కోరుతూ బౌద్ధ భిక్షువులు కలబురగి నుంచి సాగర్ వరకు పాదయాత్ర నిర్వహించడం సంతోషకరమని చెప్పారు. ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసి బుద్ధుడి బోధనలను గ్రామగ్రామానికి చేర్చడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మంత్రి వివేక్ మాట్లాడుతూ.. ప్రపంచంలోని ప్రతి ఒక్కరూ శాంతియుతంగా ఉండాలంటే బుద్ధుడి బోధనలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాగార్జునసాగర్ ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పెన్ పవర్
తెలంగాణ రౌండప్

# ప్రేమించి-మత్తిచ్చి..! లైంగిక దాడులు

## బాచుపల్లి "వీఎన్ఆర్ విజ్ఞాన్ జ్యోతి" కళాశాలలో ఈ ఘోరం..

ప్రేమ పేరుతో మోసంచేసి మత్తు చాక్లెట్‌లను తినిపించి లోబర్చుకున్న వైనం.. ఆపై లైంగిక దాడి వీడియోలు చిత్రీకరణ.. బ్లాక్ మెయిల్ చేస్తూ పలుమార్లు లైంగిక దాడికి పాల్పడిన ఈ ఘటన వీఎన్ఆర్ విజ్ఞాన్ జ్యోతి కళాశాలలో వెలుగులోకి వచ్చింది.. ఈ ఘటనా వ్యవహారాన్ని కళాశాల యాజమాన్యం దృష్టికి తీసుకెళ్ళగా.. సెల్ఫ్ డిక్లరేషన్‌తో సరిపెట్టిన కళాశాల న్యాయం కోసం బాచుపల్లి పోలీసులను ఆశ్రయించిన బాధితులు, బాధితురాలు తల్లి ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని విచారణ చేసిన పోలీసులు ఇద్దరు నిందితులని రిమాండ్‌కి తరలించారు..

మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, మార్చి 2:



హైదరాబాద్ కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని "వీఎన్ఆర్ విజ్ఞాన్ జ్యోతి" కళాశాలలో ప్రేమ పేరుతో తోటి విద్యార్థిని పట్ల దారుణమైన రీతిలో లైంగిక దాడికి పాల్పడిన ఘటన ఇప్పుడు స్థానికంగా సంచలనం సృష్టించింది. బాధితురాలు మీడియా ముందుకు వచ్చి తన వేదన వెల్లడించడంతో విషయం వెలుగులోకి వచ్చింది.. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం వీఎన్ఆర్ విజ్ఞాన్ జ్యోతి కళాశాలలో ఇంజనీరింగ్ చదువుతుంది.. బాధితురాలు వాంగ్మూలం ప్రకారం తన క్లాస్మేట్ ఆశిష్ ప్రేమ పేరుతో వెంటపడి నమ్మకం కలిగించాడని.. ప్రేమిస్తున్నట్లు చెప్పి ప్రపోజ్ చేసి ఆమెకు దగ్గరయ్యాడు. ఆశిష్‌పై నమ్మకం వచ్చేలా ప్రవర్తించాడు.. ఆతర్వాత 2024 లో ఒక రోజు క్లాస్‌రూమ్‌లోనే ఆమెను లోబర్చుకున్నాడని బాధితురాలు ఆరోపించింది.. ఆ సమయంలో సెక్యూరిటీ సిబ్బంది వారిని గుర్తించి హెచ్‌ఓడీ వద్దకు తీసుకెళ్లినట్లు తెలిపింది.. ఓవైపు ఇలా కళాశాలలో అంతర్గతంగా విచారణ జరుగుతుండగానే, నిందితుడు ఆశిష్ అంతటితో ఆగకుండా, పలు సందర్భాల్లో, చాక్లెట్ రూపంలో ఉన్న మాదకద్రవ్యాలు మత్తు పదార్థాలను ఇచ్చి బాధితురాలిపై అనేకసార్లు లైంగిక దాడి చేశాడని ఆమె ఆరోపించింది..

### లైంగిక దాడి వీడియోలతో బ్లాక్ మెయిల్..

అదేవిధంగా లైంగిక దాడి చేసిన వీడియోను చిత్రీకరించి బాధితురాలిని పదే పదే కోరిక తీర్చాలని ఆశిష్ వేధించినట్లు వాంగ్మూలంలో పేర్కొంది.. అంతేకాకుండా, తనను కడపకు తీసుకెళ్లి తెలిసిన వారి ఇంట్లో ఉంచి, మత్తిచ్చి చాలాసార్లు లైంగిక దాడులకు పాల్పడినట్లు తెలిపింది.. తనకు మెల్కువ వచ్చే వరకు తనపై ఏమి జరిగిందో తెలిసేది కాదని, పీరియడ్స్ వచ్చినా, ఆరోగ్యం సహకరించకపోయినా వినేవాడు కాదని పేర్కొంది.. ఆశిష్ లైంగిక దాడి చేయడమే కాకుండా మరో వ్యక్తి ప్రవీణ్‌తో కూడా సంబంధం పెట్టుకోవాలని బలవంతం చేశాడని ఆరోపించింది. ఒక రోజు ప్రవీణ్ తన హాల్ టికెట్టు బలవంతంగా తీసుకుని గండిమైసమ్మలోని ఓ లాడ్జ్‌కు రావాల్సిందిగా ఇబ్బంది పెట్టడంతో పరీక్షలు పోతాయని వెళితే ప్రవీణ్ లైంగిక దాడికి పాల్పడగా పారిపోయి వచ్చానని ఇక ఈ దారుణాలు తట్టుకోలేక ఇంట్లో తండ్రులకు చెప్పానని, పేరెంట్స్ సహాయంతో బాచుపల్లి పోలీసులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశామని బాధితురాలు పేర్కొంది..

- ప్రేమ వలలో బంధించి..! మాదకద్రవ్యాలతో మత్తిచ్చి క్లాస్‌మేట్స్ లైంగికంగా దాడులు..!
- ఆపై వీడియోలు చిత్రీకరించి బ్లాక్‌మెయిల్‌కు పాల్పడి బెదిరింపులు..
- కళాశాల యాజమాన్యం దృష్టికి తీసుకెళ్ళినా ప్రయోజనం శూన్యం..
- 'సెల్ఫ్ డిక్లరేషన్'తో సరిపెట్టిన యాజమాన్యం..
- విద్యార్థిని(బాధితురాలు) క్లాస్మేట్ ఆశిష్ ప్రేమ పేరుతో మోసం..
- మత్తు పదార్థాలు ఇచ్చి పలుమార్లు లైంగిక దాడి చేశాడని బాధితురాలు ఆరోపణ..
- దాడి వీడియోలు తీసి తరచూ "కోరిక తీర్చాలంటూ బ్లాక్‌మెయిల్..
- మరో యువకుడు ప్రవీణ్‌తో సంబంధం పెట్టుకోవాలని ఒత్తిడి లాడ్జ్‌లో దాడి యత్నం.
- కాలేజీ యాజమాన్యం కేవలం సెల్ఫ్ డిక్లరేషన్ తీసుకుని వదిలేసిందని ఆరోపణ..
- బాచుపల్లి పియస్‌లో కేసు నమోదు ఇద్దరు నిందితులు రిమాండ్‌కు..



ఆశిష్.. బాధితురాలును ప్రేమ పేరుతో మొదట లైంగిక దాడికి పాల్పడిన నిందితుడు..



ప్రవీణ్.. ఆశిష్ ఫ్రెండ్.. లైగిక దాడిలో మరో నిందితుడు..

### వేదింపులు తాళలేక ఆత్మహత్యా యత్నం..

ఇదిలా ఉండగా నిందితుడి మానసిక వేధింపులు తాళలేక బాధితురాలు ఓ సారి ఆత్మహత్యా యత్నానికి ప్రయత్నించినట్టు తెలిపింది.. బాధితురాలు తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న బాచుపల్లి పోలీసులు నిందితులను "ఆశిష్- ప్రవీణ్"లపై కఠిన చర్యలు తీసుకోవాలని వేడుకుంది.. కలశాల యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లగా పట్టించుకోక పోవడం "కేవలం సెల్ఫ్ డిక్లరేషన్" తీసుకుని వదిలేసి నిర్లక్ష్యం వహించడంతో నిధితులను చట్టం ముందు నిలబెట్టాలని బాధితురాలి తల్లి ఫిర్యాదు చేసింది.. బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన బాచుపల్లి పోలీసులు నిందితులు "ఆశిష్- ప్రవీణ్"లు వీడియోల ద్వారా బ్లాక్‌మెయిల్, లైంగిక దాడి, బెదిరింపుల అంశాలపై కేసు నమోదు చేసి ఇరువురిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కి తరలించారు..

## బాల్క సుమన్‌కు షరతులతో కూడిన బెయిల్ మంజూరు

- మంత్రి వివేక్ కాన్వాయ్‌పై దాడి కేసులో బాల్క సుమన్ అరెస్టు
- సుమన్‌తో పాటు ముగ్గురుకు బెయిల్ మంజూరు
- ప్రతి ఆదివారం పీఎస్‌లో హాజరు కావాలని షరతు

-4 లో



01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసీఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
'ఐదు రోజులకు'
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి'
93948 55244
షరతులు వర్తిస్తాయి

# ఏసీబీ వలలో.. జూనియర్ అసిస్టెంట్ గణేష్..

## ఏసీబీ వలలో.. జూనియర్ అసిస్టెంట్ గణేష్..






ఏసిబికి ఉన్నపళంగా దొరికిన కుత్బుల్లాపూర్ జూనియర్ అసిస్టెంట్ జి.గణేష్..

- లంచం తీసుకుంటుండగా ఉన్నపళంగా పట్టుకున్న "అనిశా" అధికారులు..
- గణేష్‌కు ఇన్‌చార్జ్ "విఆర్వో" బాధ్యతలు కూడా అప్పగించినట్లు సమాచారం..
- ఫ్యామిలి మెంబర్ సర్టిఫికేట్ జారీకి లంచం డిమాండ్ చేసిన జూనియర్ అసిస్టెంట్..
- నిందితుడి నుండి రూ.15 వేలు స్వాధీన పరచుకున్న ఏసిబి అధికారులు..

-4 లో

# ఉద్యోగ విరమణ బకాయిలపై అసెంబ్లీలో ప్రభుత్వాన్ని నిలదీస్తాం

## రాష్ట్రంలో గడ్డపార రాజ్యం నడుస్తోంది: రామచందర్‌రావు



**హైదరాబాద్ పెన్ పవర్:** ఉద్యోగ విరమణ పొందిన వారికి దక్కాల్సిన ఆర్థిక ప్రయోజనాలను అందించకుండా వారి సమస్యలను ఓటు బ్యాంకు కోణంలో చూడటం సరికాదని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు పేర్కొన్నారు. విశ్రాంత ఉద్యోగులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులకు రావాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్ ఇందిరాపార్క్ ధర్నాచౌక్ వద్ద సోమవారం భాజపా ఆధ్వర్యంలో నిరాహారదీక్ష చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 'ఓటు బ్యాంకు తక్కువని పదవీ విరమణ చేసినవారి రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వకుండా వేధిస్తున్నారా? ఉద్యోగులు, పెన్షనర్ల హక్కులను కాపాడేందుకు భాజపా పోరాటం కొనసాగుతుంది. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీకి తెలంగాణకు వచ్చే నైతిక అర్హత ఎక్కడిది? కాంగ్రెస్ పాలనలో పేదల ఇళ్లను కూల్చేస్తున్నారు. తెలంగాణ గడ్డపార రాజ్యంగా మారిపోయింది' అని విమర్శించారు. ఈ కార్యక్రమంలో భాజపా శాసన సభాపక్షనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, భాజపా జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, ఎంపీలు ఈటల రాజేందర్, రఘునందన్‌రావు, ఎమ్మెల్యేలు వెంకటరమణారెడ్డి, పైడి రాకేశ్‌రెడ్డి, సూర్యనారాయణగుప్తా,

-4 లో





ఏసిబికి ఉన్నపళంగా దొరికిన కుత్బుల్లాపూర్ జూనియర్ అసిస్టెంట్ జి.గణేష్..

# ఏసీబీ వలలో... జూనియర్ అసిస్టెంట్ గణేష్

## కుత్బుల్లాపూర్ మండల రెవెన్యూ కార్యాలయంలో ఏసిబి దాడులు..

- లంచం తీసుకుంటుండగా ఉన్నపళంగా పట్టుకున్న "అనిశా" అధికారులు..
- గణేష్‌కు ఇన్‌చార్జ్ "విఆర్వో" బాధ్యతలు కూడా అప్పగించినట్లు సమాచారం..
- ఫ్యామిలి మెంబర్ సర్టిఫికేట్ జారీకి లంచం డిమాండ్ చేసిన జూనియర్ అసిస్టెంట్..
- నిందితుడి నుండి రూ.15 వేలు స్వాధీన పరచుకున్న ఏసిబి అధికారులు..



సిటీ రేంజ్-1 ఏసిబి అధికారి..

కుత్బుల్లాపూర్, పెన్ పవర్, మార్చి 2: మేడ్చల్ -మల్కాజ్‌గిరి జిల్లా కుత్బుల్లాపూర్ మండల తహసీల్దార్ కార్యాలయంలో అవినీతి అధికారి ఏసిబికి ఉన్నపళంగా దొరికి పోయాడు.. కుత్బుల్లాపూర్ ఎమ్మార్వో కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ విధులు నిర్వర్తిస్తున్న గణేష్‌కు "ఇన్‌చార్జ్ గ్రామపాలన అధికారి"గా కూడా బాధ్యతలు అప్పగించినట్టు సమాచారం.. రెండు విధులు నిర్వర్తిస్తున్న జి.గణేష్ లంచం తీసుకుంటూ ఉండగా ఏసీబీ అధికారులు రైడ్ చేసి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ దాడిలో ఏసీబీ సిటీ రేంజ్--1 యూనిట్ అధికారులు పాల్గొన్నారు.. ఫిర్యాదుదారు కుటుంబ సభ్యులకు సంబంధించిన, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికేట్‌ను జారీ చేయడానికి సంబంధిత జూనియర్ అసిస్టెంట్- (వీఆర్వో) రూ.20,000 లంచం డిమాండ్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి.. ఇందులో భాగంగా డీల్ కుదుర్చుకున్న నేపథ్యంలో ముందుగా రూ. 5,000 ముట్టినవి, మిగతా చెల్లింపులు సోమవారం జరగాల్సి ఉంది. మిగిలిన మొత్తం 15000 రూపాయలు సోమవారం చెల్లిస్తుండగా ఏసీబీ అధికారులు వలపన్ని పట్టుకున్నారు..

### నగదు స్వాధీన పరచుకున్న ఏసిబి..

లంచం తీసుకున్న అధికారుల నుంచి సంబంధిత నగదును స్వాధీనం చేసుకుని పట్టుబడ్డ వారిపై కేసు నమోదు చేశారు. చర్యలు చేపట్టిన ఏసీబీ అవినీతి ఆరోపణల నేపథ్యంలో కుత్బుల్లాపూర్ తహసీల్దార్ కార్యాలయంలో దాడి చేయగా పట్టుబడ్డ విఆర్వోను అరెస్టు చేసి, నాంపల్లిలోని ఎస్పీఈ అండ్ ఏసీబీ కేసుల అదనపు ప్రత్యేక న్యాయమూర్తి ముందు జ్యుడీషియల్ రిమాండ్‌కు హాజరు పరుస్తున్నారు.. కేసు దర్యాప్తు కొనసాగుతోంది. కేసు ముందుకు సాగే క్రమంలో మరిన్ని వివరాలు సేకరించేందుకు భద్రతా కారణాల దృష్ట్యా ఫిర్యాదుదారుడి వివరాలు రహస్యంగా ఉంచినట్లు ఏసీబీ అధికారులు వెల్లడించారు.ప్రజలకు ఏసీబీ విజ్ఞప్తిఏదైనా ప్రభుత్వ ఉద్యోగి లంచం డిమాండ్ చేసిన సందర్భంలో చట్టపరమైన చర్యల కోసం ఏసీబీ టోల్ ఫ్రీ నంబర్ 1064 ను సంప్రదించాలని విజ్ఞప్తి చేసింది. అదేవిధంగా వాట్సాప్ నెంబర్ (9440446106), ఫేస్‌బుక్ (తెలంగాణ ఏసీబీ), ఎక్స్ (పూర్వం ట్విట్టర్) ఏవశ్రీఖఅస్త్రుఖఆ ాజదీ ద్వారా కూడా ఫిర్యాదులు ఇవ్వవచ్చని తెలిపింది. ఫిర్యాదుదారుల వివరాలు గోప్యంగా ఉంచబడతాయని స్పష్టం చేసింది..

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని మూడు మండల రెవెన్యూ పరిధిలో, ప్రభుత్వ భూములు కబ్జాదారులకి ధారాదత్తం చేయడం, అక్రమంగా నాలా (వ్యవసాయేతర భూములుగా) కన్వర్శన్‌ల వ్యవహారాలు, కబ్జాదారులతో అంతర్గత ఒప్పందాల వ్యవహారంలో రెవెన్యూ అధికారులు కీలక పాత్ర పోషిస్తున్నారని తీవ్రమైన ఆరోపణలు వస్తున్నాయి.. "అవినీతి నిరోధక శాఖ" అధికారులు ఆ దిశగా కూడా దృష్టి సారిస్తే బాగుంటుందని నియోజకవర్గం ప్రజలు కోరుతున్నారు.. నియోజకవర్గంలో గాజులరామారం సర్కిల్- దుండిగల్ సర్కిల్ అధికారులపై దాడులు నిర్వహించి కేసులు చేసిన వ్యవహారంలో ప్రజలు ఏసిబి అధికారులను అభినందించారు.. మూడు మండలా ల్లోనూ ఏసిబి దృష్టి సారించాలని విజ్ఞప్తి వేస్తున్నారు..

# బాల్క సుమన్‌కు షరతులతో కూడిన బెయిల్ మంజూరు

**హైదరాబాద్ పెన్ పవర్:** బీఆర్ఎస్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌కు మంచిర్యాల జిల్లా కోర్టు బెయిల్ మంజూరు చేసింది. మంచిర్యాల జిల్లా క్యాతనపల్లి ఘటనలో ఆయనతో పాటు మరో ముగ్గురికి కోర్టు బెయిల్ మంజూరు చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. గత నెలలో జరిగిన మున్సిపల్ ఎన్నికల అనంతరం క్యాతనపల్లిలో ఉద్రిక్త పరిస్థితులు చోటు చేసుకున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఫిబ్రవరి 18న మంత్రి వివేక్ కాన్వాయ్‌పై జరిగిన దాడి కేసులో బాల్క సుమన్ అరెస్టయ్యారు. ప్రస్తుతం బాల్క సుమన్ ఆదిలాబాద్ జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. కోర్టు ఆయనకు రూ.25 వేల పూచీకత్తుతో షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. ప్రతి ఆదివారం రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్‌కు హాజరు కావాలని ఆదేశించింది. క్యాతనపల్లి మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు ఎక్కువ మంది విజయం సాధించారు. దీంతో చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక పలుమార్లు వాయిదాపడిన నేపథ్యంలో ఉద్రిక్తతలు తలెత్తాయి.

# ఉద్యోగ విరమణ బకాయిలపై అసెంబ్లీలో ప్రభుత్వాన్ని నిలదీస్తాం

- 3 పేజి తరువాయి

ఎమ్మెల్సీ అంజిరెడ్డి, రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, నాయకులు గువ్వల బాలరాజు తదితరులు పాల్గొన్నారు.


**ఆరు గ్యారంటీలపై రాహుల్ సమీక్షేదీ..?: కె.లక్ష్మణ్**

రాష్ట్రానికి వచ్చిన రాహుల్ గాంధీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు, ఆరు గ్యారంటీల అమలుపై కనీసం సమీక్ష చేయలేదని ఎంపీ, భాజపా ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డా.కె.లక్ష్మణ్ సోమవారం ఒక ప్రకటనలో ధ్వజమెత్తారు. 'గత ఎన్నికల్లో రైతులు, యువత, మహిళలు, నిరుద్యోగులు, అన్నివర్గాలకు కాంగ్రెస్ అనేక హామీలు ఇచ్చింది. అధికారంలోకి వచ్చాక మాత్రం వాటిని మర్చిపోయింది.' అని విమర్శించారు.

# మల్కాజ్ గిరిలో భారీగా గంజాయి స్వాధీనం.. కియా కారులో సప్లై చేస్తున్న ఇద్దరు అరెస్ట్..

**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్ లోని మల్కాజ్ గిరిలో భారీగా గంజాయి స్వాధీనం చేసుకున్నారు ఎస్ఓటీ పోలీసులు. గంజాయి సప్లై చేస్తున్న ఇద్దరు అంతర్రాష్ట్ర స్మగ్లర్లను అరెస్ట్ చేశారు పోలీసులు. సోమవారం ( మార్చి 2 ) అబ్దుల్లాపూర్ మెట్ ఓఆర్ఆర్ దగ్గర తనిఖీలు చేపట్టిన పోలీసులు కియా కారులో గంజాయి సప్లై చేస్తున్న ఇద్దరు ముఠా సభ్యులను అరెస్ట్ చేశారు. ఇందుకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి..మల్కాజ్ గిరి పోలీస్ స్టేషన్ పరిధిలో ఇద్దరు గంజాయి స్మగ్లర్స్ ను అరెస్ట్ చేశారు పోలీసులు. కియా కారులో గంజాయి తరలిస్తుండగా అబ్దుల్లాపూర్ మెట్ ఓఆర్ఆర్ దగ్గర ఇద్దరు ముఠా సభ్యులను అరెస్ట్ చేశారు పోలీసులు. నిందితులు ఒడిశాలోని గజపతి జిల్లాకు చెందిన నభిన్ సభర్,సుద్కర్ మండల్ గా గుర్తించారు పోలీసులు.నిందితుల నుంచి 164 కేజీల గంజాయి,కీయా కారు స్వాధీనం చేసుకున్నారు ఎస్ఓటి పోలీసులు. ఒడిశా నుండి గంజాయి తీసుకువచ్చి హైదరాబాద్ మీదుగా కర్ణాటక,మహారాష్ట్ర స్టేట్ లో సప్లై చేస్తున్నట్లు తెలిపారు పోలీసులు. అబ్దుల్లాపూర్ మెట్ ఓఆర్ఆర్ దగ్గర వెహికిల్ చెకింగ్ లో భాగంగా నిందితులను అరెస్ట్ చేసినట్లు తెలిపారు పోలీసులు. నిందితులు అనుమానం రాకుండా ఓఆర్ఆర్ వరకు కీయా కారులో గంజాయి తీసుకువచ్చి సప్లై చేస్తున్నట్లు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు పోలీసులు.






## వికారాబాద్లో రాహుల్ గాంధీ పర్యటన సామాన్యులకు తీవ్ర ఇబ్బందులు

వికారాబాద్:వికారాబాద్ జిల్లా వికారాబాద్ మండలంలోని అనంతగిరి ప్రాంతంలో ఉన్న హరిత హోటలో లో తెలంగాణఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల డీసీసీ అధ్యక్షుల ట్రైనింగ్ సెంటర్ ముగింపు కార్యక్రమం జరుగుతోంది. ఈ కార్యక్రమానికి రాహుల్ గాంధీ హాజరు అయిన నేపథ్యంలో పోలీసులు భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు.ఈ భద్రతా చర్యలు స్థానిక ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నాయని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. రాహుల్ గాంధీ వచ్చే మార్గంలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లే రోగులను పోలీసులు అడ్డుకుంటున్నారని స్థానికులు వాపోతున్నారు. అత్యవసర వైద్యం కోసం వెళ్లే వారికీ అనుమతి ఇవ్వడంలో ఆలస్యం జరుగుతోందని ఆరోపిస్తున్నారు.అదే మార్గంలో ఉన్న ఎస్ఏపీ కళాశాలలో ఇంటర్మీడియట్ పరీక్షలు రాయడానికి వెళ్తున్న విద్యార్థులను కూడా పోలీసులు ఆపే ప్రయత్నం చేస్తున్నారని సమాచారం. పరీక్షల సమయానికి ఆలస్యం అవుతుందన్న ఆందోళనతో విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఇక రాహుల్ గాంధీ పర్యటన సందర్భంగా నిరసనలు జరిగే అవకాశాలు ఉన్నాయని భావించిన పోలీసులు పలువురిని ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్లకు తరలించినట్లు తెలిసింది. భద్రతా చర్యలు అవసరమే అయినప్పటికీ, అత్యవసర సేవలు మరియు విద్యార్థుల పరీక్షలకు ఆటంకం కలగకుండా చూడాలని అధికారులను స్థానికులు కోరుతున్నారు.

## ఆలయ నిర్మాణానికి 50 లక్షలు విరాళామందించిన బీఆర్ఎస్ నేత



**పటాన్ చెరు:** కన్నవారు, పుట్టిన ఊరు నాకేమిచ్చిందని నిట్టూరుస్తున్న ఈ రోజుల్లో.. తల్లిదండ్రులకు గౌరవం తెచ్చే విధంగా బ్రతకాలి. పుట్టిన ఊరుకు చేతనైయినంత వరకు సాయం చేయాలి అనే దృఢ సంకల్పంతో సొంత ఊరికి, నిరుపేదలకు స్వచ్ఛందంగా సేవలు అందిస్తున్న బిఆర్ఎస్ నేత, రాజ్ కుమార్ ఫౌండేషన్ చైర్మన్ కాల్వగడ్డ రాజ్ కుమార్ మరోసారి హాట్ టాపిక్ గా వార్తల్లో నిలిచారు. పఠాన్ చెరువు నియోజకవర్గం, ముత్తంగి డివిజన్, కర్ధనూర్ గ్రామంలో పురాతన శ్రీ సిద్ధి వినాయక స్వామి ఆలయం ఎంతో పురాతనమైనది, వందల ఏళ్ళ చరిత్ర కలిగి ఉన్నప్పటికీ అభివృద్ధికి నోచుకోక శిదిలావస్థకు చేరుకుంటున్న తరుణంలో దాతల కోసం ఆలయ సిబ్బంది, గ్రామస్థులు ఎంతమందిని కలుస్తున్నా పెద్దగా స్పందన లభించకపోవడంతో గ్రామస్థులు నిరుత్సహానిక గురవుతున్నారు. దీంతో ఎక్కడి ఆలయ పనులు అక్కడే నిలిచిపోతున్నాయి. యూకేజీ నుండి 9 వ తరగతి వరకు చదివిన కర్దనూరు గ్రామం తనకు సొంత గ్రామం లాటిందని.. చరిత్ర కలిగిన సిద్ధి వినాయక ఆలయ పునర్నిర్మాణం కోసం గ్రామస్థులతో పాటు ఆలయ నిర్మాణం బాధ్యతలో నేను సైతం చేయికలుపుతానంటూ రాజ్ కుమార్ ఫౌండేషన్ చైర్మన్ కాల్వగడ్డ రాజ్ కుమార్ ముందుకొచ్చారు. దానంలో కర్ణుడే ఆదర్శం అన్నట్లు ఏకంగా 50లక్షల విరాళాన్ని ప్రకటించి రాజ్ కుమార్ హాట్ టాపిక్ గా నిలిచారు. తక్షణమే ఆలయ పనులు మొదలు పెట్టాల్సిందిగా ఆలయ కమిటీ సభ్యులకు రాజ్ కుమార్ సూచించారు. రాజ్ కుమార్ తీసుకున్న నిర్ణయం పట్ల పార్టీలకు అతీతంగా ప్రశంసలు కురిపిస్తున్నారు.

## శ్రీపాదరావుకు శాసనసభలో నివాళులు

**హైదరాబాద్:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ శాసన సభాపతి, స్వర్గీయ దుద్దిళ్ళ శ్రీపాద రావు 89 వ జయంతి సందర్భంగా శాసనసభ భవనంలోని లాంజ్ లో ఏర్పాటు చేసిన చిత్రపటానికి తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్, శాసన పరిషత్ చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్ ముదిరాజ్, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, అసెంబ్లీ విప్ ఆది శ్రీనివాస్, శాసనమండలి సభ్యులు, కౌన్సిల్ సెక్రటరీ డా. వి. నరసింహా చార్యులు, అసెంబ్లీ సెక్రటరి రేండ్ల తిరుపతి, పి . శ్రీకాంత్, సి ఎల్ పి కార్యాలయ కార్యదర్శి మరియు ఇతర అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

## దుబాయిలో చిక్కుకున్న మంత్రి తుమ్మల



మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దుబాయిలో చిక్కుకుపోయారు. అయన ఐదు రోజుల క్రితం కుటుంబ సభ్యులలో ఒకరికి అనారోగ్య కారణాల రీత్యా చికిత్స కోసం దుబాయ్ వెళ్లారు. దుబాయ్ ఎయిర్పోర్టుపై ఇరానయ దాడులు జరిగిన నేపథ్యంలో అన్ని విమానాలను అక్కడి ప్రభుత్వం రద్దు చేసింది. దాంతో అయన అక్కడే వుండిపోయారు., ఎయిర్పోర్టు క్లియర్లెన్స్ ఇచ్చేంత వరకు ఇండియా తిరిగి రాలేని పరిస్థితిలో వున్నారు.

# కాళేశ్వరం, మేడిగడ్డ సంగతేంటీ...

**కరీంనగర్, మార్చి 2, పెన్ పవర్:** కాళేశ్వరం.. తెలంగాణలో గత ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించిన ప్రాజెక్టు. కేవలం నాలుగేళ్లలో నిర్మాణం పూర్తి చేసి ప్రాజెక్టును ప్రారంభించారు. నీటి ఎత్తిపోతలు కూడా రెండేళ్లు సక్రమంగానే చేశారు. కానీ,మూడో ఏడాది ప్రాజెక్టులో కీలక బ్యారేజీ అయిన మేడిగడ్డలో మూడు పిల్లర్లు కుంగిపోయాయి. అన్నారం బ్యారేజీ పిల్లర్లకు సమీపంలో బుంగలు పడ్డాయి. దీంతో ఒక్కసారిగా ప్రాజెక్టు మనుగడ ప్రశ్నార్థకంగా మారింది.రెండున్నరేళ్లుగా బ్యారేజీలు ఖాళీగా ఉంటున్నాయి. ఎల్లంపల్లి నుంచే నీటిని లిఫ్ట్ చేస్తున్నారు. 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీకు బ్యారేజీ కుంగుదల ప్రాచారాస్త్రంగా మారింది. దీంతో ఎన్నికల్లో కాంగ్రెస్గెలిచింది. రేవంత్రెడ్డి సీఎం అయ్యారు. కాళేశ్వరంలో అవినీతి, అక్రమాలను నిగ్గు తేల్చేందుకు జుడీషియల్ కమిషన్ ఏర్పాటు చేశారు. ఏడాదిపాటు విచారణ చేసిన కమిషన్ నివేదిక కూడా ఇచ్చింది. కానీ రేవంత్ప్రభుత్వం దానిపై కేంద్రానికి లేఖ రాసింది.ప్రాణహిత--చేవెళ్ల ప్రాజెక్టును రీడిజైన్ చేసి 2016లో బీఆర్ఎస్ కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం ప్రారంభించింది. 20 లిఫ్టులు, 19 పంప్ హౌస్‌లు, 20 రిజర్వాయర్లతో 280టీఎంసీల నీటిని మేడిగడ్డ నుంచి ఎల్లంపల్లి వరకు ఎత్తిపోయించేలా రూపొందించారు. 1.47 లక్షల కోట్ల ఖర్చుతో 18.25 లక్ష ఎకరాలకు నీటి సరఫరా లక్ష్యం నిర్మాణం చేపట్టారు. 139 మెగావాట్ల బాహుబలిమోటార్లు ఏర్పాటు చేశారు. ఇందుకోసం 12 సబ్‌స్టేషన్లు ప్రత్యేకంగా నిర్మించారు.



అవినీతి ఆరోపణలు, దర్యాప్తు

మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్లు కుంగిపోవడంతో భారీగా అవినీతి జరిగిందని కాంగ్రెస్, బీజేపీ ఆరోపించాయి. మొదటి నుంచి కాళేశ్వరం కేసీఆర్‌కు ఏటీఎంగా మారిందని విమర్శించారు. అది నిజమే అన్నట్లు పిల్లర్లుకుంగిపోవడంతో ప్రజలు కూడా మొదట నిజమే అని భావించారు. దీంతో కాంగ్రెస్ ప్రభుత్వం నియమించిన ఘోష్ కమిషన్ రిపోర్టు మునుపటి ప్రభుత్వంపై ఆర్థిక లోపాలు, కాంట్రాక్టర్లకు అనైతిక లాభాలు తేల్చింది. సీబీఐదర్యాప్తు ఆదేశించింది,ఏడో బ్లాక్‌లో 16--22 పిల్లర్లు దెబ్బతిని, ఫౌండేషన్లు బలహీనపడ్డాయి. రెండేళ్లుగా మరమ్మతులు చేయలేదు. దీంతో ప్రాజెక్టు నిరుపయోగంగా మారింది. ఈ క్రమంలో కమిషన్ పేరుతో రెండేళ్లుగాప్రాజెక్టుకు మరమ్మతు చేపట్టకపోవడంపై ప్రజల్లో, రైతుల్లో విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వేల కోట్ల రూపాయలతో నిర్మించిన ప్రాజెక్టును రేవంత్ సర్కార్ నిరుపయోగంగా మార్చిందన్న విమర్శలు వస్తున్నాయి. ప్రభుత్వనిర్ణయం సరికాదన్న భావన ప్రజల్లో క్రమంగా బలపడుతోంది.ప్రజల ఒత్తిడి, రైతుల ఆందోళనలతో మొదట 'వృథా' అని చెప్పిన సీఎం, ఇప్పుడు మరమ్మతులకు సిద్ధమయ్యారు. నిర్మాణ సంస్థకు నోటీసులు పంపిమరమ్మత్తులు చేయించుతున్నారు. ప్రాజెక్టు పూర్తి చేసి నీటి ప్రవాహం పునఃప్రారంభం, రైతుల అవసరాలు తీర్చాలని ప్రభుత్వం భావిస్తోంది.మొత్తానికి కాళేశ్వరం విజయంలో సీబీఐ విచారణ మొదలు కాలేదు. మరోవైపురెండున్నరేళ్లుగా వృథాగా ఉంటుంది. దీంతో ప్రజల్లో రాష్ట్ర ప్రభుత్వం తీరుపై వ్యతిరేకత వస్తోంది. దీంతో సీఎం రేవంత్‌రెడ్డికి వేరే ఆప్షన్ లేకుండా పోయింది. దీంతో మరమ్మతులు షురూ చేశారు.

# బండి.. భాగ్యలక్ష్మి టెంపుల్ విజిట లెక్కేటీ



**హూదరాబాద్, మార్చి 2, (న్యూస్ పల్స్)**

కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ విజయ పరంపర వెనుక ఒక బలమైన దైవ రహస్యం ఉంది. కరీంనగర్ కంచుకోటలో మహాశక్తి కొలువు తీర్చినా, భాగ్యనగర నడిబొడ్డున భాగ్యలక్ష్మి అమ్మవారి చెంత మోకరిల్లినా..ఆయన వేసే ప్రతి అడుగు ఒక గెలుపు పిలుపుగా మారుతోంది. కార్పొరేటర్ స్థాయి నుండి నేడు కేంద్ర రాజకీయాల్లో చక్రం తిప్పే స్థాయి వరకు ఎదిగిన సంజయ్ ప్రస్థానంలో, 'భాగ్యలక్ష్మి అమ్మవారే' తన విజయలక్ష్మిఅని ఆయన ప్రగాఢ నమ్మకం. వరుస విజయాలతో దూసుకుపోతున్న ఈ 'హిందూ హృదయ సామ్రాట్' సెంటిమెంట్ వెనుక ఉన్న ఆసక్తికరమైన ఆధ్యాత్మిక ప్రయాణంపై ప్రత్యేక కథనం..బండి సంజయ్ రాజకీయప్రయాణం కార్పొరేటర్ స్థాయి నుండి కేంద్ర మంత్రి వరకు ఎదిగింది అంటే, దానికి ఆయన పోరాట పటిమతో పాటు అమ్మవారిపై ఆయనకున్న అచంచలమైన విశ్వాసం కూడా ఒక కారణం.

**కరీంనగర్ మహాశక్తి ఆలయం**

కార్పొరేటర్‌గా ఉన్న కాలంలోనే కరీంనగర్‌లో మహాశక్తి ఆలయ నిర్మాణానికి సంకల్పించడం ఆయన ఆధ్యాత్మిక చింతనకు నిదర్శనం. ఎంపీగా బాధ్యతలు చేపట్టాక ఆ సంకల్పాన్ని పూర్తి చేసి, ప్రతి ఏటా శక్తి మాల ధరించి అమ్మవారి సేవలో తరించడం ఆయనకు ఒక ఆనవాయితీగా మారింది.హైదరాబాద్‌లోని చార్మినార్ భాగ్యలక్ష్మి అమ్మవారు బండి సంజయ్ పాలిట విజయలక్ష్మిగా నిలిచారు.ఎన్నికల ప్రచారం ప్రారంభించే ముందు అమ్మవారిని దర్శించుకోవడం. కీలకమైన రాజకీయ నిర్ణయాలు లేదా పోరాటాల సమయంలో ఉదాహరణకు జీహెచ్ఎంసీ ఎన్నికలు, ప్రజా సంగ్రామ యాత్ర భాగ్యలక్ష్మి ఆలయం నుండే అడుగులు వేశాడు. వరుసవిజయాలు రెండు సార్లు ఎంపీగా, జీహెచ్ఎంసీలో పార్టీ బలోపేతం ఈ నమ్మకాన్ని మరింత బలపరిచాయి.తెలంగాణలో బీజేపీ అధికారం చేపడితే భాగ్యలక్ష్మి ఆలయాన్ని స్వర్ణ దేవాలయంగా తీర్చిదిద్దుతామన్న ఆయనప్రకటన కార్యకర్తల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. హిందూ ధర్మ పరిరక్షణలో భాగంగా ఈ ఆలయ అభివృద్ధిని ఆయన ఒక ప్రతిష్టాత్మక అంశంగా భావిస్తున్నారు.ఇటీవల కరీంనగర్ కార్పొరేషన్ ఎన్నికల్లో బీజేపీ సాధించినవిజయం ఆయన నాయకత్వానికి మరో నిదర్శనం. గెలుపు అనంతరం మేయర్, డిప్యూటీ మేయర్ మరియు కౌన్సిలర్లతో కలిసి భాగ్యలక్ష్మి అమ్మవారిని దర్శించుకోవడం ద్వారా, తన విజయాలన్నీ అమ్మవారికేఅంకితమని ఆయన మరోసారి చాటిచెప్పారు.రాజకీయాల్లో వ్యూహాలు ఎంత ముఖ్యమో, దైవబలం కూడా అంతే అవసరమని నమ్మే నాయకుల్లో బండి సంజయ్ ముందు వరుసలో ఉంటారు. భాగ్యలక్ష్మి అమ్మవారిఆశీస్సులతో ఆయన మరిన్ని విజయాలు అందుకోవాలని ఆశిద్దాం

## బీఆర్ఎస్ ఫ్లెక్సీల తొలగింపు.., పార్టీ నేతల నిరసన

**సూర్యాపేట: పెన్ పవర్:** తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధిలోని తెలంగాణ చౌరస్తాలో బిఆర్ఎస్ ఫ్లెక్సీలు తొలగింపు వివాదానికి దారి తీసింది. బీఆర్ఎస్ పార్టీ కి సంబంధించిన ఫ్లెక్సీలు మున్సిపాలిటీ సిబ్బందితో మున్సిపల్ కమిషనర్, పోలీసు అధికారులు తొలగించారు. మున్సిపల్ ఎన్నికల్లో తిరుమలగిరి గడ్డపైన బీఆర్ఎస్ పార్టీ గులాబీ జెండా ఎగరవేయడంతో అది చూసి తట్టుకోలేని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఈ చర్యకు పాల్పడ్డారని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు. పోలీస్ అధికారులను అడ్డంపెట్టుకొని, మున్సిపల్ సిబ్బందిని ఇబ్బంది పెడుతూ అర్ధరాత్రి బీఆర్ఎస్ పార్టీ ఫ్లెక్సీలను తొలగించి, కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన ఫ్లెక్సీలు పెట్టించే పని పెట్టుకున్నారని మండిపడ్డారు.

## గ్రామీణ బ్యాంక్ లో చోరికి యత్నం


**యాదాద్రి: పెన్ పవర్:** యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం ఎల్లం బావిలో దొంగల బీభత్సం సృష్టించారు. గ్రామీణ బ్యాంకు లో చోరీకి దొంగలు ప్రయత్నించారు. తాళం పగలగొట్టి షట్టర్ గ్యాస్ కటింగ్ చేస్తుండగా సైరన్ మోగడంతో పారిపోయారు. బ్యాంక్ సిబ్బంది పోలీసులకు సమాచారం అందించడంతో కేసు నమోదు చేసుకొని క్లూస్ టీం తో దర్యాప్తు చేస్తున్నారు. సీసీ కెమెరాలో గుర్తుపట్టకుండా ఉండేందుకు బ్యాంక్ బయట ఉన్న సీసీ కెమెరాలకు బ్లాక్ స్ప్రే చల్లారు.

## ఇందిరమ్మ ఇండ్ల కోసం వసూళ్లకు పాల్పడ్డ కాంగ్రెస్ నేత కేసు నమోదు

**వికారాబాద్ పెన్ పవర్:** :వికారాబాద్ జిల్లా నవాబుపేట మండలం మల్లారెడ్డిపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు కట్టిస్తానని, టీపీసీసీ కో-ఆర్డినేటర్ ధారా భాస్కర్ రూ.లక్ష డిమాండ్ చేశాడని గూళ్ళ కేశవులు అనే వ్యక్తి ఆరోపించాడు. గత ఏడాది రూ.50 వేలు వసూలు చేశాడని, మిగతా రూ.50 వేలు ఇవ్వాలని బెదిరిస్తున్నాడని పోలీసులకు ఫిర్యాదు చేసాడు. పోలీసులు బాధితుడి ఫిర్యాదు మేరకు ధారా భాస్కర్పై కేసు నమోదు చేసారు.

# రికార్డులు బ్రేక్..
# అత్యధిక గరిష్ట విద్యుత్ డిమాండ్ నమోదు

**హైదరాబాద్, మార్చి 2, పెన్ పవర్:**
తెలంగాణలో విద్యుత్ వినియోగం గరిష్ఠ స్థాయికి చేరుకుంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఇవాళ 6,267 మెగావాట్లకు చేరుకుంది. దీనికి కారణంగా ఎండల తీవ్రత పెరగటమేనని టీజీఎన్?పీడీసీఎల్ సీఎండీవెల్లడించారు. రానున్న రోజుల్లో మరింత విద్యుత్ వినియోగం ఉంటుందని అందుకు అన్ని రకాల ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు.తెలంగాణలో ఎండలు మండిపోతున్నాయి. ఈసారి ఫిబ్రవరి రెండో వారం నుంచే భానుడు తనప్రతాపాన్ని చూపిస్తున్నాడు. ఉదయం 8 తర్వాత నుంచే ఎండలు భగ భగ మండుతున్నాయి. మధ్యాహ్నం సమయానికి కాలు బయట పెట్టలేని పరిస్థితి. ఇక రాత్రి సమయాల్లో తీవ్రమైన ఉక్కపోతతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఫ్యాన్లు, కూలర్లు, ఏసీలను ఆశ్రయిస్తున్నారు. ఫలితంగా రాష్ట్రంలో విద్యుత్ వినియోగం విపరీతంగా పెరిగింది. విద్యుత్ వినియోగంలో సరికొత్త రికార్డులు నమోదవుతున్నాయి.టీజీఎన్?పీడీసీఎల్ చరిత్రలోనే గతంలో ఎన్నడూ లేని విధంగా ఫిబ్రవరి చివరి వారంలో శనివారం గరిష్ట విద్యుత్ డమాండ్ 6,057 మెగావాట్లు నమోదు అయింది.తాజాగా ఆ రికార్డు సైతం చెరిగిపోయింది. ఇవాళచరిత్రలోనే అత్యధిక గరిష్ట విద్యుత్ డిమాండ్ 6,267 మెగావాట్లు నమోదైనట్లు టీజీఎన్?పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి వెల్లడించారు. శనివారం నమోదైన హై పీక్ డిమాండ్ కొన్ని గంటల వ్యవధిలోనేఅధిగమించిపోయిందని చెప్పారు. టీజీఎన్?పీడీసీఎల్ చరిత్రలో ఇది ఒక మైలురాయిగా నిలిచిందని ఆయన స్పష్టం చేశారు. రోజురోజుకు ఎండలు మండిపోతుండటంతో విద్యుత్ డిమాండ్ విపరీతంగా పెరుగుతోందనివెల్లడించారు. అయినా సరే ప్రజలకు ఎలాంటి అంతరాయం లేకుండా నిరంతర విద్యుత్ సరఫరా అందించేందుకు తాము ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.డిమాండ్ ఎంత పెరిగినా



విద్యుత్ సరఫరాలో అంతరాయం రాకుండావిద్యుత్ అందించేందుకు సంస్థ పూర్తిగా సమాయత్తమై ఉందని చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, ఉన్నతాధికారుల పర్యవేక్షణ, దిశానిర్దేశంతో తెలంగాణ విద్యుత్ వినియోగదారులకునిరంతర విద్యుత్ సరఫరా అందించడమే తమ లక్ష్యమని అన్నారు. రానున్న రోజుల్లో డిమాండ్ మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. అందుకు సంస్థ పూర్తిగా సిద్ధంగా ఉందని.. ఎలాంటి ఇబ్బందులుతలెత్తకుండా అప్రమత్తంగా చర్యలు తీసుకుంటున్నామని సీఎండీ వివరించారు.కాగా, ఈ ఏడాది వడగాలుల తీవ్రత ఎక్కువగా ఉంటుందని ఇప్పటికే ఐఎండీ స్పష్టం చేసింది. మార్చి చివరి వారం నుంచి మే వరకువడగాలుల ప్రభావం ఎక్కువగా ఉంటుందని చెప్పారు. ముఖ్యంగా హైదరాబాద్, మహబూబ్‌నగర్, నల్గొండ జిల్లాల్లో దీని ప్రభావం ఎక్కువగా ఉంటుందని ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

# ఫామ్‌హౌస్ నుంచి కేసీఆర్ వ్యూహాలు



**హైదరాబాద్, మార్చి 2, పెన్ పవర్:**
ఉద్యమ ప్రస్థానంలో పుట్టిన పార్టీ టీఆర్ఎస్. తర్వాత అది కాస్తా బీఆర్ఎస్ గా మారింది. ఎప్పుడు ఎలాంటి విపత్కర పరిస్థితి ఏర్పడిన జై తెలంగాణ నినాదంతో నెట్టుకుంటూ వచ్చిందీ పార్టీ. అయితే రోజులు మారాయి. పదేళ్లపాలన తర్వాత కూడా విమర్శలు వస్తున్నప్పుడు జై తెలంగాణ నినాదంతో ముందుకెళ్లాలంటే కుదరదు. ఆవిషయాన్ని హైకమాండ్ గుర్తించింది. దీంతో సెంటిమెంట్ నుంచి సమస్యలపై పోరాటం దిశగా శ్రేణులను కార్యోన్ముఖుల్ని చేస్తున్నారు పార్టీ అధినేత కేసీఆర్.పార్టీని మళ్లీ బలోపేతం చేయాలంటే క్షేత్రస్థాయి నుంచి మొదలు పెట్టాలనే నిర్ణయానికి బీఆర్ఎస్ వచ్చింది. అందుకే ఇప్పుడు హైదరాబాద్ రాజకీయాలకు పరిమితంకాకుండా జిల్లాలపై ఫోకస్ పెంచుతోంది. వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నేరుగా బాధితుల వద్దకు వెళ్లి వారి సమస్యలను తెలుసుకుంటూ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారు.భూసేకరణ, భూముల వివాదాలు, రైతుల సమస్యలు, నిరుద్యోగం వంటి అంశాలపై ప్రత్యక్షంగా స్పందిస్తూ పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపే ప్రయత్నం చేస్తున్నారు. ఖమ్మం, నాగర్ కర్నూల్ వంటి జిల్లాల్లో ఇప్పటికే పర్యటనలు ప్రారంభించారు. త్వరలో రైతు ఆత్మహత్యల కుటుంబాలను కూడా పరామర్శించేలా ప్లాన్ చేస్తున్నారు.ఎర్రవెల్లి ఫామ్‌హౌస్ కేంద్రంగా కేసీఆర్ రాజకీయ వ్యూహాలు రచిస్తున్నారు. బయటకు పెద్దగా కనిపించకపోయినా, పార్టీని మళ్లీ నిలబెట్టేందుకుక్రమంగా పావులు కదుపుతున్నారు. నియోజకవర్గాల వారీగా కీలక నేతలతో టెలికాన్ఫరెన్స్‌లు నిర్వహిస్తూ ఓటమి కారణాలను విశ్లేషిస్తున్నారు.కార్యకర్తల్లో నెలకొన్న నిరుత్సాహాన్ని తొలగించి, “మళ్లీ మనదే పాలన” అనే నమ్మకాన్ని కలిగించే ప్రయత్నం జరుగుతోంది. అలాగే సోషల్ మీడియా వేదికగా ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రత్యేక బృందాలను కూడా సిద్ధం చేస్తున్నారు.పార్టీ నుంచి కొందరు నేతలువెళ్లిపోతున్నా, కేసీఆర్ మాత్రం తొందరపడటం లేదు. ద్వితీయ శ్రేణి నాయకత్వానికి ప్రాధాన్యం ఇస్తూ, ప్రతి మండలానికి ఇన్‌ఛార్జ్‌లను నియమించాలనే ఆలోచనలో ఉన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల కోసం ఇప్పటినుంచే క్యాడర్‌ను సిద్ధం చేస్తున్నారు.ఓటమి తర్వాత వెనక్కి తగ్గినట్టుగా కనిపించిన బీఆర్ఎస్, ఇప్పుడు కొత్త రూపంలో తిరిగి వస్తోంది. కేసీఆర్ సైలెంట్ ఆపరేషన్, కేటీఆర్ గ్రౌండ్ యాక్టివిటీ, కొత్త నాయకత్వం కలయికతో గులాబీ దళం మళ్లీ బలపడుతుందా అన్నది రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది.

# తలనొప్పిగా మారిన రాజ్యసభ ఎలక్షన్స్

**హైదరాబాద్, మార్చి 2, పెన్ పవర్:**
తెలంగాణ కాంగ్రెస్‌లో రాజ్యసభ సీట్ల ఎంపికపై జోరుగా చర్చలు జరుగుతున్నాయి. ఆశావహులు పెద్దఎత్తున ఉండడంతో ఎవరిని అదృష్టం వరిస్తుందోనని గాంధీభవన్ లో ఉత్కంఠ నెలకొంది. ఖాళీ అవుతున్న 2 రాజ్యసభ స్థానాల్లో కాంగ్రెస్ పార్టీకి తమకున్న బలంతో ఒక సీటు ఏకపక్షంగా దక్కనుంది. అయితే, రెండో సీటును దక్కించుకోవాలంటే అవసరమైన మ్యాజిక్ ఫిగర్ కోసం కాంగ్రెస్ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. ఈ నేపథ్యంలో అభ్యర్థుల ఎంపిక కేవలం సామాజిక సమీకరణాలకే పరిమితం కాకుండా, జాతీయ స్థాయిలో పార్టీకి అండగా నిలిచే నేతల వైపు మొగ్గు చూపుతున్నట్టు సమాచారం.ఒక రాజ్యసభ స్థానాన్ని గెలవడానికి కనీసం 40 మంది ఎమ్మెల్యేల మద్దతు అవసరం. కాంగ్రెస్ పార్టీకి సొంతంగా 66 మంది ఎమ్మెల్యేలు ఉండగా, ఒక సీపీఐ ఎమ్మెల్యే, ఏడుగురు ఎంఐఎం సభ్యుల మద్దతుతో ఈ సంఖ్య 74కు చేరుతుంది. మొదటి సీటును 40 ఓట్లతో గెలిచిన తర్వాత, కాంగ్రెస్ వద్ద మిగిలేది 34 ఓట్లు మాత్రమే. రెండో సీటు గెలవాలంటే మరో 6 ఓట్లు అదనంగా అవసరం. మరోవైపు.. విపక్షాలకు కూడా రెండో సీటును కైవసం చేసుకునేంత బలం లేదు. బీఆర్ఎస్ కు 36మంది ఎమ్మెల్యేలు ఉండగా. అందులో దాదాపు 10 మంది కాంగ్రెస్ గూటికి చేరారు. బీజేపీకి 8 మంది మాత్రమే ఉన్నారు. దీంతో ఈ సీటును దక్కించుకోవడం బీఆర్ఎస్, బీజేపీకి వీలు కాదు. అందుకే తమతో కలిసొచ్చేపార్టీలతో కలిసి కాంగ్రెస్ రెండో స్థానాన్ని కూడా కైవసం చేసుకునే అవకాశం ఉంది.పార్లమెంటులో కేంద్ర ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీయగల, చట్టపరమైన అంశాలపై పట్టున్న నేతలను పంపాలని హైకమాండ్ భావిస్తోంది. ఈ క్రమంలో ఇద్దరి పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. రేసులో అభిషేక్ మను సింఘ్వీ ఫస్ట్ ప్లేస్ లో ఉన్నారు. ఆయన స్థానమే ఇప్పుడు ఖాళీ



అవుతుండగా, ఆయన్ను మరోసారి రాజ్యసభకు పంపించాలనే ఆలోచనలో హైకమాండ్ ఉన్నట్టు సమాచారం. పార్టీకి జాతీయ స్థాయిలో ట్రబుల్ షూటర్‌గా సింఘ్వీ ఉన్నారు. ఇక సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్ రెడ్డి పేరు కూడా గట?గా వినిపిస్తోంది. తెలంగాణ వ్యక్తి కావడం, ఇటీవల ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోవడం ఆయనకు కలిసొచ్చే అంశాలు.అధిష్ఠానం పారాచూట్ అభ్యర్థులను దింపాలని చూస్తుంటే, రాష్ట్ర నేతలు మాత్రం స్థానిక సమీకరణాలను తెరపైకి తెస్తున్నారు. ఉమ్మడి రాష్ట్రం నుండి పార్టీని నమ్ముకున్న వీ.హనుమంతరావు వంటి సీనియర్లు, ఈసారి బీసీలకు అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. రేవంత్ రెడ్డికి అత్యంత సన్నిహితుడైన వేం నరేందర్ రెడ్డి పేరు గట్టిగా వినిపిస్తోంది. అలాగే సీనియర్ నేతలు జానారెడ్డి, కోదండరెడ్డి కూడా తమ సుదీర్ఘ రాజకీయ అనుభవాన్ని పరిగణనలోకి తీసుకోవాలని కోరుతున్నారు.కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు ‘స్థానికత వర్సెస్ జాతీయ అవసరాల’ మధ్య నలిగిపోతోంది. ఒకవేళ ఇద్దరు అభ్యర్థులను బయటి నుంచి లేదా న్యాయ నిపుణులను ఎంపిక చేస్తే, కష్టకాలంలో పార్టీని కాపాడిన స్థానిక నేతల్లో అసంతృప్తి చెలరేగే ప్రమాదం ఉంది. మరోవైపు, రెండో సీటును గెలవాలంటే ఎమ్మెల్యేలందరినీ ఏకతాటిపైకి తెచ్చి క్రాస్ ఓటింగ్ జరగకుండా చూసుకోవడం రేవంత్ రెడ్డికి పెద్ద పరీక్ష కానుంది.వచ్చే రెండు రోజుల్లో సోనియా గాంధీ, ఖర్గే తుది నిర్ణయం తీసుకోనున్నారు

## హైదరాబాద్ చేరుకున్న రాహుల్ గాంధీ



**హైదరాబాద్: పెన్ పవర్:** లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సోమవారం ఉదయం హైదరాబాద్ చేరుకున్నారు. అయనకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంషాబాద్ విమానాశ్రయంలో సాదర స్వాగతం పలికారు. వికారాబాద్ జిల్లా అనంతగిరి హిల్స్ లో జరిగే ఏపీ, తెలంగాణ జిల్లా కాంగ్రెస్ కమిటీ ( ఐజజ) అధ్యక్షుల శిక్షణ ముగింపు కార్యక్రమానికి రాహుల్ బయలుదేరారు.

## అన్నారం బ్యారేజిని కూల్చేందుకు కుట్ర
## ఎక్స్ లో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**హైదరాబాద్: పెన్ పవర్:** మేడిగడ్డ బ్యారేజీపై కుట్రలు చేసింది చాలదన్నట్టు, అన్నారం బ్యారేజీని కూల్చేందుకు కుతంత్రాలకు తెరతీశారా అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు.

ఈ మేరకు ఎక్స్ లో తన వాదాన్ని పోస్టు చేసారు. నిబంధనలకు పాతరేసి ఏకంగా బ్యారేజీ కిందే భారీ ఎక్సవేటర్లతో ఇసుక తవ్వకాలు జరపడం దుర్మార్గమే కాదు.. అతిపెద్ద నేరం. బ్యారేజీ సమీపంలో ఇసుక తవ్వకాలు చేపట్టకూడదన్న రూల్స్ ను బ్రేక్ చేసిన మాఫియాపై వెంటనే క్రిమినల్ చర్యలు తీసుకోవాలని అన్నారు.

ఏకంగా బ్యారేజీని బలహీనపరిచి బీఆర్ఎస్ పై బురదజల్లే పన్నాగాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులను కఠినంగా శిక్షించాలి. తెలంగాణ వరప్రదాయిని కాళేశ్వరం ప్రాజెక్టును దెబ్బతీసేందుకు నాటి నుంచి నేటి వరకు కాంగ్రెస్ చేస్తున్న అరాచకపర్వాన్ని అన్నదాతలు క్షమించే ప్రసక్తే లేదు. నిబంధనలు తుంగలో తొక్కి అన్నారం బ్యారేజి పిల్లర్ల వద్ద ఇసుక తవ్వకాలు చేసి బ్యారేజీని ప్రమాదంలోకి నెడుతుంది రేవంత్ సర్కార్.. ఇది ఖచ్చితంగా కాళేశ్వరం ప్రాజెక్టును దెబ్బతీసే కుట్రే. పట్టపగలే, నిస్సిగ్గుగా అన్నారం బ్యారేజ్ నుండి కాంగ్రెస్ నాయకుల ఇసుక మాఫియా ఇసుకను తోడేస్తుంది. తెలంగాణ వనరులను కాంగ్రెస్ పార్టీ ఎలా కొల్లగొడుతుందో చెప్పడానికి ప్రత్యక్ష ఉదాహరణ ఇది. కాళేశ్వరం బ్యారేజీలకు ఏమైనా జరిగితే పూర్తి బాధ్యత కాంగ్రెస్ పార్టీదే. అందినకాడికి దోచుకో.. దొరికినకాడికి అమ్ముకో.. ఇవే తెలంగాణలో ఇప్పుడు కాంగ్రెస్ ప్రజా పాలన సూత్రాలు. తెలంగాణను నిలువు దోపిడి చేస్తున్న కాంగ్రెస్ నాయకులారా.. ప్రజలు మీ భరతం పట్టే రోజు అతి దగ్గరలోనే ఉంది.. ఖబడ్దార్ అని హెచ్చరించారు.

## శ్రీపాదరావు కు సీఎం రేవంత్ నివాళులు

**హైదరాబాద్: పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ శాసనసభ మాజీ స్పీకర్, స్వర్గీయ దుద్దిళ్ల శ్రీపాద రావు జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అయనకు నివాళులర్పించారు. విలువలతో కూడిన రాజకీయాలకు కట్టుబడి, నిస్వార్థ ప్రజాసేవకుడిగా అయన పేరుగాంచారని అన్నారు.


## పసుపు రంగు రాసిన చికెన్ విక్రయిస్తే చర్యలు



**హన్మకొండ: పెన్ పవర్:** చికెన్ సెంటర్లలో కోడి మాంసాన్ని శుభ్రం చేసేటప్పుడు పసుపుకు బదులుగా కృత్రిమ రంగులు వాడితే కఠిన చర్యలు తీసుకుంటామని హనుమకొండ ఫుడ్ ఇన్స్పెక్టర్ బ్రహ్మాజీ హెచ్చరించారు. ఆదివారం వినియోగదారుల మండలి జాతీయ ప్రధాన కార్య దర్శి చక్రపాణితో కలిసి ఆయన పలు దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రసాయన రంగులు కలిపిన మాంసం తింటే ఉదర, పేగు క్యాన్సర్లు వచ్చే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

## రింగ్ రోడ్డు లో ప్రమాదం..ఇద్దరికి గాయాలు

**హైదరాబాద్: పెన్ పవర్:** ఎల్బీనగర్ సాగర్ రింగ్ రోడ్డు వద్ద అర్ధరాత్రి రోడ్డు ప్రమాదం జరిగింది. వేగంగా వెళ్తూ ముందు ఉన్న డిసిఎం ను కారు ఢీకొని పల్టీ కొడుతూ డివైడర్ను ఢీకొంది. దాంతో ఒక్కసారిగా కారులో మంటలు చెలరేగాయి. కారులో ఉన్న డ్రైవర్ సాయి కీర్తన్ కు మంటలు అంటుకొని తీవ్ర గాయాలు కావడంతో ఎల్బీనగర్ కామినేని హాస్పిటల్ కి తరలించారు. డీసీఎం డ్రైవర్ కు స్వల్ప గాయాలు అయ్యాయి. మంటల ధాటికి కారు పూర్తిగా దగ్ధమైంది. సాయి కీర్తన్ ను ఎల్బీనగర్ రాక్ టౌన్ కాలనీకి చెందినవాడుగా గుర్తించారు. అతివేగం ప్రమాదనికి కారణమని తెలుస్తుంది



## అంగన్వాడీ సూపర్వైజర్ పై వేధింపుల ఆరోపణలు

**నల్గొండ పెన్ పవర్:** నకిరేకల్ అంగన్వాడీ సెక్టార్ సూపర్వైజర్ జి సునీత ఆగడాలు మితిమీరాయని బాధితులు ఆరోపించారు. అంగన్వాడీ టీచర్లను వేధిస్తున్నట్లు ఆరోపించారు. అంగన్వాడీ టీచర్ల ను వర్గాలుగా విభజించి రాజకీయం చేస్తున్నాట్లు విమర్శించారు. తనకు అనుకూలంగా ఉన్న వర్గానికి ఇష్టానుసారంగా సెలవులు ఇస్తున్నారని అంగన్వాడి టీచర్ నాగమణి అంటున్నారు. ఇదంతా నాపై కుట్ర ని సెక్టార్ సూపర్వైజర్ సునీత అంటున్నారు. అంగన్వాడి టీచర్ నాగమణి భర్త దొడ్డయ్య తన తో దురుసుగా ప్రవర్తించాడు. ఇది బయట పెడుతుందనే ముందస్తుగా నా పైన కుట్ర అని సునీత ఆరోపణ.

## చెట్టును ఢీకొన్న బైకు ఇద్దరు మృతి

**అదిలాబాద్: పెన్ పవర్:** ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం ధనోర (బి) రహదారి మూల మలుపు వద్ద చెట్టును బైకు ఢీకొట్టింది. ఘటనలో ఓ మహిళ, ఓ యువకుడు ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. 108 సిబ్బంది అక్కడికి చేరుకుని సిపిఆర్ చేసి ప్రాణాలు రక్షించే ప్రయత్నం చేసారు. ప్రమాద స్థలం వద్దకు ఇంద్రవెల్లి పోలీసులు చేరుకున్ననారు. . కేసు నమోదు చేసి దర్యాప్తు. పోస్ట్ మార్టం నిమిత్తం మృత దేహాలను ఉట్నూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మూల మలుపు దగ్గర తరచు ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు అంటున్నారు.

## భద్రాద్రిలో శ్రీరామనవమి కళ్యాణోత్సవం సమీక్షా భేటిలో పాల్గొన్న మంత్రి పొంగులేటి



**భద్రాద్రి కొత్తగూడెం: పెన్ పవర్:** భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానం నందు మార్చి 18వ తేదీ నుంచి ప్రారంభం కానున్న వసంతపక్ష తిరు కళ్యాణ నవహాన్నిక బ్రహ్మోత్సవాలతోపాటు ఈనెల 27వ తేదీన జరగనున్న శ్రీరామనవమి కళ్యాణం ఏర్పాటులకు సంబంధించి సమీక్ష సమావేశం భద్రాచలం సబ్ కలెక్టర్ కార్యాలయం నందు జిల్లాలో ఉన్నటువంటి వివిధ శాఖల అధికారులతో తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి మరియు గృహ నిర్మాణ శాఖామంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నిర్వహించారు..

ఈ సమీక్ష సమావేశంలో భాగంగా భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం రామాలయంలో ఈనెల18వ తేదిన శ్రీ సీతారామచంద్ర స్వామి వారి కళ్యాణము మరియు పట్టాభిషేకం మహోత్సవాల కోసం ఏర్పాట్లపై అయన అధికారులను అడిగి తెలుసుకున్నారు.... దీనిలో భాగంగా ఆయన అధికారులతో మాట్లాడుతూ సుదూర ప్రాంతాల నుండి వచ్చేటటువంటి భక్తులకు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని భక్తులకు మజ్జిగ మరియు మంచినీరు ప్యాకెట్లు అందించాలని ఆయన సూచించారు . సీతారాముల వారి కళ్యాణానికి ముఖ్యమంత్రి వచ్చే అవకాశం ఉన్నందున ట్రాఫిక్ అంతరాయం కలగకుండా పోలీసులు జాగ్రత్తలు చర్యలు చేపట్టాలని ఆయన అన్నారు ...భద్రాచలం నుండి పర్ణశాల వెళ్ళేటటువంటి రోడ్డు మార్గం గుంతలు గుంతలు గా ఉందని వాటన్నిటిని వెంటనే ఆర్ అండ్ బి శాఖ అధికారులు మరమ్మత్తులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈసారి రాముల వారి కళ్యాణం అంగరంగ వైభవంగా జరగాలని భద్రాచలం బ్రిడ్జిపై కూడా లైటింగ్ ఏర్పాట్లను చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు..

భక్తులకు లడ్డూ ప్రసాదం ప్రతి ఒక్కరికి అందేలా చర్యలు చేపట్టాలని ఆలయ అధికారులను ఆయన ఆదేశించారు ఆ విధంగా లడ్డూను తయారుచేసి తాజా లడ్డూను భక్తులకు అందజేయాలని మరియు లడ్డులో నాణ్యత లోపాల తలెత్తకుండా చూడాలని ఆయన ఫుడ్ ఇన్స్పెక్టర్లుకు సూచనలు చేశారు..

## కమలం గూటికి కామ్రేడ్లు..

**హైదరాబాద్, మార్చి 2, పెన్ పవర్:** భారత రాజకీయాల్లో సిద్ధాంతపరంగా లెఫ్ట్, రైట్ పార్టీలు కమ్యూనిస్టులు, బీజేపీ. రెండు పార్టీల్లో ఉన్నవారు ఉప్పునిప్పులా ఉంటారు. కానీ విచిత్రం బీజేపీ కమ్యూనిస్టుల క్యాడర్ ను తమలో కలిపేసుకుంటోంది. ఇదేం మాయ అని అందరూ ఆశ్చర్యపోవాల్సి వస్తోంది.ఒకప్పుడు కమ్యూనిస్టులకు కంచుకోటలుగా ఉన్న త్రిపుర, పశ్చిమ బెంగాల్, ప్రస్తుతం కేరళలో బీజేపీ అనూహ్యంగా బలపడటం వెనుక ఒక పక్కా రాజకీయ మాయాజాలం కనిపిస్తోంది. పశ్చిమ బెంగాల్, త్రిపురలలో కమ్యూనిస్టుల పతనం తర్వాత క్షేత్రస్థాయి కేడర్‌కు రక్షణ కరువైన వేళ, అధికార తృణమూల్ కాంగ్రెస్ వంటి శక్తుల దాడులను తట్టుకోవడానికి వారు బలమైన ప్రత్యామ్నాయంగా బీజేపీని ఆశ్రయించారు. కానీ కేరళలో మాత్రం భిన్నమైన వ్యూహాన్ని బీజేపీ అమలు చేస్తోంది.కమ్యూనిస్టుల ఓటు బ్యాంక్ నిరుపేదలు. పోరాటాలు చేస్తారు కానీ ఆ ఫలితాలు వస్తాయో రావో తెలియదు.కానీ మోదీ.. ఆ పోరాటాలు లేకుండానే వారికి కావాల్సినవి సమకూరుస్తున్నారు. అట్టడుగు వర్గాల సంక్షేమం అనే నినాదాలను బీజేపీ తనదైన శైలిలో అందిపుచ్చుకుంది. ప్రధాని మోదీ నాయకత్వంలో అమలు చేస్తున్న ఉచిత బియ్యం, గ్యాస్ కనెక్షన్లు, పక్కా ఇళ్లు వంటి పథకాలు కమ్యూనిస్టుల సంప్రదాయ ఓటు బ్యాంకైన పేదలు, కార్మికులను సూటిగా ఆకర్షించాయి. దీనికి సాంస్కృతిక జాతీయవాదం తోడవడంతో, అంతర్జాతీయవాదం కంటే దేశభక్తి, భద్రత వైపు ప్రజలు మొగ్గు చూపారు. సిద్ధాంతాల కంటే దైనందిన జీవితంలో స్పష్టమైన మార్పును చూపడం ద్వారా బీజేపీ కమ్యూనిస్టుల పునాదులను కదిలించగలిగింది.కేరళలో ఇప్పటికీ సీపీఎం, కాంగ్రెస్ మధ్యే ప్రధాన పోరు సాగుతున్నప్పటికీ, బీజేపీ ఓటు శాతం నిలకడగా పెరుగుతోంది. శబరిమల వంటి భావోద్వేగ అంశాలు, స్థానిక హిందూ ధర్మ రక్షణ నినాదాలతో కమ్యూనిస్టు అనుకూల హిందూ ఓటర్లను తనవైపు తిప్పుకోవడంలో బీజేపీ విజయం సాధిస్తోంది. త్రిపురలో 25 ఏళ్ల కమ్యూనిస్టు పాలనను కూల్చిన వ్యూహాన్నే ఇక్కడ కూడా అమలు చేస్తూ, మూడవ ప్రత్యామ్నాయం నుండి ప్రధాన ప్రత్యర్థిగా ఎదిగేందుకు బీజేపీ పావులు కదుపుతోంది. సామాజిక వర్గాల వారీగా ఓట్లను చీల్చడం ద్వారా కమ్యూనిస్టు పట్టును సడలించడం ఈ వ్యూహంలో భాగం.కమ్యూనిస్టు నేతలు ప్రజలకు దూరమై, గ్రామాల్లో శూన్యం ఏర్పడిన చోట రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ శాఖలు సేవా కార్యక్రమాల ద్వారా పాతుకుపోయాయి. గ్రామస్థాయిలో ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ, కమ్యూనిస్టుల పనితీరును అధ్యయనం చేసి వారి ఎత్తుగడలనే చిత్తు చేస్తూ ఆరెస్సెస్ కార్యకర్తలు బీజేపీకి మార్గం సుగమం చేస్తున్నారు. ఈ పక్కా ప్రణాళికతోనే కమ్యూనిస్టులను బలహీనం చేస్తూ, వారి కోటల్లోనే బీజేపీ తన జైత్రయాత్రను కొనసాగిస్తోంది. ముందు ముందు కమ్యూనిస్టులు మరింత బలహీనపడటం ఖాయంగా కనిపిస్తోంది.

## కరెంట్ షాక్ తప్పదా

**హైదరాబాద్, మార్చి 2, పెన్ పవర్:** వేసవి తాపం మొదలవడంతో ఇళ్లలో ఏసీలు, కూలర్ల వాడకం క్రమంగా పెరుగుతోంది. అయితే విద్యుత్తును విచ్చలవిడిగా వాడితే నెలాఖరులో భారీ బిల్లులు వచ్చే అవకాశం ఉంది. ముఖ్యంగా ప్రభుత్వ 'గృహజ్యోతి' పథకం వర్తించాలంటే నెలకు 200 యూనిట్ల లోపే వినియోగం ఉండాలి. ఒక్క యూనిట్ ఎక్కువైనా ఈ పథకం వర్తించదు కాబట్టి, వినియోగదారులు పొదుపు మంత్రం పాటించడం ఎంతో ముఖ్యం.పాతకాలపు ఫ్లోర్‌సెంట్ ట్యూబ్‌లైట్లకు బదులుగా ఎల్‌ఈడీ (రాజుణ) బల్బులను వాడటం వల్ల విద్యుత్ ఖర్చు తగ్గుతుంది.ఏసీ ఉష్ణోగ్రతను ఎప్పుడూ 24 నుంచి 26 డిగ్రీల మధ్య ఉంచాలి. ఇన్వర్టర్ ఏసీలు వాడటం వల్ల గది చల్లబడగానే అవి ఆటోమేటిక్‌గా ఆగిపోయి విద్యుత్తును ఆదా చేస్తాయి. వేసవి ప్రారంభానికి ముందే ఏసీలను మెకానిక్‌తో తనిఖీ చేయించడం మంచిది.ఫ్రిజ్లు, ఏసీలు, ఫ్యాన్లు కొనేటప్పుడు బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ ఇచ్చే 5 స్టార్ రేటింగ్ ఉన్న పరికరాలను ఎంచుకుంటే బిల్లు తక్కువగా వస్తుంది.అవసరం లేనప్పుడు టీవీలు, కంప్యూటర్లు, ఫ్యాన్లను ఆపివేయాలి. మొబైల్ ఛార్జింగ్ పూర్తయ్యాక ప్లగ్ నుంచి ఛార్జర్‌ను తప్పనిసరిగా తొలగించాలి. రిఫ్రిజిరేటర్లలో సీజన్‌ను బట్టి ఫ్రీజర్ సెట్టింగ్స్ మార్చుకుంటూ ఉండాలి.

# సంపూర్ణ చంద్ర గ్రహణం

### మంగళవారం యాద్రాద్రి ఆలయం మూసివేత

**హైదరాబాద్, మార్చి 2, పెన్ పవర్:** మంగళవారం యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం మూసివేయనున్నారు.

ఆలయ ఈఓ భవాని శంకర్ మాట్లాడుతూ లి రేపు ఉదయం 7 గంటల నుండి ఎల్లుండి ఉదయం 3 గంటల వరకు ఆలయం మూసివేస్తాం. ఎల్లుండి ఉదయం 3గంటలకు ఆలయాన్ని తెరిచి గ్రహణ దోష పరిహారార్థం సంప్రోక్షణ ఆలయ శుద్ధి చేయనున్నామని అన్నారు.



సంప్రోక్షణ ఆలయ శుద్ధి అనంతరం నిత్యా పూజలు నిర్వహించి భక్తులను స్వామి వారి దర్శనాలకు అనుమతించనున్నారు

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# రేవంత్ యూ టర్న్ వెనుక...

**హైదరాబాద్, మార్చి 2, పెన్ పవర్:**
ముందూ వెనుకా ఆలోచించకుండా నిర్ణయాలు తీసుకోవడం, వాటిని గుట్టుగా అమలు చేయాలనుకోవడం, తీరా అవి బయటపడి వివాదాస్పదమయ్యాక మిన్నకుండిపోవడమో లేదా వెనక్కి తీసుకోవడమో రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి పరిపాటిగా మారింది. హైడ్రా కూల్చివేతల నుంచి ఖమ్మం భూముల వ్యవహారం వరకు ఇదే ధోరణి కనిపించింది. తాజాగా, గత కేసీఆర్ ప్రభుత్వం స్వరూపానంద స్వామికి కేటాయించిన అత్యంత ఖరీదైన కోకాపేట భూముల విషయంలోనూ రేవంత్ సర్కార్ చివరకు వెనక్కి తగ్గాల్సి వచ్చింది.విశాఖ శారదాపీఠం నిర్వాహకులు స్వరూపానంద స్వామి గురించి తెలిసిన వారు చాలా మందే ఉన్నారు. ఆయన పీఠానికి సంప్రదాయ శారదాపీఠాలతో సంబంధం లేకపోయినప్పటికీ, రాజకీయ పలుకుబడితో ఆయన తన ప్రభావాన్ని చాటుకున్నారు. తొలుత సుబ్బరామిరెడ్డి సౌజన్యంతో, ఆపై తన చతురతతో జగన్, కేసీఆర్ వంటి నేతల వద్ద ప్రాపకం సంపాదించారు. కేసీఆర్ కు ఉన్న ఆధ్యాత్మిక విశ్వాసాలను, హోమాలపై ఉన్న ఆసక్తిని అనుకూలంగా మలచుకుని, రాజశ్యామల యాగాలు నిర్వహించి ప్రతిఫలంగా కోకాపేటలో అత్యంత విలువైన భూములను కేటాయింపజేసుకోగలిగారు.ఆంధ్రప్రదేశ్‌లో జగన్ మోహన్ రెడ్డి హయాంలో స్వరూపానంద చలాయించిన పెత్తనం అంతా ఇంతా కాదు. విశాఖలో ఏకంగా ఒక కొండనే రాయించుకోవడమే కాకుండా, తిరుమలలో నిబంధనలకు విరుద్ధంగా భవన నిర్మాణాలు చేపట్టారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆ భూకేటాయింపులను రద్దు చేసి, కఠిన నిర్ణయాలు తీసుకోవడంతో ఆయన అక్కడ పట్టు కోల్పోయారు. దీంతో కోకాపేటలో కేసీఆర్ ఇచ్చిన భూమినే తన ప్రధాన కేంద్రంగా మార్చుకోవాలని ఆయన భావించారు. రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ భూకేటాయింపులను రద్దు చేసి ఉంటే పరిస్థితి వేరుగా ఉండేది, కానీ ఆలస్యంగా స్పందించడం వల్ల ఇప్పుడు సమస్య సంక్లిష్టంగా మారింది. 2019లో అప్పటి కేసీఆర్ ప్రభుత్వం రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం కోకాపేట (నియోపోలిస్) లోని సర్వే నంబర్ 240లో రెండు ఎకరాల అత్యంత విలువైన భూమిని విశాఖ శారదా పీఠానికి కేటాయించింది. వేద పాఠశాల, రాజశ్యామల ఆలయం, ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణ కోసం కేవలం ఎకరా ఒక్క రూపాయికే (మొత్తం రూ.



2) నామమాత్రపు ధరతో ఈ కేటాయింపులు జరిగాయి. మార్కెట్ విలువ ప్రకారం వందల కోట్లు పలికే భూమిని ఇలా ఉచితంగా ఇవ్వడంపై అప్పట్లోనే తీవ్ర విమర్శలు వచ్చాయి. హైకోర్టులో కూడా దీనిపై పిటిషన్లు దాఖలయ్యాయి.ప్రస్తుత రేవంత్ సర్కార్ ఈ భూమిని తిరిగి తీసుకోవాలని నిర్ణయించింది. ఇందుకు కొన్ని కారణాలను ప్రభుత్వం చెప్తోంది. కోకాపేట్ నియోపోలిస్ ప్రాంతం సముద్ర మట్టానికి 592 మీటర్ల ఎత్తులో ఉంటుంది. ఈ ఎత్తైన ప్రదేశంలో రిజర్వాయర్ నిర్మిస్తే, గ్రావిటీ ద్వారా నియోపోలిస్, చుట్టుపక్కల ప్రాంతాలకు పంపింగ్ అవసరం లేకుండా నీటి సరఫరా చేయవచ్చని ప్రభుత్వం చెబుతోంది. రాజకీయ ఒత్తిళ్లతో గత ప్రభుత్వం చేసిన నామమాత్రపు కేటాయింపులను సమీక్షించడంలో భాగంగా ఈ చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది.కోకాపేటలో ఎకరం భూమి ధర ప్రస్తుతం సుమారు 150 కోట్ల రూపాయలు. అంటే రెండున్నర ఎకరాల విలువ దాదాపు 400 కోట్ల రూపాయలు. ఈ భూమిని ప్రభుత్వం తిరిగి తీసుకుంటుందనే సంకేతాలు రాగానే, స్వరూపానంద చాకచక్యంగా 'హిందూత్వం' కార్డును ప్రయోగించారు. తొలుత అధికారులు సంప్రదించినప్పుడు కోకాపేట భూమినివదులుకుని, శంషాబాద్ వద్ద రెండు ఎకరాలు తీసుకునేందుకు ఆయన అంగీకరించినట్లు వార్తలు వచ్చాయి. కానీ చివరి నిమిషంలో ఇతర రాజకీయ పక్షాలతో రచ్చ చేయించి, పీఠానికి ఇచ్చిన భూములను లాక్కుంటున్నారనే ప్రచారం మొదలుపెట్టారు. దీంతో డిఫెన్స్‌లో పడ్డ రేవంత్ ప్రభుత్వం.. పీఠానికి ఇచ్చిన భూములను వెనక్కి తీసుకునే ప్రసక్తే లేదని ప్రకటించింది. ఫలితంగా, ఎకరానికి కేవలం ఒక రూపాయి చొప్పున కేసీఆర్ కేటాయించిన ఆ విలువైన భూమిలోనే ఇప్పుడు ఈ స్వయం ప్రకటిత పీఠాధిపతి తన సామ్రాజ్యాన్ని కొనసాగించబోతున్నారు. ప్రభుత్వ నిర్ణయాల్లోని అస్థిరత స్వరూపానందకు వరంగా మారింది.

# కవిత త్వరలో సొంతంగా రాజకీయ అడుగులు

**హైదరాబాద్, మార్చి 2, పెన్ పవర్:**
ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో సుదీర్ఘ కాలం సాగిన ఉత్కంఠకు రౌస్ అవెన్యూ కోర్టు తీర్పుతో తెరపడింది. మాజీ ఎమ్మెల్సీ కవితకు ఈ కేసులో క్లీన్ చిట్ లభించడం బీఆర్ఎస్ శ్రేణులకు పెద్ద ఊరటనిచ్చినప్పటికీ, ఈ తీర్పు అనంతరం చోటుచేసుకున్న పరిణామాలు పార్టీలోనూ, కల్వకుంట్ల కుటుంబంలోనూ పెను తుపానును సృష్టించాయి. ముఖ్యంగా కేటీఆర్ చేసిన ఒక ట్వీట్, దానికి కవిత ఇచ్చిన కౌంటర్ ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారాయికోర్టు తీర్పు వెలువడిన వెంటనే కేటీఆర్ స్పందించారు. ఈ కేసు కేవలం రాజకీయ కక్ష సాధింపు అని కొట్టిపారేశారు. అయితే, తన విశ్లేషణలో ఆయన ఒక కీలక వ్యాఖ్య చేశారు. "ఢిల్లీ లిక్కర్ స్కామ్ అనే కల్పిత గాథ వల్ల అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ రాజకీయంగా బలి అయింది " అని పేర్కొన్నారు. కవితకు న్యాయం జరిగిందని చెబుతూనే, ఈ కేసు వల్లే పార్టీ ఓడిపోయిందనే అర్థం వచ్చేలాఆయన చేసిన వ్యాఖ్యలు వివాదానికి దారితీశాయి.కేటీఆర్ చేసిన విశ్లేషణపై కవిత తీవ్రంగా మండిపడ్డారు. పార్టీ ఓటమిని తన ఖాతాలో వేయడంపై ఆమె అసహనం వ్యక్తం చేశారు. "బీఆర్ఎస్ ఓటమికి నీ అహంకారమేకారణం, నాపై తప్పుడు ప్రచారాలు ఆపాలి" అంటూ ఆమె ఎక్స్ వేదికగా ఘాటుగా స్పందించారు. తాను జైలులో ఉన్న సమయంలో పార్టీ గానీ, అగ్ర నాయకత్వం గానీ కనీసం ఒక ప్రెస్ మీట్ పెట్టి కూడా తనకు అండగా నిలవలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కేసు తన వ్యక్తిగత లాభం కోసం జరిగింది కాదని, పార్టీ ప్రయోజనాల కోసం పోరాడుతుంటే తనను ఒంటరిని చేశారని ఆమె ఆరోపించారు. నిరుద్యోగం, హామీల అమలులో వైఫల్యంవంటి కారణాల వల్ల పార్టీ ఓడిపోతే, ఇప్పుడు ఆ నెపాన్ని తనపైకి నెట్టడం సరికాదని ఆమె స్పష్టం చేశారు.ఈ వివాదం కేవలం అన్నాచెల్లెళ్ల మధ్య చిన్నపాటి ఘర్షణ మాత్రమే కాదు, దీని వెనుక లోతైన రాజకీయ కోణాలుఉన్నాయి. కేసు గెలిచిన తర్వాత కవిత తన రాజకీయ ఇమేజ్‌ను తిరిగి పుంజుకోవాలని చూస్తున్నారు. కానీ కేటీఆర్ వ్యాఖ్యలు ఆమెను పార్టీకి నష్టం కలిగించిన వ్యక్తిగా చిత్రించేలా ఉన్నాయని ఆమె భావిస్తున్నారు. కవిత త్వరలో సొంతంగా రాజకీయ అడుగులు వేయబోతున్నారనే ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలో ఆమె తనపై ఉన్న లిక్కర్ స్కామ్ ముద్రను కోర్టు ద్వారా చెరిపేసుకున్న తరుణంలో, సొంత అన్నయ్యే దాన్ని పార్టీ ఓటమికి కారణంగా చూపడం ఆమెకు మింగుడుపడటం లేదు.లిక్కర్ స్కామ్ కేసులో న్యాయపరంగా కవిత విజయం సాధించినా, రాజకీయంగా మాత్రం కుటుంబంలో చిచ్చు రేపింది. కేటీఆర్ అహంకారం వల్ల ఓడిపోయామని కవిత,కవిత కేసు వల్లే పార్టీ దెబ్బతిందని కేటీఆర్ పరోక్షంగా వాదించుకోవడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. మరి ఢిల్లీ లిక్కర్ స్కాంలో క్లీన్ చిట్ వచ్చిన తర్వాత కూడా అన్నాచెల్లెళ్లు ఇలా బహిరంగంగా విమర్శించుకోవడం ఆసక్తి రేపుతోంది.



# ఖమేని సమాచారం ఇచ్చిందెవరు .. చంపడానికి పట్టిన సమయం ఎంత ?





**హైదరాబాద్ పెన్ పవర్:** ఒక దేశాధినేతను మరో దేశం కిడ్నాప్ చేయాలన్నా, చంపాలన్నా మామూలు విషయం కాదు. చాలా ఖచ్చితమైన సమాచారం ఉండాలి. ఆ దేశాధినేత ఎక్కడ ఉంటున్నారు ?. ఏం చేస్తున్నారు ?. ఎవరితో కలుస్తున్నారు ?. ఇలా ఆయనకు సంబంధించిన చాలా ఖచ్చితమైన సమాచారం ఉండాలి. అప్పుడే టార్గెట్ ను పూర్తి చేయగలరు. వెనుజులా అధ్యక్షుడు నికోలస్ మదురో కిడ్నాప్ మొదలుకొని, ఇరాన్ సుప్రీం ఖమేని హత్య వరకు ఖచ్చితమైన సమాచారమే కీలక పాత్రపోషించింది. మరి అమెరికాకు, ఇజ్రాయిల్ కు ఆ ఖచ్చితమైన సమాచారం ఎలా వచ్చింది ?. ఎవరు ఇచ్చారు ?. ఇరాన్ లో ఇజ్రాయిల్, అమెరికాకు ఖచ్చితమైన సమాచారం ఇచ్చే సోర్సెస్ ఏంటి అన్న ప్రశ్నలు ప్రపంచ వ్యాప్తంగా ఉన్నాయి.

**ఐదు, పది నిమిషాల్లోనే పని పూర్తి :**

అమెరికా, ఇజ్రాయిల్.. ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనిని టార్గెట్ చేసిన ఐదు, పది నిమిషాల్లోనే చంపేశాయి. దాదాపు ముప్పై మిసైల్లతో ఖమేని నివాసం ఉంటున్న ప్రాంతాన్ని ఎటాక్ చేశారు. దీంతో ఖమేనితో పాటు ఇతర ఉన్నతాధికారులు హతమయ్యారు. ఖమేని కూతురు, అల్లుడు, మనవరాలుతో పాటు ఇతర సిబ్బంది కూడా మరణించారు. ఖమేనిపై ఎటాక్ తర్వాత ఇరాన్ నిఘా వర్గాలు ఎదురుదాడి ప్రారంభిస్తాయని అమెరికా, ఇజ్రాయిల్ ముందే అంచనా వేశాయి. అందుకే ఖమేనిపైన, ఇరాన్ నిఘా వర్గాలపైన ఒకే సమయంలో దాడి చేశారు. దీంతో ఇరాన్ నిఘా వర్గాలు వెంటనే తిరిగి దాడి చేయలేని పరిస్థితి ఏర్పడింది. ఇరాన్ దేశాధినేతపై ఖచ్చితమైన దాడి చేసిన అమెరికా, ఇజ్రాయిల్ కు అత్యంత ఖచ్చితమైన సమాచారం ఉందన్న వాదన ఉంది.

**చాలా రోజులకు ముందే రెక్కీ :**

ఖమేని ఎక్కడ ఉంటారు ?. ఏం చేస్తారు ? ఆయన డైలీ రొటీన్స్ ఏంటి ?

ఎవరిని కలుస్తారు లాంటి విషయాలపై మెస్సాద్ చాలా రోజులకు ముందే నిఘా వేసింది. ఇరాన్ లో ఉంటూ ఖమేని కదలికలను మెస్సాద్ అంచనా వేసింది. ఖచ్చితమైన అంచనాకు వచ్చిన తర్వాత ఇజ్రాయిల్ కు సమాచారం ఇచ్చింది. ఉన్నతాధికారులతో ఖమేని తన నివాసంలో చర్చలు జరుపుతున్నారన్న ఖచ్చితమైన సమాచారం ఇజ్రాయిల్ కు మెస్సాద్ పంపిన తర్వాతే భీకరమైన మిస్సైల్ దాడి చేసింది. అదే సమయంలో ఇరాన్ నిఘావర్గాలపై కూడా దాడి చేసింది.

**మెస్సాద్ ఎవరు ?**

ఇజ్రాయిల్ గూఢచారి సంస్థే మెస్సాద్. ఎలాంటి క్లిష్టతరమైన ఆపరేషన్లైనా సరే ఖచ్చితత్వంతో పూర్తి చేస్తుందన్న చరిత్ర మెస్సాద్ కు ఉంది. శత్రుదేశాల కదలికలను నిత్యం గమనిస్తూనే, తన లక్ష్యాలను పూర్తి చేస్తుంది. ప్రపంచంలో ఉన్న ఏ ఇతర దేశాలకు మెస్సాద్ లాంటి బలమైన గూడాచారి వ్యవస్థ లేదంటే అర్థం చేసుకోవచ్చు. ఖమేని కదలికలను, సమాచారాన్ని అమెరికాకు, ఇజ్రాయిల్ కు ఇచ్చింది మెస్సేదే అన్న వాదన ఉంది. ఇరాన్ న్యూక్లియర్ ప్రోగ్రాంకు వెళ్లకుండా అడ్డుకోవాలన్న లక్ష్యంతో ఇజ్రాయిల్, అమెరికా మొదలుపెట్టిన యుద్ధంలో మెస్సాద్ పాత్ర చాలా కీలకం.

# వైసీపీలో ఈయన కీలకం అవుతారా ?



**హైదరాబాద్ పెన్ పవర్:** వైసీపీకి మాస్ లీడర్స్ అవసరం గట్టిగా పడుతోంది. ప్రజలలో ఉంటూ అధికార కూటమిని ఇరకాటంలో పెట్టే నాయకత్వం అవసరం ఇంక ఎక్కువగా ఉంది అని అంటున్నారు. ఇక రీజనల్ వారీగా చూస్తే వైసీపీకి రాయలసీమలో బలమైన నేతలు ఉన్నారు. అయితే వారిలో చాలా మంది ఎన్నికల్లో ఓటమి తరువాత సైలెంట్ అయ్యారు. కొందరు ఇపుడిపుడే బయటకు వస్తున్నారు అలాగే ప్రకాశం నెల్లూరు జిల్లాలో చూస్తే మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి వంటి వారి వల్ల కొంత లోటు తీరుతోంది కానీ ఇంకా బలమైన గొంతు వినిపించాల్సి ఉంది. కోస్తాలో అయితే అంబటి రాంబాబు, జోగి రమేష్, పేర్ని నాని వంటి వారు ఉన్నారు. గోదావరి జిల్లాలో ఇపుడిపుడే పార్టీ పుంజుకుంటోంది.

**ఉత్తరాంధ్రాలో అయితే :**

ఇదిలా ఉంటే ఉత్తరాంధ్రలో వైసీపీలో సీనియర్ నేతలకు కొదవ లేదు. అయితే మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ మాదిరిగా జిల్లాలకు జిల్లాలను శాసించే నేతలు మాత్రం కావాల్సి ఉంది. ఇదంతా ఎందుకు అంటే బొత్స ఇపుడు అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్నారు. ఆయన మీద పెద్దగా ఒత్తిడి పెట్టకూడదు అని అటు కుటుంబం కోరుకుంటోంది. దానిని కచ్చితంగా పార్టీ అధినాయకత్వం ఆమోదిస్తుంది అని అంటున్నారు. ఈ క్రమంలో బొత్స మాదిరిగా పార్టీని ఉమ్మడి మూడు జిల్లాలలో ముందుకు తీసుకుని వెళ్ళే నాయకత్వం అవసరం ఉందని అంటున్నారు.

**ఆయన గురించి ఆలోచన :**

ఇక బీసీ నేతగా సబ్జెక్టు మీద పట్టు ఉన్న వారిగా ఉత్తరాంధ్రా జిల్లాలో మరో సీనియర్ నేత ఉన్నారు. ఆయన కూడా మాజీ మంత్రిగా ఉన్నారు. ఎన్నో సార్లు ఎమ్మెల్యేగా నెగ్గి అసెంబ్లీకి వెళ్ళి ఉన్నారు. ఆయనే ధర్మాన ప్రసాదరావు. ఇపుడు ఆయన పేరు అధినాయకత్వం పరిశీలిస్తోంది అని అంటున్నారు. బలమైన సామాజిక వర్గం నేపథ్యంతో పాటుగా సబ్జెక్ట్ తో కూటమి ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీసే నైజం ఉన్న ధర్మానకు చాన్స్ దక్కుతుంది అని అంటున్నారు.

**పార్టీలో దూకుడుగా :**

ధర్మాన ప్రసాదరావుకు శ్రీకాకుళం జిల్లా రాజకీయాల్లో మంచి పట్టు ఉంది. జిల్లా మొత్తం మీద పూర్తి అవగాహన ఉంది. అలాగే ప్రత్యర్థుల వ్యూహాలకు ఎత్తులకు పై ఎత్తు వేసే నేపుణ్యం ఉంది. ఆయన అనుచరులుగా చెప్పుకునే వారు విశాఖ జిల్లాలో కూడా ఉన్నారు. అయితే ధర్మాన ఎన్నడూ తన జిల్లాను దాటి బయటకు వచ్చింది లేదు. ఆయన తన పరిధి పరిమితులకు లోబడే రాజకీయాలు చేశారు. ఆయన ప్రెస్ మీట్స్ కూడా అన్నీ శ్రీకాకుళంలోనే పెడుతూ ఉంటారు. అయితే ధర్మాన ఇపుడు జిల్లాను దాటి ముందుకు రావాల్సి ఉందని అంటున్నారు. అంతే కాదు ఆయన ఉత్తరాంధ్రా జిల్లాలో పార్టీని మరింతగా బలోపేతం చేసేందుకు దూకుడుగా రాజకీయం చేయాల్సిన అవసరం ఉంది అని అంటున్నారు.

**కీలక పదవిలో :**

హైకమాండ్ అయితే కీలక పదవిలో ఎవరినైనా ఉంచి ఉత్తరాంధ్రాలో పార్టీని బలోపేతం చేయాలని చూస్తోంది. దాంతో ధర్మానకు కీలకమైన బాధ్యతలు పదవి అప్పగిస్తారా అన్న చర్చ కూడా నడుస్తోంది. ఇక ధర్మాన విషయం తీసుకుంటే తన కుమారుడిని వారసుడిగా చేసి తాను రాజకీయాల నుంచి తప్పుకోవాలని చూస్తున్నారు అని అంటున్నారు. ఆయన పెద్దగా ఆసక్తిని చూపించడం లేదని అంటున్నారు. అయితే అధినాయకత్వం బాధ్యతలు అప్పగిస్తే ఆయన ఎస్ అని చెబుతారు అని కూడా అంటున్నారు. మొత్తానికి బొత్స ఒకింత తగ్గి విశ్రాంతిని కోరుకుంటున్న నేపథ్యంలో ఉత్తరాంధ్రాలో సీనియర్ నేతల మీద పార్టీ ఫోకస్ పెట్టింది అని అంటున్నారు. అందులో ముందు వరసలో ధర్మాన ప్రసాదరావు ఉన్నారని చెబుతున్నారు. చూడాలి మరి ఏమి జరుగుతుందో.

# కొణతాల మంత్రి అయితే వైసీపీకి ఇబ్బందేనా ?



**హైదరాబాద్ పెన్ పవర్:** ఉమ్మడి విశాఖ జిల్లాలో బలమైన సామాజిక వర్గానికి చెందిన నాయకుడిగా కొణతాల రామకృష్ణ ఉన్నారు. ఆయన రెండు సార్లు ఎంపీగా మరో రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచారు ఆయన రాజకీయ జీవితంలో ఓటములు అజ్ఞాత వాసాలు కూడా ఉన్నాయి. అయితే ఆయనకు 2024 ఎన్నికల రూపంలో కాలం కలిసి వచ్చింది. అప్పటికి పుష్కర కాలంగా రాజకీయంగా వెలుగులు లేక కాంగ్రెస్ నుంచి బయటకు వచ్చి వైసీపీలో ఇమడ లేక టీడీపీలో అడుగులు వేయలేక నానా రకాలుగా సతమతం అయిన కొణతాల రామక్రిష్ణకు జనసేన రూపంలో మంచి ఆశ్రయం లభించింది. దాంతో ఆయన కూటమి మద్దతుతో మరోసారి ఎమ్మెల్యే అయిపోయారు. అలా ఆయన రాజకీయ సిరి మెరిసింది.

**మంత్రి పదవి అంటే :**

ఇక కొణతాల రామకృష్ణ మంత్రి అవుతారు అని అంతా అనుకున్నారు. ఎందుకంటే ఆయన బలమైన సామాజిక వర్గానికి చెందిన వారు, మంచి వ్యక్తిగా పేరుంది ఆరోపణలు లేవు, గతంలో మంత్రిగా పనిచేసిన అనుభవం ఉంది. దాంతో జనసేన కోటాలో ఉత్తరాంధ్రాలో ఆయనే మంత్రి అని ఫిక్స్ అయిపోయారు. కానీ జరిగింది వేరు ఆయనకు చాన్స్ రాలేదు, పాయకరావుపేట కు చెందిన వంగలపూడి అనితకు మంత్రి యోగం పట్టింది. అయితే తన పని తాను చేసుకుంటూ కొణతాల ముందుకు సాగుతున్నారు.

**సబ్జెక్టు మీద పట్టు :**

కొణతాల రామక్రిష్ణకు సబ్జెక్ట్ మీద మంచి పట్టు ఉంది. ఆయన ఉత్తరాంధ్ర సమస్యల మీద పూర్తి అవగాహనతో పనిచేసి ఉన్నారు. అందుకే ఆయన సేవలను జనసేన వాడుకోవాలనే ఎమ్మెల్యేగా గెలిపించింది. అయితే ఇపుడు అనూహ్యంగా ఆయనకు మంత్రి పదవి దక్కబోతోంది అని ప్రచారం అయితే సాగుతోంది. జనసేనకు ఉత్తరాంధ్రాలో ఆరుగురు ఎమ్మెల్యేలు ఉన్నారు. అందులో పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు తప్పించి అంతా కొత్త వారే. ఇక రమేష్ బాబుకు సామాజిక సమీకరణలు అడ్డంకిగా ఉన్నాయి. దాంతో కొణతాలకు మంత్రి పదవి దక్కే సూచనలు ఉన్నాయని అంటున్నారు.

**వైసీపీకి చెక్ అంటూ :**

వైసీపీకి చెక్ పెట్టాలీ అంటే కొణతాల రామకృష్ణ వంటి పెద్ద మనిషిని మంత్రి పదవి ఇవ్వాలన్నది కూడా కూటమి వ్యూహంగా ఉంది అని అంటున్నారు ఉమ్మడి విశాఖ జిల్లాలో వైసీపీకి నాయకులు ఉన్నారు కానీ నడిపించే నాధుడు అయితే లేరు. దాంతో ఈ అవకాశాన్ని కూటమి అడ్వాంటేజ్ గా మార్చుకునేందుకు కొణతాల వంటి వారిని ప్రయోగిస్తుంది అని అంటున్నారు. ఇక సౌమ్యుడిగా పేరున్న కొణతాల వల్ల కూటమి ఇమేజ్ పెరగడమే కాకుండా ఆయన అనుభవంతో ఉమ్మడి విశాఖ జిల్లాతో పాటు ఉత్తరాంధ్రాలో సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ఆశిస్తున్నారు. అలాగే రాజకీయంగా వైసీపీకి షాక్ ట్రీట్మెంట్ ఇవ్వాలంటే కొణతాల సరైన వ్యక్తి అని అంటున్నారు. ఏది ఏమైనా మంత్రి వర్గ విస్తరణలో కొణతాల పేరు అయితే బాగా నలుగుతోంది అని అంటున్నారు. చూడాలి మరి ఈ ప్రచారంలో నిజమెంత ఉందో.

# వైసీపీ సర్వేలను నమ్ముకుంటోందా ?



**హైదరాబాద్ పెన్ పవర్:** ఏపీలో ప్రధాన ప్రతిపక్షంగా వైసీపీ ఉంది. అయితే అసెంబ్లీలో వైసీపీ కనిపించడం లేదు, ఆ పార్టీ అధినాయకత్వం అయితే జనంలోకి వెళ్ళడం లేదు, ఇక పార్టీ నాయకులు కూడా జనంలోకి వెళ్తున్న విషయాలు తక్కువగానే ఉన్నాయి. మరో వైపు చూస్తే కనుక మీడియా మీటింగులతోనే బిగ్ సౌండ్ చేసే నేతలు కనిపిస్తున్నారు. ఇటీవల కాలంలో తిరుమల లడ్డూ వివాదంలో కూడా వైసీపీ కొంత ఇబ్బంది పడింది. అయినా సరే తన వైపు వెర్షన్ ని వినిపిస్తోంది.

**జైలు పాలు అవుతున్నారు :**

ఇంకో వైపు చూస్తే వైసీపీకి చెందిన నేతలు వరసగా జైలు పాలు అయ్యారు. మాజీ మంత్రి అంబటి రాంబాబు జైలుకు వెళ్ళి వచ్చారు. ఆయన మీడియా ముందు మళ్ళీ గట్టిగానే మాట్లాడుతున్నారు. అంబటి ఏపీలో హాట్ టాపిక్ అయ్యారని వైసీపీకి సానుభూతి వచ్చిందని ఆ పార్టీ నేతలు చెప్పుకుంటున్నారు. ఇవన్నీ పక్కన పెడితే ఏపీలో కేవలం ఇరవై నెలలలోనే టీడీపీ కూటమి పని అయిపోయింది అని వైసీపీ నేతలు అంటున్నారు వచ్చేది జగన్ ప్రభుత్వమే అని ధీమాగా చెబుతున్నారు.

**సర్వేలతోనేనే :**

ఇదిలా ఉంటే ఆ మధ్యన లిక్కర్ స్కాం కేసులో జైలుకి వెళ్ళి వచ్చిన ఒక నాయకుడు మళ్ళీ సర్వేలు చేయిస్తున్నారు అని అంటున్నారు. ఆయన తాజాగా సర్వే చేయించి అధినాయకత్వం ముందు పెట్టారని ఆ సర్వేలో ఇప్పటికిప్పుడు ఎన్నికలు పెడితే వైసీపీ స్వీప్ చేస్తుందని పేర్కొన్నారు అని అంటున్నారు. దానికి కారణాలు ఏమిటి అంటే లడ్డూ ఇష్యూ అధికార పక్షానికి బూమరాంగ్ అయిందని అలాగే అంబటి రాంబాబు ఎపిసోడ్ లో సానుభూతి వచ్చిందని కూటమి పాలన పట్ల ప్రజలలో తీవ్ర వ్యతిరేకత ఉందని అంటున్నారు. అయితే అంత వ్యతిరేకత కూటమి ప్రభుత్వం మీద నిజంగా ఉందా అన్నది ఒక చర్చ. ఈ రకమైన సర్వే నివేదికను సొంత పార్టీ వారే పెద్దగా నమ్మడం లేదని అంటున్నారు.

**గతంలోనూ అదే తీరు :**

ఇక ఆ నాయకుడు గతంలో అంటే వైసీపీ అధికారంలో ఉన్నపుడు కూడా ఇదే తీరున సర్వేలు చేయించి వైసీపీకి ఢోకా లేదని బ్రహ్మాండమైన మెజారిటీతో గెలుస్తుంది అని చెప్పారని గుర్తు చేస్తున్నారు. తీరా ఫలితం చూస్తే దారుణంగా వచ్చిందని అంటున్నారు. అందువల్ల సర్వేలను నమ్ముకోకుండా వైసీపీ జనంలోకి వెళ్ళాలని గ్రౌండ్ రియాలిటీస్ చూడాలని సూచనలు వస్తున్నాయి. ఏ పార్టీ అయినా ప్రజలతో ఉంటేనే జనాల ఆదరణ దక్కుతుందని వైసీపీ ఆ విధంగా ముందుకు సాగాలని తప్పించి సర్వేలను నమ్ముకుంటే మళ్ళీ ఇబ్బందులే ఎదురవుతాయని అంటున్న వారూ ఉన్నారు. మొత్తానికి చూస్తే వైసీపీలో ధీమా పెరుగుతోంది. ఏ రాజకీయ పార్టీకి అయినా ధీమా ఉండడం తప్పు లేదు, కానీ అది అతి ధీమా కాకూడదని అంటున్నారు. పైగా గ్రౌండ్ లెవెల్ రియాలిటీస్ ఎప్పటికపుడు చెక్ చేసుకోవాల్సి ఉంటుందై అంతే తప్ప సర్వేల పేరుతో భ్రమలలోకి వెళ్తే ట్రబుల్స్ తప్పవని అంటున్నారు.

# మధ్యవర్తిత్వం లేకనే .... సీజేఐ సంచలన వ్యాఖ్యలు

**హైదరాబాద్ పెన్ పవర్:** మధ్య వర్తిత్వం అంటే చిన్న మాట కాదు, పెద్ద బాధ్యత. ఒక వివాదం నాలుగు గోడల మధ్యనే సమసిపోయేలా చేసేది ఈ మధ్యవర్తిత్వం. బయటకు వెళ్తే అయ్యేది రచ్చ మాత్రమే. ముదిరితే గొడవలుగానే మారుతుంది. అలా కాకుండా భేదాలను ముందే తొలగించుకుంటే అంత కంటే గొప్ప తీర్పు వేరేది ఉండదు, ఇపుడు తలపండిన న్యాయమూర్తులు సైతం ఇదే చెబుతున్నారు. మధ్యవర్తిత్వంతో ఎన్నో సమస్యలు పరిష్కారం అవుతాయని అంటున్నారు.

**సులువుగా అయ్యే కేసులు :**

ఇదిలా ఉంటే ఏపీ పర్యటనకు వచ్చిన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ విజయవాడలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ న్యాయాన్ని అందించడంలో మధ్యవర్తిత్వం అనేది ఒక ముఖ్యమైన సాధనమని చెప్పుకొచ్చారు. సులువుగా మధ్యవర్తిత్వంతో అయ్యే కేసులు కూడా కోర్టుల్లో ఉండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే మధ్యవర్తులు క్లైయింట్ నమ్మకం పొందడం చాలా అవసరం అని ఆయన అన్నారు. ప్రతీ ఒక్కరూ న్యాయస్థానాలను న్యాయాన్ని నమ్ముతారని అందువల్ల మధ్యవర్తిత్వాన్ని కోర్టులు కచ్చితంగా అందరికీ తెలిసేలా చేయాలని ఆయన సూచించారు. 2023లో వచ్చిన మధ్యవర్తిత్వ చట్టం వల్ల దీనికి ఒక చట్టబద్ధత లభించిందని అన్నారు. దీని ద్వారా జరిగే పరిష్కారాలు కోర్టు డిక్రీ తో సమానంగా అమలు చేయబడతాయని వివరించారు. వివాదంలో ఉన్న వ్యక్తులకు మధ్యవర్తిపై పూర్తి విశ్వాసం ఉండాలన్నారు.

**శ్రీక్రిష్ణుడే దారి చూపాడు :**

దీన్ని కేవలం ప్రత్యామ్నాయంగా కాకుండా ప్రాధాన్యత కలిగిన పద్ధతిగా చూడాలని జస్టిస్ సూర్యకాంత్ పేర్కొన్నారు. మధ్యవర్తిత్వం ఒక ముఖ్యమైన ఆల్టర్నేటివ్ గా ఆయన చెప్పడం విశేషం. సమస్యల పరిష్కారానికి మధ్యవర్తిత్వాన్ని పురాతన కాలం నుంచే భారతదేశంలో వినియోగిస్తున్నారని ఆయన గుర్తు చేశారు. ఒకసారి వెనక్కి వెళ్తే మధ్యవర్తిత్వం అనేది భారతదేశ డిఎన్ఏలోనే ఉందని స్పష్టం అవుతుందని అన్నారు. మధ్యవర్తిత్వానికి వేల ఏళ్ల నాటి చరిత్ర దీనికి ఉందని జస్టిస్ సూర్యకాంత్ తెలిపారు. శ్రీకృష్ణుడు పాండవులకు, కౌరవులకు మధ్య శాంతి కోసం చేసిన ప్రయత్నాన్ని మొదటి అధికారిక మధ్యవర్తిత్వంగా ఆయన ఉదహరించారు.

**సరైన శిక్షణ అవసరం :**


ఇక చూస్తే న్యాయ వ్యవస్థ పట్ల ప్రజలకు ఉన్న నమ్మకం వల్ల న్యాయస్థానాల ద్వారా జరిగే మధ్యవర్తిత్వానికి అధిక ప్రాధాన్యత ఉంటుందని అన్నారు. మధ్యవర్తులుగా వ్యవహరించే వారికి సరైన శిక్షణ ఉండటం చాలా ముఖ్యం అని అన్నారు. కోర్టులలో కేసుల భారాన్ని తగ్గించడానికి, త్వరితగతిన స్నేహపూర్వక వాతావరణంలో వివాదాలను పరిష్కరించుకోవడానికి మధ్యవర్తిత్వం ఒక అద్భుతమైన మార్గమని జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. మధ్యవర్తిత్వం అనేది ఇప్పుడు అంతర్జాతీయంగా ముఖ్యమైన పాత్ర పోషిస్తోందని చెప్పారు. మలేషియాలో మధ్యవర్తిత్వానికి దొరుకుతున్న ప్రోత్సాహాన్ని తాను స్వయంగా చూసానని ఆయన చెప్పారు. మధ్యవర్తిత్వం మన జీవితాలలో ప్రతి అంశంలోనూ ఉందని అన్నారు. మధ్యవర్తిత్వం ద్వారా పెద్ద పెద్ద సమస్యలు కూడా పరిష్కారం అవుతున్నాయని అన్నారు. కమర్షియల్ సమస్యలు కూడా మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించబడతాయని చెప్పారు.

**సక్సెస్ ఫుల్ ఫార్ములా :**

ఇక జ్యుడీషియల్ సిస్టమ్ మీడియేషన్ ను అంతా కలిసి ప్రమోట్ చేయాలన్నారు. మీడియేషన్ ఇప్పుడు చాలా ఆమోదింప దగ్గ ప్రక్రియగా జస్టిస్ సూర్యకాంత్ చెప్పారు. కేవలం ఇండియాలోనే కాదు ప్రపంచం మొత్తం కూడా దీనికి ఆదరణ పెరుగుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్ లో మీడియేషన్ విషయంలో ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ముఖ్యమంత్రితో చేసిన మీడియేషన్ విజయవంతం అయ్యిందన్నారు. అలాగే ఏపీ ప్రభుత్వం రైతులతో జరిపిన చర్చలు ఫలితమే అమరావతి అని అన్నారు. మీడియేషన్ను లీగల్, ప్రొఫెషనల్ కల్చర్ లో భాగస్వామ్యం చేసుకోవాలని ఆయన చెప్పారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

# తాజా యుద్ధం వేళ గల్ఫ్.. ఇజ్రాయెల్.. ఇరాన్ లో మనోళ్లు ఎందరు?



**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రపంచంలో ఏ దేశమైనా సరే.. అక్కడ భారతీయులు కనిపిస్తారు. కష్టపడే తత్త్వం.. ఇంగ్లిషులో మాట్లాడే తీరు ఏ దేశంలో అయినా ఇట్టే ఇమిడిపోయేలా చేస్తుంది. ప్రపంచ వ్యాప్తంగా భారతీయులు 207 దేశాల్లో నివసిస్తూ ఉంటారన్నది ఒక అంచనా. ఇదే విషయాన్ని భారత విదేశాంగ శాఖ కూడా స్పష్టం చేస్తోంది. విదేశాల్లో ఉండే భారతీయుల సంఖ్య ఏకంగా 3.54 కోట్లుగా చెబుతారు. ఇందులో అమెరికాలో 56 లక్షలు.. యూఏఈలో 39 లక్షలు.. కెనడాలో31 లక్షలు.. మలేషియాలో 29 లక్షలు.. సౌదీలో 27 లక్షలకు పైనే మనోళ్లు ఉన్నట్లు అధికారిక లెక్కలు స్పష్టం చేస్తుంటాయి. గల్ఫ్ దేశాలలో దాదాపు కోటి మంది (కచ్చితంగా చెప్పాలంటే 97 లక్షల మంది) భారతీయులు ఉపాధి పొందుతుంటారని చెప్పాలి.తాజాగా జరుగుతున్న యుద్ధం నేపథ్యంలో ఇజ్రాయెల్, ఇరాన్, యూఏఈలో ఉన్న భారతీయుల గురించి ఆందోళన ఎక్కువగా ఉంది. ఇంతకూ ఆయా దేశాల్లో మనోళ్లు ఏం చేస్తుంటారు? ఏయే రంగాల్లో భారతీయులు ఎక్కువగా ఉంటారు? అన్న విషయంలోకి వెళితే.. ఆసక్తికర అంశాలు వెలుగు చూస్తాయి. యూఏఈలో భారతీయులు అన్ని రంగాల్లో కనిపిస్తారు. వారు లేని రంగం అంటూ ఉండదన్న మాట బలంగా వినిపిస్తూ ఉంటుంది. అత్యధికంగా నిర్మాణ రంగంలో కనిపిస్తారు. ఎక్కువగా బ్లూ కాలర్ లేబర్ ఈ రంగంలో ఉంటారు. దుబాయ్ లోని ఆకాశహర్మ్యాల నిర్మాణంలో మనోళ్ల కీలకంగా వ్యవహరిస్తుంటారు. సూపర్ మార్కెట్లు.. హోటళ్లు.. డెలివరీ సర్వీసులతోపాటు టూరిజం రంగాల్లోనూ భారతీయులు ఎక్కువగా కనిపిస్తారు.వైద్యులు.. వైద్య రంగ సర్వీసులతో పాటు.. టీచర్ల సంఖ్య కూడా ఎక్కువే. వేలాది మంది భారతీయులు ఈ రంగాల్లో పని చేస్తుంటారు. దుబాయ్ లోని బంగారు మార్కెట్లు, వస్త్ర, రియల్ ఎస్టేట్ రంగాల్లో భారతీయ వ్యాపారవేత్తల అధిపత్యం ఎక్కువని చెబుతారు. ఇజ్రాయెల్ లో మనోళ్లు ఎక్కువగా కొన్ని రంగాల్లో కనిపిస్తారు. ఆ దేశంలోని పెద్ద వయస్కులు.. పేషెంట్ల సంరక్షణతో పాటు నర్సింగ్ సేవల్లోనూ భారతీయులు ఎక్కువగా కనిపిస్తారు. ఇజ్రాయెల్ – పాలస్తీనా యుద్ధం మొదలైన తర్వత పాలస్తీనా కార్మికుల స్థానంలో దాదాపు ఆరు వేల మంది నిర్మాణ పనుల కోసం భారతీయులకు అవకాశాలు కల్పించారు. ఇజ్రాయెల్ లోని డైమండ్ ఎక్స్ఛేంజ్‌లో గుజరాత్ వ్యాపారులు ఎక్కువగా కనిపిస్తారు. ఐటీ రంగంతో పాటు.. రీసెర్చ్ లోనూ భారతీయులు కనిపిస్తారు.ఇరాన్ విషయానికి వస్తే.. ఈ దేశంలో భారతీయ విద్యార్థులు ఎక్కువగా కనిపిస్తారు. ఇస్లామిక్ వర్సిటీలో మతపరమైన విద్యను అభ్యసించేందుకు జమ్మూకశ్మీర్ నుంచి విద్యార్థులు ఎక్కువగా వెళుతుంటారు. ఇరాన్ – భారత్ మధ్య జరిగే చమురు, వ్యవసాయ ఉత్పత్తుల వ్యాపారాన్ని పర్యవేక్షించే రంగంలో మనోళ్లు కనిపిస్తారు. ఇరాన్ లోని కీలకమైన చాబహార్ ఓడరేవు డెవలప్ మెంట్ పనుల్లో భారతీయ ఇంజినీర్లు.. సాంకేతిక నిపుణులు ఎక్కువగా ఉంటారు.

# ఇరాన్ రివర్స్ ఇంజినీరింగ్.. అమెరికాను ఏం చేసిందంటే?

**హైదరాబాద్ పెన్ పవర్:** అంతర్జాతీయ రాజకీయాల్లో ఎప్పుడు ఎవరు ఎవరికి చెక్ పెడతారో చెప్పలేం.. కానీ, ఇప్పుడు ఇరాన్ చేస్తున్న పనులు చూస్తుంటే మాత్రం అమెరికాకు పగలు కూడా చుక్కలు కనిపిస్తున్నాయి. సాధారణంగా ఒక దేశం దగ్గర అత్యాధునిక ఆయుధాలు ఉంటే, ఆ దేశం చాలా శక్తివంతమైనదని ప్రపంచం ఎరిగిన సత్యం. అమెరికా విషయంలో కూడా అదే నిజం. కానీ, ఇప్పుడు ఆ అమెరికా తయారు చేసిన ఆయుధాలే తిరిగి అమెరికాపైకి, లేదా వారి మిత్రదేశాలపైకి వస్తుంటే ఎలా ఉంటుంది..? సరిగ్గా ఇదే ఇప్పుడు పశ్చిమాసియాలో జరుగుతోంది. ఇరాన్ తన తెలివితేటలతో అమెరికాకే 'రివర్స్' షాక్ ఇస్తోంది.

**ఉక్రెయిన్ యుద్ధం.. ఇరాన్‌కు వరం..?**

ప్రస్తుతం జరుగుతున్న ఉక్రెయిన్ -- రష్యా యుద్ధం ఇరాన్ వరంలా మార్చుకుంది. ఉక్రెయిన్ బలగాలకు మద్దతుగా అమెరికా తన అత్యంత శక్తివంతమైన ఆయుధాలను సరఫరా చేస్తోంది. అయితే.., యుద్ధ భూమిలో రష్యా చేజిక్కించుకున్న కొన్ని అమెరికా ఆయుధాలను వారు ఇరాన్‌కు అప్పగిస్తున్నారనే వార్తలు ఇప్పుడు సంచలనం సృష్టిస్తున్నాయి. రష్యాకు, ఇరాన్‌కు ఉన్న స్నేహం గురించి మనందరికీ తెలిసిందే. రష్యాకు డ్రోన్లు ఇస్తున్నందుకు బదులుగా, ఇరాన్ ఈ అమెరికా టెక్నాలజీని తన వశం చేసుకుంటోంది.

**రివర్స్ ఇంజినీరింగ్ ఇదేనా?**

ఇక్కడ అసలైన మ్యాజిక్ ఏంటంటే 'రివర్స్ ఇంజినీరింగ్'. అంటే ఒక వస్తువు ఎలా తయారైందో తెలుసుకోవడానికి దాన్ని విడదీసి, లోపల ఉన్న టెక్నాలజీని అర్థం చేసుకొని, మళ్లీ అలాంటిదే సొంతంగా తయారు చేయడం. ఇరాన్ ఈ విషయంలో ఆరితేరింది. అమెరికాకు చెందిన అత్యంత శక్తివంతమైన 'బీజీఎం–71 టీవోడబ్ల్యూ' యాంటీ ట్యాంక్ మిస్సైల్‌ను ఇరాన్ చేజిక్కించుకుంది. దాన్ని క్షుణ్ణంగా పరిశీలించి, దానిపై పరిశోధనలు చేసి దానిలాగే పనిచేసే 'తూఫాన్' అనే మిస్సైల్ తయారు చేసేసింది. ఇప్పుడు ఈ తూఫాన్ మిస్సైళ్లు అమెరికా ట్యాంకులను ధ్వంసం చేసే స్థాయికి చేరాయి.

అంతేకాదు, అమెరికా గూఢచారి డ్రోన్ అయిన 'ఆర్‌క్యూ–170 సెంటినల్' డిజైన్‌ను ఉపయోగించి ఇరాన్ సొంతంగా 'షాహెద్' డ్రోన్లను రూపొందించింది. ఈ షాహెద్ డ్రోన్లు ఇప్పుడు యుద్ధ రంగంలో ఎంతటి అలజడి సృష్టిస్తున్నాయో మనం చూస్తూనే ఉన్నాం. తక్కువ ఖర్చుతో తయారయ్యే ఈ డ్రోన్లు అమెరికా రక్షణ వ్యవస్థలకే సవాల్ విసురుతున్నాయి.

**వెస్ట్రన్ టెక్నాలజీ.. ఇరాన్ చేతుల్లో!**

అమెరికా గర్వంగా చెప్పుకునే 'జావలిన్', 'స్టింగర్' వంటి ఆధునిక క్షిపణుల టెక్నాలజీ కూడా ఇప్పుడు ఇరాన్ సొంతం చేసుకుంటోంది. పశ్చిమ దేశాలు ఉక్రెయిన్‌కు పంపిన ఈ ఆయుధాలు రష్యా చేతికి చిక్కితే, అవి నేరుగా ఇరాన్ ల్యాబ్‌కు చేరుతున్నాయి. అక్కడ శాస్త్రవేత్తలు వాటిని చదివేసి, వాటిలోని లోపాలను గుర్తించి, వాటికంటే మెరుగైన లేదంటగే అలాంటివే చవకగా తయారు చేస్తున్నారు. తన టెక్నాలజీని దొంగిలించి తనకే పోటీగా నిలబడుతున్న ఇరాన్‌ను చూసి అమెరికా ఏం చేయాలో పాలుపోని స్థితిలో ఉంది.

**అగ్రరాజ్యానికే సవాల్..**

నిజానికి ఇది అమెరికాకు పెద్ద తలనొప్పి అనే చెప్పాలి. మనం ఒక ఆయుధాన్ని తయారు చేసి శత్రువుపైకి పంపితే, వాడు దాన్ని పట్టుకొని, తిరిగి అలాంటిదే పది రెట్లు ఎక్కువగా తయారు చేసి మనపైకే వదిలితే ఎలా ఉంటుంది? ఇప్పుడు అమెరికా పరిస్థితి అదే. ఇరాన్ ఇప్పుడు కేవలం యుద్ధం చేయడం లేదు.. అమెరికా అహంకారాన్ని దెబ్బతీస్తోంది. ఒక చిన్న దేశం అనుకున్న ఇరాన్, ప్రపంచ అగ్రరాజ్యం టెక్నాలజీనే వాడుకుంటూ వారికే సవాల్ విసరడం అంటే మామూలు విషయం కాదు.రాబోయే రోజుల్లో యుద్ధాలు కేవలం తుపాకులతోనో, బాంబులతోనో కాదు.. ఇలాంటి టెక్నాలజీ తెలివితేటలతోనే జరగబోతాయి. ఇరాన్ అనుసరిస్తున్న ఈ రివర్స్ ఇంజినీరింగ్ పద్ధతి వల్ల అమెరికా తన ఆయుధాల రహస్యాలను కాపాడుకోవడం కష్టం అవుతోంది. 'శత్రువు ఆయుధంతోనే శత్రువును కొట్టడం' అనే సూత్రాన్ని ఇరాన్ అక్షరాలా అమలు చేస్తోంది. ఈ 'ఆయుధాల పోరు' భవిష్యత్తులో ఇంకెన్ని మలుపులు తిరుగుతుందో చూడాలి!

# ఇజ్రాయెల్-అమెరికా వర్సెస్ ఇరాన్.. ముదిరితే మూడో ప్రపంచ యుద్ధమే!

**హైదరాబాద్ పెన్ పవర్:** పశ్చిమాసియా... పేరులో పశ్చిమం ఉన్నా.. వాస్తవంలో 'కచ్చి'మాసియా. ఒకవైపు ఇజ్రాయెల్ మరోవైపు ఇరాన్ తో పాటు అరబ్ దేశాలు, ఒకవైపు మిలిటెంట్ సంస్థలు.. మరొకవైపు అస్థిరమైన ప్రభుత్వాలు..! ఒకవైపు అమెరికా ప్రభావంతో దూకుడుగా దాడిచేసే ఇజ్రాయెల్.. మరొకవైపు అమెరికా పేరు చెబితేనే నిప్పులు కక్కే దేశాలు..! నిత్యం కక్షలు. పగలు–ప్రతీకారాలు...! ఇప్పటికే రెండున్నరేళ్లుగా ఇజ్రాయెల్–హమాస్ యుద్ధం సాగుతోంది. ఎన్ని శాంతి ఒప్పందాలు జరిగినా అవి కేవలం కాగితాల మీదనే అన్నట్లుంది. ఇలాంటి సమయంలో.. ఇరాన్ మీద దాడికి దిగాయి ఇజ్రాయెల్–అమెరికా. చాలా తెలివిగా, ఇజ్రాయెల్ చేతులతో ఇరాన్ కళ్లు పొడిచింది. ఎలాగూ ఇజ్రాయెల్ అంటే ముస్లి సమాజంలో వ్యతిరేక ఉంది కాబట్టి తన పని (ఖమేనీ హత్య)ని ఆ దేశంతోనే చేయించింది. అయితే, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చెప్పినట్లు... ఈ యుద్ధం నాలుగు లేదు ఐదు వారాలు జరిగినా అది పెద్ద విధ్వంసమే. మూడో ప్రపంచ యుద్ధమే..!



**ట్రంప్ అమెరికాకు అడ్డుందా?**

అసలే అమెరికా.. ఆపై డొనాల్డ్ ట్రంప్ అధ్యక్షుడు. ఇంకా ఆ దేశం ఏం చేసినా చెల్లుతోంది. నాలుగేళ్లుగా ఉక్రెయిన్ తో యుద్ధంలో మునిపోయిన రష్యాకు ఇప్పటికే తల బొప్పి కట్టింది. అమెరికాను ప్రతిఘటించాలంటే.. అందులో రష్యా ఉండాలి. కానీ, ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ఇక చైనా అంటే తన స్వార్థం చూసుకుంటుంది. పొరుగు దేశాల ఆక్రమణలకు దిగుతుంది కానీ.. తన మిత్ర దేశాలు యుద్ధ సంక్షోభంలో ఉంటే మాత్రం కల్పించుకోదు. అందుకే ట్రంప్ దూకుడుకు అడ్డు ఏమిటి? అనే ప్రశ్నలు వస్తున్నాయి.

**ఇది అక్కడితో ఆగదు..**


ఇజ్రాయెల్–అమెరికాలు ఇరాన్ ను ఇంతటితో వదులుతాయి అని భావించలేం. పాకిస్థాన్ తర్వాత ప్రపంచంలో అణ్వస్త్ర దేశం ఉన్న రెండో ఇస్లామిక్ దేశం కావాలన్న ఇరాన్ ప్రయత్నాలను ప్రస్తుతానికి ధ్వంసం చేసినా, ఇంకా ఇరాన్ లో తమ కీలుబొమ్మ ప్రభుత్వాన్ని నెలకొల్పేదాక అమెరికా శాంతించదు. ఇజ్రాయెల్ కూడా.. హమాస్, హెజ్బొల్లా, హూతీ తదితర మిలిటెంట్ సంస్థలకు ఇరాన్ సాయం ఆగిపోతుందని భావించాకే యుద్ధం ఆపుతుంది.

**అలాగైతేనే ముప్పే..!**

ఇరాన్ కు మద్దతుగా ముస్లిం దేశాలు, రష్యా, చైనా, ఉత్తర కొరియా రంగంలోకి దిగితే మాత్రం మూడో ప్రపంచ యుద్ధమే. అటువైపు అమెరికా, ఇజ్రాయెల్ దానికి మద్దతు పలికే దేశాలు ఇటువైపు ఇరాన్, రష్యా, ఉత్తరకొరియా, చైనాలు..! చైనా పూర్తిగా కల్పించుకోకున్నా, ఇరాన్ కు పరోక్షంగా అయినా మద్దతు ఇస్తుందనేది విదేశాంగ నిపుణుల మాట. రష్యా అయితే నేరుగానే కల్పించుకోవచ్చు. అమెరికా పాలకులకు ఎప్పటినుంచో ఉత్తర కొరియా పాలకుడు కిమ్ పై తీవ్ర విద్వేషం ఉంది. ఈ పరిణామాలు మున్ముందు తమవైపు మళ్లితే ఇబ్బందికరం అని భావించి ఉత్తర కొరియా కల్పించుకుంటే.. అది మూడో ప్రపంచ యుద్ధంగా మారినా ఆశ్చర్యం లేదు.

# 2025లో రికార్డు స్థాయిలో విదేశీ పర్యటనలు.. ఇండియన్స్ సత్తా ఏంటో చూసిన దేశాలు..

**హైదరాబాద్ పెన్ పవర్:** ఇప్పుడు ఎవరిని పలకరించినా 'సెలవులకు ఎక్కడికి వెళ్తున్నారు?' అని అడిగితే, లోకల్ టూర్ల కంటే విదేశాలపైవే చూపిస్తున్నారు. మన భారతీయుల్లో విదేశీ పర్యటనల పట్ల క్రేజ్ ఏ రేంజ్‌లో పెరిగిందో చెప్పడానికి పర్యాటక మంత్రిత్వ శాఖ విడుదల చేసిన తాజా 2025 వార్షిక నివేదిక చక్కని ఉదాహరణ. ఈ నివేదిక ప్రకారం.., గతేడాది ఏకంగా 3.27 కోట్ల మంది భారతీయులు విదేశాలకు విమానం ఎక్కారు. ఇందులో విశేషం ఏంటంటే, కేవలం సరదా కోసం, అంటే 'విశ్రాంతి' కోసమే వెళ్లిన వారి సంఖ్య కోట్లలో ఉంది.



**సరదా కోసమే 1.43 కోట్ల మంది!**

మనం సాధారణంగా విదేశాలకు వెళ్తున్నారంటే.. ఎవరో చుట్టాల ఇంటికో, లేదా ఆఫీస్ పని మీదో వెళ్తుంటారని అనుకుంటాం. కానీ, ఇప్పుడు ట్రెండ్ మారింది. 2025లో మొత్తం ప్రయాణికుల్లో దాదాపు 43.5 శాతం మంది అంటే సుమారు 1.43 కోట్ల మంది కేవలం రిలాక్స్ అవ్వడానికి, కొత్త ప్రదేశాలను చూసేందుకు మాత్రమే వెళ్లారు. 2023తో పోలిస్తే ఈ సంఖ్య గణనీయంగా పెరగడం గమనార్హం. అంటే, భారతీయులకు ఇప్పుడు తమ ఆనందం కోసం, కొత్త అనుభవాల కోసం ఖర్చు చేయడం ప్రాధాన్యతగా మారిపోయింది.చాలామందికి ఒక అనుమానం రావచ్చు.. అసలు ఈ రిలాక్స్ ట్రావెల్ అంటే ఏంటి అని? ఏమీ లేదు, ఆఫీస్ టెన్షన్లు, రోజువారీ రొటీన్ పనుల నుంచి బ్రేక్ తీసుకొని, మనసుకు నచ్చినట్టు గడపడమే రిలాక్స్ ట్రావెలింగ్.. అది ఒక అందమైన బీచ్‌లో సోమరిగా పడుకోవడం కావచ్చు, కొత్త నగరంలోని వీధుల్లో తిరుగుతూ అక్కడి వంటలను రుచి చూడడం కావచ్చు, లేదంటే కుటుంబంతో కలిసి సరదాగా గడపడం కావచ్చు. వ్యాపార పర్యటనల్లో లాగా ఇక్కడ మీటింగ్స్ ఉండవు, షెడ్యూల్స్ ఉండవు. ఎప్పుడు నిద్రలేవాలి, ఎక్కడ తినాలి అనేది మీ ఇష్టం. అందుకే మన వాళ్లు ఇలాంటి ప్రయాణాలకు ఎక్కువ మొగ్గు చూపుతున్నారు.

**ఎక్కడికి ఎక్కువగా వెళ్తున్నారు..?**


భారతీయులు ఎక్కువగా ఇష్టపడుతున్న దేశాల జాబితాను పరిశీలిస్తే.. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (ఖూజు) మొదటి స్థానంలో ఉంది. దుబాయ్ లాంటి నగరాలు మన వాళ్లకు హాట్ ఫేవరెట్. ఆ తర్వాత సౌదీ అరేబియా, థాయిలాండ్, అమెరికా, సింగపూర్ వంటి దేశాలు టాప్–5లో ఉన్నాయి. మలేషియా, వియత్నాం, శ్రీలంక వంటి దేశాలకు కూడా పర్యాటకుల తాకిడి పెరిగింది. తక్కువ ఖర్చులో విదేశీ అనుభూతిని ఇచ్చే వియత్నాం, థాయిలాండ్ లాంటి దేశాలకు ఇప్పుడు యువత క్యూ కడుతున్నారు.

**సులభమైన ప్రయాణం**

ఒకప్పుడు టికెట్లు బుక్ చేయాలన్నా, హోటళ్లు వెతకాలన్నా ట్రావెల్ ఏజెంట్ల చుట్టూ తిరగాల్సి వచ్చేది. కానీ ఇప్పుడు చేతిలో ఫోన్ ఉంటే చాలు, నిమిషాల్లో అంతా అయిపోతోంది. థ్రిల్లోఫిలియా వంటి డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లు ప్లానింగ్‌ను చాలా సులభం చేసేశాయి. కేవలం డిస్కౌంట్లు మాత్రమే కాకుండా, నాణ్యమైన సౌకర్యాలు, లోతైన అనుభవాలను ఇచ్చే టూర్ ప్యాకేజీలు కావాలని ప్రజలు కోరుకుంటున్నారు. ఇక 'బ్లీజర్' (దీశ్రీవఅంబతీవ) అనే కొత్త ట్రెండ్ కూడా మొదలైంది. అంటే ఆఫీస్ పని మీద వెళ్లినప్పుడు, ఆ పని ముగిశాక మరో రెండు మూడు రోజులు అక్కడే ఉండి సరదాగా గడిపి రావడం అన్నమాట.భారతీయుల ఆర్థిక పరిస్థితి మెరుగుపడడం, ప్రపంచాన్ని చూడాలనే ఆత్రుత పెరగడం వల్ల విదేశీ పర్యటనలు ఇప్పుడు సామాన్యులకు కూడా అందుబాటులోకి వస్తున్నాయి. లాయల్టీ ప్రోగ్రామ్‌లు, సీజనల్ ఆఫర్లను వాడుకుంటూ బడ్జెట్లోనే విదేశీ యాత్రలు పూర్తి చేసేలా మన వాళ్లు ప్లాన్ చేసుకుంటున్నారు. 2025 నివేదిక చెబుతున్న మాట ఒక్కటే.. భారతీయులు ఇప్పుడు కేవలం సంపాదించడమే కాదు, జీవితాన్ని ఆస్వాదించడం కూడా నేర్చుకున్నారు!

# వన్ వే ప్రయాణికి రూ. 9 లక్షలు.. ఆకాశం ప్రయాణం అంటే చుక్కలు చూడాల్సిందే..

**హైదరాబాద్ పెన్ పవర్:** మనలో చాలా మందికి విదేశాలకు వెళ్లాలని, ముఖ్యంగా అమెరికా సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలకో లేక చదువుకోవడానికో వెళ్లాలని కోరిక ఉంటుంది. కానీ, ఇప్పుడున్న పరిస్థితులు చూస్తుంటే విమానం ఎక్కాలంటేనే భయం వేస్తోంది. అంతర్జాతీయ ప్రయాణం ఇప్పుడు అకస్మాత్తుగా అత్యంత ఖరీదైనదిగా మారిపోయింది. హైదరాబాద్ నుంచి అమెరికాకు వెళ్లే వన్ వే టికెట్ ధర రూ. 9 లక్షలు పలుకుతోందంటే నమ్ముతారా? అవును, ఇది నిజం. ఒకప్పుడు ఈ డబ్బుతో ఒక చిన్న ఇల్లు కొనుక్కోవచ్చు లేదా ఒక మంచి కారు కొనుక్కోవచ్చు, కానీ ఇప్పుడు కేవలం ఒక పూట ప్రయాణానికి అంత చెల్లించాల్సి వస్తోంది.



**ఎందుకీ ధరలు..?**

దీనికి ప్రధాన కారణం పశ్చిమాసియాలో చెలరేగుతున్న యుద్ధం. ఇరాన్ -- ఇజ్రాయెల్ మధ్య జరుగుతున్న ఘర్షణలు ఇప్పుడు పతాక స్థాయికి చేరింది. ఎనిమిది దేశాల్లోని అమెరికా సైనిక స్థావరాలపై ఇరాన్ దాడులు చేయడం, దానికి ప్రతికారంగా అమెరికా, ఇజ్రాయెల్ దాడులు చేయడంతో గల్ఫ్ ప్రాంతం అంతా అట్టుడుకుతోంది. ముఖ్యంగా ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా ఖమేనీ మరణ వార్త తర్వాత అక్కడ పరిస్థితులు చేయి దాటిపోయాయి. దీని ప్రభావం నేరుగా విమానయాన రంగం మీద పడింది.

**మూతపడ్డ ఎయిర్ పోర్టులు..**

మన దగ్గర నుంచి అమెరికా వెళ్లే విమానాలు ఎక్కువగా దుబాయ్ లేదా అబుదాబీ మీదుగా వెళ్తుంటాయి. కానీ ఇప్పుడు అక్కడ యుద్ధ వాతావరణం ఉండడంతో ఆ విమానాశ్రయాలను మూసివేశారు. దీనివల్ల వేలాది మంది ప్రయాణికులు ఎయిర్‌పోర్టుల్లోనే చిక్కుకుపోయారు. వందలాది విమానాలు రద్దయ్యాయి. తమ టిక్కెట్లను రద్దు చేసుకుందామన్నా ఎయిర్‌లైన్ వెబ్‌సైట్లు పనిచేయడం లేదు. ఎవరిని అడగాలో, ఎవరికి ఫిర్యాదు చేయాలో, ఎక్కడికి వెళ్లాలో తెలియక ప్రయాణికులు పడుతున్న అగచాట్లు వర్ణనాతీతం. కనీసం మాట్లాడటానికి సరైన అధికారి కూడా అందుబాటులో లేని పరిస్థితి నెలకొంది.

**ప్రత్యామ్నాయ మార్గాలు..**


దుబాయ్ రూట్ మూతపడడంతో, ప్రయాణికులు ఇప్పుడు వేరే మార్గాల వైపు దృష్టిసారిస్తున్నారు. కానీ అక్కడ కూడా పరిస్థితి ఏమంత బాగాలేదు. డిమాండ్ పెరగడంతో విమానయాన సంస్థలు ధరలను రెండు నుంచి నాలుగు రెట్లు పెంచేశాయి. ఉదాహరణకు, హైదరాబాద్ నుంచి శాన్ ఫ్రాన్సిస్కోకు బ్రిటిష్ ఎయిర్‌వేస్‌లో బిజినెస్ క్లాస్ టికెట్ ధర రూ. 7 లక్షల వరకు ఉంది. ఇక సింగపూర్ ఎయిర్‌లైన్స్ విషయానికి వస్తే, ఎకానమీ క్లాస్ ధరలే రూ. 3 లక్షలు పలుకుతున్నాయి. అదే బిజినెస్ క్లాస్ అయితే రూ. 9 లక్షల వరకు కోట్ చేస్తున్నారు. అంటే ఒక మధ్యతరగతి కుటుంబం జీవితాంతం దాచుకున్న సొమ్మును కేవలం ఒక టికెట్ కోసం ఖర్చు చేయాల్సి వస్తోందన్నమాట.

**భవిష్యత్తు ఏంటి?**

ప్రపంచ దేశాల మధ్య వచ్చే గొడవలు సామాన్యుల జీవితాలను ఎంత త్వరగా చిన్నాభిన్నం చేస్తాయో ఈ సంక్షోభం నిరూపించింది. కేవలం గల్ఫ్ దేశాల మీదుగా ప్రయాణం నిలిచిపోవడంతోనే విమానయాన నెట్‌వర్క్ అంతా కుప్పకూలింది. పరిస్థితులు ఎప్పుడు చక్కబడతాయో ఎవరికీ తెలియదు. అంతవరకు విదేశాలకు వెళ్లాలనుకునే వారు అధిక ధరలు, పొడవైన ప్రయాణ మార్గాలు మరియు అనేక అసౌకర్యాలకు సిద్ధంగా ఉండక తప్పదు.

ప్రస్తుతానికి అత్యవసరమైతే తప్ప అంతర్జాతీయ ప్రయాణాలు పెట్టుకోకపోవడమే మంచిదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. యుద్ధం ఎప్పుడు ఆగుతుందో, విమాన ఛార్జీలు ఎప్పుడు తగ్గుతాయో వేచి చూడాలి. మన దేశం నుంచి వెళ్లే విద్యార్థులు, ఉద్యోగులు ఈ భారాన్ని ఎలా మోస్తారో అని ఆలోచిస్తేనే బాధగా ఉంది. ప్రపంచంలో శాంతి నెలకొంటేనే సామాన్యుడికి ఈ ఆకాశప్రయాణం మళ్ళీ అందుబాటులోకి వస్తుంది.

## బాత్ రూమ్‌లో ఈ వస్తువులు ఉంటే.. దురదృష్టం వెంటాడినట్టే!



వాస్తు నియమాలను అనుసరించి ఇల్లు కట్టుకోవడం వల్ల చాలా ప్రయోజనాలు ఉంటాయి. వీటి వల్ల మీకు అదృష్టం వెతుక్కుంటు మరీ వస్తుందని వాస్తు శాస్త్ర నిపుణులు చెబుతూ ఉంటారు. అంతే కొన్ని ప్రదేశాల్లో కొన్ని వస్తువులను కూడా పెట్టకూడదంటారు. దాని వల్ల ఇంట్లో నెగిటివ్ ఎనర్జీ పెరుగుతుంది. దీని వల్ల అనేక ఇబ్బందలను ఎదుర్కోనాల్సి వస్తుంది. దీని వల్ల కుటుంబంలో ఆర్థిక పరిస్థితులతో ఇబ్బంది పడటం, గొడవలు, తగాదాలు వంటివి నెలకొంటి. ఇవే వాస్తు నియమాలు బాత్ రూమ్ లో కూడా వర్తిస్తాయి. బాత్ రూమ్ లో ఉండే వస్తువుల విషయంలో సరైన జాగ్రత్తలు పాటించాలి. వీటి వల్ల కూడా నెగిటివ్, పాజిటివ్ ఎనర్జీల ఎఫెక్ట్ పడతాయి. అసలు బాత్ రూమ్ లో ఎలాంటి వస్తువులు ఉండాలి? ఎలాంటి వస్తువులు ఉండకూడదో ఇప్పుడు తెలుసుకుందాం.అద్దాలు:బాత్ రూమ్ లో పెట్టే అద్దాల విషయంలో సరైన జాగ్రత్తలు తీసుకోవాలి. చాలా మంది బాత్ రూమ్ లో అద్దాలను పెట్టు కుంటారు. వీటి వల్ల నష్టాలే ఎక్కువగా ఉంటాయని నిపుణులు అంటున్నారు. అలాగే బాత్ రూమ్ లో ఉండే అద్దం ఎప్పుడూ విరిగి పోయి ఉండకూడదు. ఒక వేళ ఉంటే వెంటనే దాన్ని పారేయాలి. లేకుంటే ప్రతి కూలతలను సృష్టిస్తాయి.బకెట్లు: బాత్ రూమ్ లో ఉండే బకెట్లు ఎప్పుడూ ఖాళీగా ఉండకూదట. ఒక వేళ ఖాళీ బకెట్ ఉంటే దాన్ని బోర్లించి పెట్టాలి. బాత్ రూమ్ లో ఖాళీ బకెట్ ఉంటే.. అది ఇంట్లో ఉండే డబ్బులను ఖాళీ చేస్తుంది. అలాగే విరిగి పోయిన, పగిలిన బకెట్లు కూడా ఉండకుండా చూసుకోండి.మొక్కలు- చిత్రాలు: చాలా మంది ఇప్పుడు బాత్ రూమ్ లో మొక్కలను కూడా పెడుతున్నారు. బాత్ రూమ్ లో మొక్కలను పెట్టడం అసలు ఏమాత్రం మంచిది కాదని వాస్తు శాస్త్ర నిపుణులు అంటున్నారు. అలాగే ఎండి పోయిన మొక్కలు ఉంటే వెంటనే వాటిని తొలగించాలి. అదే విధంగా డెకరేషన్ కోసం బాత్ రూమ్ లో చిత్రాలను కూడా పెడుతూ ఉంటారు. ఇవి చినిగి పోయి ఉంటే వాటిని పారేయాలి.ట్యాప్ లీక్ అవ్వకూడదు: బాత్ రూమ్ లో ఎప్పుడూ ట్యాప్ లీక్ కాకుండా చూసుకోండి. ఇలా లీక్ అవ్వడం వల్ల ప్రతికూల శక్తిని వ్యాపింప చేస్తుంది. అంతే కాకుండా ఆర్థిక పరిస్థిపై చెడు ప్రభావం పడుతుంది.

## స్టాక్ మార్కెట్లో రక్తపాతం.. భారీ నష్టాల్లోకి జారుకున్న సూచీలు.. ఆ స్టాక్స్ లాభాల్లోకి..




దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం తమ ప్రయాణాన్ని నష్టాలతో స్టార్ట్ చేశాయి. ఇరాన్ ఇజ్రాయెల్ మధ్య యుద్ధం ఇప్పుడు అనేక మధ్యప్రాశ్చ దేశాలతో పాటు యూరోపియన్ దేశాలకు కూడా విస్తరించటంతో ఇన్వెస్టర్లలో భయాలు భారీగా పెరిగిపోయాయి. దీంతో మధ్యాహ్నం సమయానికి కీలక సూచీలు ఊహించని స్థాయిలకు దిగజారాయి. మధ్యాహ్నం 12.25 గంటల సమయంలో బెంచ్ మార్క్ సూచీ 1450 పాయింట్ల నష్టంతో కొనసాగుతుండగా.. మరో కీలక సూచీ నిఫ్టీ 443 పాయింట్లు కోల్పోయింది. ఇంట్రాడేలో సెన్సెక్స్ సూచీ 1500 పాయింట్లకు పైగా కోల్పోయి ముందుకు సాగుతోంది. ఇక బ్యాంక్ నిఫ్టీ , నిఫ్టీ మిడ్ క్యాప్ సూచీలు కూడా భారీగానే నష్టాలతో ముందుకు సాగుతున్నాయి. యుద్ధం వేళ మార్కెట్లో ట్రావెల్ అండ్ టూరిజం పరిశ్రమకు చెందిన షేర్లు ఒక్కసారిగా కుప్పకూలాయి. ఇండిగో, ఇక్సిగో, ఆర్వీఎన్ఎల్, విమానయానం, హోటల్స్, టూరిజం కంపెనీల షేర్లు పతనం అయ్యాయి. ఈ క్రమంలో మార్కెట్లో ఎల్ అండ్ టి, ఇండిగో, అదానీ పోర్ట్స్ కంపెనీల షేర్లు ఇంట్రాడేలో భారీ నష్టాలను నమోదు చేశాయి. ఇదే క్రమంలో డిఫెన్స్ రంగానికి చెందిన కంపెనీల షేర్లు ఒక్కసారిగా లాభపడ్డాయి. నిఫ్టీ డిఫెన్స్ 2 శాతం మేర లాభపడింది. భెల్, పరాస్ డిఫెన్స్ సహా మరిన్ని కంపెనీలు లాభపడ్డాయి.

## సౌదీ పెట్రోల్ బావులపై ఇరాన్ బాంబుల వర్షం.. సౌదీ అరాంకో రిఫైనరీ మూసివేత!




పశ్చిమాసియాలో యుద్ధ జ్వాలలు ఇప్పుడు ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ఊపిరిపోసే 'చమురు' క్షేత్రాలకు పాకాయి. ఇరాన్ తన సుప్రీం లీడర్ మృతికి ప్రతీకారంగా సౌదీ అరేబియా ఆర్థిక మూలాలను దెబ్బతీసే పనిలో పడింది. ప్రపంచంలోనే అతిపెద్ద ఆయిల్ రిఫైనరీలలో ఒకటిగా పేరుగాంచిన సౌదీ అరంకోకు చెందిన రాస్ తనురా(ఘం ఖుఅబతీఖు) పై ఇరాన్ డ్రోన్ల వర్షం కురిపించడం సంచలనంగా మారింది.

సౌదీ అరేబియాకు వెన్నెముక అయిన సౌదీ అరాంకో రిఫైనరీపై ఇరాన్ తన అత్యంత ప్రమాదకరమైన షాహెద్-136 డ్రోన్లతో విరుచుకుపడింది. సోమవారం తెల్లవారుజామున జరిగిన ఈ దాడిలో రాస్ తనురా రిఫైనరీలో భారీ మంటలు చెలరేగాయి. ఇది కేవలం సైనిక దాడి మాత్రమే కాదు, ప్రపంచ చమురు సరఫరాను స్తంభింపజేసి, ప్రపంచ దేశాలను ఆర్థిక సంక్షోభంలోకి నెట్టే అంశంగా నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ దాడితో భద్రతా కారణాల దృష్ట్యా సౌదీ అరేబియా తన రాస్ తనురా రిఫైనరీని తాత్కాలికంగా మూసివేసింది. ప్రపంచ మార్కెట్లకు ప్రతిరోజూ లక్షల బ్యారెళ్ల చమురును సరఫరా చేసే ఈ కేంద్రం మూతపడటం అంటే.. గ్లోబల్ ఎకానమీపై పిడుగు పడ్డట్లేనని చెప్పుకోవాలి. దీంతో క్రూడ్ ఆయిల్ మార్కెట్‌ను గత కొన్ని దశాబ్దాలలో ఎన్నడూ లేనంత పెద్ద సంక్షోభంలోకి నెట్టివేసింది. ప్రస్తుతం మంటలు అదుపులోకి వచ్చినప్పటికీ, జరిగిన నష్టం, భవిష్యత్తులో జరిగే దాడుల భయంతో మార్కెట్లు వణికిపోతున్నాయి.ఇజ్రాయెల్, అమెరికా దాడులకు ప్రతిస్పందనగా ఇరాన్ ఇప్పుడు గల్ఫ్ దేశాల ఇంధన వనరులను లక్ష్యంగా చేసుకుంటోంది. సౌదీపై జరిగిన ఈ దాడి వల్ల ముడిచమురు ధరలు ఆకాశాన్ని తాకే ప్రమాదం ఉంది. భారత్ వంటి దేశాలకు ఇది పెద్ద దెబ్బ, ఎందుకంటే మనం ఇంధన అవసరాల కోసం క్రూడ్ గల్ఫ్ దేశాలపైనే ఎక్కువగా ఆధారపడుతుంటాం కాబట్టి.తాజా దాడి తర్వాత సౌదీ అధికారులు ప్రస్తుతం పరిస్థితిని సమీక్షిస్తున్నారు. రక్షణ వ్యవస్థలను మరింత బలోపేతం చేయడంతో పాటు, అమెరికా సహకారంతో ప్రతిదాడికి సిద్ధమవుతున్నారు. ఒకవేళ ఈ దాడులు ఇలాగే కొనసాగితే.. అది కేవలం పశ్చిమాసియాకే పరిమితం కాకుండా ప్రపంచ ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేసే ప్రమాదం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు.

# కొత్త ట్రెండ్: ల్యాబ్ గోల్డ్ అంటే ఏమిటి? తవ్వితీసిన బంగారానికి దీనికి మధ్య తేడా ఏంటంటే..?



ల్యాబ్-గ్రోన్ డైమండ్స్ గురించి మనం విన్నాం. కానీ ఇప్పుడు ల్యాబ్-గ్రోన్ గోల్డ్ వంతు వచ్చింది. ఆభరణాల మార్కెట్‌లో ఈ సరికొత్త ఆవిష్కరణ ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. అసలు ల్యాబ్‌లో బంగారం తయారవ్వడం ఏమిటి? అది నిజమైన బంగారమేనా? దాని భవిష్యత్తు ఎలా ఉంటుంది? వంటి ఆసక్తికర విషయాలు ఇప్పుడు తెలుసుకుందాం..

**ల్యాబ్-గ్రోన్ గోల్డ్ అంటే ఏమిటి?**

సాధారణంగా బంగారాన్ని గనుల నుండి వెలికితీస్తారు. కానీ ల్యాబ్-గ్రోన్ గోల్డ్ అనేది అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో ప్రయోగశాలల్లో తయారవుతుంది. ఇది కేవలం బంగారు పూత లేదా నకిలీ బంగారం కాదు. రసాయనిక, భౌతిక ధర్మాల పరంగా ఇది గనుల నుండి తీసిన బంగారంతో 100% సమానం. ఈజీగా అర్థమయ్యేలా చెప్పాలంటే.. భూమి పొరల్లో వేల ఏళ్లలో జరిగే ప్రక్రియను శాస్త్రవేత్తలు నియంత్రిత వాతావరణంలో తక్కువ సమయంలోనే పూర్తి చేస్తారన్నమాట.

ప్రస్తుతం ల్యాబ్ గోల్డ్ తయారీలో రెండు పద్ధతులు ప్రధానంగా ఉన్నాయి:

అణు స్థాయి సాంకేతికత: బంగారం పరమాణువులను ఉపయోగించి నేరుగా బంగారాన్ని నిర్మించడం. ఇది చాలా ఖరీదైన ప్రక్రియ.రీసైకిల్డ్ గోల్డ్ పద్ధతి: పాత బంగారాన్ని సేకరించి, ల్యాబ్‌లో అత్యున్నత స్థాయి శుద్ధి ప్రక్రియ ద్వారా అతి స్వచ్ఛమైన బంగారంగా మార్చడం. ప్రస్తుతం ఈ సాంకేతికత ఇంకా అభివృద్ధి దశలోనే ఉంది.

సాంప్రదాయక మైనింగ్ వల్ల పర్యావరణానికి భారీ నష్టం జరుగుతుంది. ఒక చిన్న ఉంగరానికి సరిపడా బంగారం తీయడానికి టన్నుల కొద్దీ భూమిని తవ్వాలి. అలాగే పాదరసం, సైనేడ్ వంటి ప్రమాదకర రసాయనాలను వాడాలి. ల్యాబ్-గ్రోన్ గోల్డ్ ఈ సమస్యలకు పరిష్కారం చూపుతుంది. తక్కువ నీరు, తక్కువ భూమిని వాడి పర్యావరణానికి హాని లేకుండా దీనిని తయారు చేయవచ్చు. నైతిక విలువలకు ప్రాధాన్యత ఇచ్చే నేటి యువతకు ఇది మంచి ప్రత్యామ్నాయం అని చెప్పుకోవచ్చు.చాలామంది ల్యాబ్ గోల్డ్ అంటే తక్కువ ధర ఉంటుందని భావిస్తారు. కానీ ప్రస్తుతం దీని తయారీకి వాడే హై-టెక్ టెక్నాలజీ, పరికరాల వల్ల దీని ధర మైనింగ్ బంగారంతో దాదాపు సమానంగానే ఉందట. భవిష్యత్తులో ఉత్పత్తి పెరిగితే ధరలు తగ్గే అవకాశం ఉంది. ఇక రీసేల్ విషయానికి వస్తే.. దీని స్వచ్ఛత మైనింగ్ బంగారంతో సమానంగా ఉంటే, మార్కెట్ ధర ప్రకారం దీనికి కూడా అదే విలువ లభిస్తుంది. అయితే ప్రజల్లో పూర్తిస్థాయి అవగాహన రావడానికి కొంత సమయం పట్టవచ్చు.

దేశంలో బంగారం అంటే ప్రజలకు కేవలం ఒక లోహం కాదు. అది ఒక సెంటిమెంట్. పెళ్లిళ్లు, పండుగలు, పూజల్లో సహజసిద్ధమైన బంగారానికే ప్రాధాన్యత ఇస్తారు. ల్యాబ్-గ్రోన్ గోల్డ్ ఎంత స్వచ్ఛమైనదైనా.. వేల ఏళ్ల నాటి నమ్మకాన్ని, సెంటిమెంట్‌ను గెలుచుకోవడం ఈ కొత్త టెక్నాలజీకి అతిపెద్ద సవాల్. సంప్రదాయాన్ని గౌరవిస్తూనే ఆధునికతను అంగీకరించే వారు దీని వైపు మొగ్గు చూపే అవకాశం ఉంది. రానున్న రోజుల్లో ల్యాబ్-గ్రోన్ గోల్డ్ అనేది మైనింగ్ బంగారాన్ని పూర్తిగా భర్తీ చేయకపోవచ్చు. కానీ ఇది ఒక కొత్త అధ్యాయానికి నాందిగా చెప్పుకోవచ్చు. నాణ్యతలో స్థిరత్వం, పర్యావరణ స్పృహ, నూతన డిజైన్లకు ఇది వేదికగా మారుతోంది. రాబోయే కాలంలో ఇది కేవలం పెట్టుబడిగా మాత్రమే కాకుండా, బాధ్యతాయుతమైన ఫ్యాషన్ ఐకాన్‌గా మారే అవకాశం ఉందని నిపుణులు అంటున్నారు. అయితే దీనిని భారతీయులు ఎంత వరకూ స్వీకరిస్తారు అనేది వేచి చూడాల్సిన ప్రశ్న అనే చెప్పుకోవాలి.

# యుద్ధం వేళ భారీగా తగ్గిన గోల్డ్.. కేజీకి రూ.35వేలు పెరిగిన వెండి.. హైదరాబాద్ రేట్లివే..



ఇరాన్ ఇజ్రాయెల్ యుద్ధం వేళ విలువైన లోహాలు అనూహ్యంగా స్పందిస్తున్నాయి. ఈ క్రమంలో అందరినీ ఆశ్చర్య పరుస్తున్న విషయం గోల్డ్ రేట్ల పతనమే. వాస్తవానికి రేట్లు భారీగా పెరుగుతాయ్ అని కొనుగోలుదారులు బయటపడుతున్న వేళ తగ్గుదల ఊరటను కలిగిస్తోంది. ఇదే క్రమంలో వెండి మాత్రం దూసుకుపోతోంది. షాపింగ్ చేయాలని అనుకుంటున్న వ్యక్తులు ముందుగా తమ ప్రాంతంలో తగ్గిన రిటైల్ రేట్లను గమనించటం మంచిది.

మార్చి 2న బంగారం రేట్లు భారీగా తగ్గి ఊరటను కలిగిస్తున్నాయి. దీంతో మార్చి 1 కంటే గ్రాముకు 24 క్యారెట్ల బంగారం రేటు గ్రాముకు రూ.329 తగ్గింది. దీంతో హైదరాబాద్, వరంగల్, నిజాంబాద్, ఖమ్మం, విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, కడప నగరాల్లో స్వచ్ఛమైన బంగారం రేటు రూ.16వేల 980గా కొనసాగుతోంది. ఈ నగరాల్లో 22 క్యారెట్ల బంగారం రేటు గ్రాముకు రూ.15వేల 565గా తెలుగు రాష్ట్రాల్లోని నగరాల్లో కొనసాగుతోంది. ఇక వెండి విషయానికి వస్తే మార్చి 2, 2026న రేటు కేజీకి రూ.35వేలు పెరిగింది దేశవ్యాప్తంగా. రెండు తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాలైన హైదరాబాద్, వరంగల్, నిజాంబాద్, ఖమ్మం, విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, కడపలో కేజీ స్వచ్ఛమైన వెండి రేటు రూ.3లక్షల 15వేలకు చేరుకుంది. అంటే గ్రాము ధర రూ.315 వద్ద ఉంది.

# ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధంతో కుప్పకూలిన స్టాక్ మార్కెట్.. నిపుణుల సూచన ఇదే



శనివారం ఇరాన్ పై అమెరికా, ఇజ్రాయెల్ స్టార్ట్ చేసిన యుద్ధం తీవ్రరూపం దాల్చుతోంది. ఇరాన్ అనేక మిడిల్ ఈస్ట్ దేశాల్లోని యూఎస్ మిలిటరీ స్థావరాలపై దాడులు స్టార్ట్ చేయటంతో పరిస్థితులు దిగజారుతున్నాయి. ఈ ప్రభావం సోమవారం భారత స్టాక్ మార్కెట్లపై భారీగా పడింది. మార్కెట్లు స్టార్ట్ అయిన కొద్దిసేపట్లోనే బెంచ్ మార్క్ సూచీ సెన్సెక్స్ 1200 పాయింట్లకు పైగా నష్టాల్లోకి జారుకుంది.

ఉదయం 9.48 గంటల సమయంలో మార్కెట్ సూచీ సెన్సెక్స్ 735 పాయింట్ల నష్టంతో కొనసాగుతుండగా.. మరో కీలక సూచీ నిఫ్టీ 225 పాయింట్లను కోల్పోయింది. ఇదే క్రమంలో బ్యాంక్ నిఫ్టీ సూచీ 475 పాయింట్లు, నిఫ్టీ మిడ్ క్యాప్ సూచీ 390 పాయింట్ల నష్టంతో ట్రేడింగ్ కొనసాగిస్తోంది. ఇదే క్రమంలో ఇరాన్ హర్మూజ్ జలసంధిని క్లోజ్ చేయటంతో ఒక్కసారిగా క్రూడ్ ఆయిల్ రేట్లు అంతర్జాతీయ మార్కెట్లలో పెరగటం స్టార్ట్ చేశాయి. పశ్చిమాసియాలో ముదిరిన యుద్ధ మేఘాలు ప్రపంచ మార్కెట్లను కుదిపేస్తున్నాయి. ప్రధానంగా ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ మృతికి దారితీసిన ఇజ్రాయెల్, అమెరికా వైమానిక దాడుల ప్రభావం భారత స్టాక్ మార్కెట్లపై తీవ్రంగా పడింది. యుద్ధం నేపథ్యంలో ఇన్వెస్టర్లను ఏఏ అంశాలు కలవరానికి గురిచేస్తున్నాయో ఇప్పుడు తెలుసుకుందాం..

**1. క్రూడాయిల్ ధరల పెరుగుదల:**

ఇరాన్ ప్రతీకార చర్యలతో పాటు, ప్రపంచ చమురు రవాణాలో కీలకమైన హోర్ముజ్ జలసంధిని మూసివేస్తున్నట్లు టెహ్రాన్ ప్రకటించడం మార్కెట్లను భయపెట్టింది. దీనివల్ల బ్రెంట్ క్రూడ్ ధర ఒక్కసారిగా 7% పెరిగి, 14 నెలల గరిష్ట స్థాయి 82.40 డాలర్లకు చేరింది. ఫలితంగా పెయింట్, టైర్, ఏవియేషన్, కెమికల్ రంగాల షేర్లు భారీగా నష్టపోయాయి.

**2. రూపాయి విలువ పతనం - FIIల అమ్మకాలు:**

మధ్యప్రాచ్యంలో నెలకొన్న అనిశ్చితి వల్ల రూపాయి విలువ డాలర్‌తో పోలిస్తే బలహీనపడింది. దీనివల్ల విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు తమ పెట్టుబడులను వెనక్కి తీసుకుంటున్నారు. ఫిబ్రవరి 27న ఒక్కరోజే వీరు సుమారు రూ.7వేల 536.4 కోట్ల విలువైన షేర్లను విక్రయించడం మార్కెట్‌పై ఒత్తిడి పెంచింది.

**3. పెరుగుతున్న అస్థిరత:**

మార్కెట్ భయాన్ని సూచించే India VIX సూచీ ఒక్కసారిగా 15% పెరిగి 15.78 వద్ద ట్రేడ్ అవుతోంది. యుద్ధం కారణంగా మున్ముందు ఏం జరుగుతుందో అన్న ఆందోళన మదుపరులలో స్పష్టంగా కనిపిస్తోంది.

భయాందోళనతో షేర్లను విక్రయించడం సరైన పద్ధతి కాదన్నారు జియోజిత్ ఇన్వెస్ట్‌మెంట్ స్ట్రాటజిస్ట్ వి.కె. విజయకుమార్. గతంలో కోవిడ్, రష్యా-ఉక్రెయిన్ యుద్ధం సమయంలోనూ మార్కెట్లు ఇలాగే స్పందించినా, ఆరు నెలల తర్వాత మళ్లీ కోలుకున్నాయి. కాబట్టి పెట్టుబడిదారులు జాగ్రత్తగా ఉంటూ.. బ్యాంకింగ్, ఆటోమొబైల్ వంటి నాణ్యమైన షేర్లను కొనుగోలు చేయడానికి ఈ మార్కెట్ పతనాన్ని అవకాశంగా మార్చుకోవాలని సూచించారు.

# కొన్ని జాగ్రత్తలు పాటిస్తే...

ప్రస్తుతం మన జీవితంలో కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు భాగంగా మారిపోయాయి. కొందరి ఉద్యోగాలు అయితే వీటి మీదే ఆధారపడి ఉంటున్నాయి. తరచూ అంతర్జాలంతో గడిపేవారు గంటల తరబడి పీసీల ముందు కూర్చుంటున్నారు. ఇలా ఎక్కువసేపు డిజిటల్ పరికరాల తెరను చూస్తే కండ్లు ఒత్తిడికి గురై అలసిపోవచ్చని కంటి నిపుణులు చెబుతున్నారు. కొన్నిసార్లు చూపు కూడా దెబ్బతినొచ్చని హెచ్చరిస్తున్నారు. కాబట్టి తప్పనిసరిగా కంప్యూటర్‌తో పనిచేసేవారు కొన్ని జాగ్రత్తలు పాటించటం మంచిదని సూచిస్తున్నారు.-మరీ ప్రకాశవంతమైన లైట్ల వెలుగులో పనిచేస్తే కష్టపడి చూడాల్సి ఉంటుంది. ఫలితంగా కండ్లు త్వరగా, బాగా అలసిపోతాయి. కాబట్టి తగినంత వెలుతురు ఉండేలా చూసుకోవాలి.-డిస్‌ప్లే మీద యాంటీగ్లేర్ స్క్రీన్ బిగిస్తే కండ్లకు హాయిగా ఉంటుంది. ఒకవేళ కళ్లద్దాలు ధరిస్తే యాంటీ రిఫ్లెక్టింగ్ పూత ఉన్నవి తీసుకోవాలి. ఇది తెర నుంచి ప్రతిఫలించే కాంతిని కళ్లకు అంతగా చేరకుండా అడ్డుకుంటుంది.-ఒకవైపు ప్రింట్ తీసుకున్న పేజీని, మరోవైపు కంప్యూటర్ తెరను మార్చి మార్చి చూడాల్సి వస్తే తెర పక్కన స్టాండ్‌కు పేజీని అమర్చుకోవాలి. స్టాండు మీద తగినంత వెలుతురు పడేలా చూసుకోవాలి. మీరు డెస్క్ ల్యాంప్‌ను వాడుతున్నట్టయితే దీన్నుంచి వచ్చే కాంతి.. కండ్ల మీద, కంప్యూటర్ తెర మీద గానీ పడకుండా చూసుకోవాలి.-చేసే పని నుంచి తరచూ విరామం తీసుకోవాలి. ప్రతి గంటకూ కనీసం 10 నిమిషాల సేపు విశ్రాంతి తీసుకుంటే మంచిదని నిపుణులు అంటున్నారు. కంప్యూటర్ మీద పనిచేయటం వల్ల తలెత్తే మెడ, వీపు, భుజాల నొప్పి తగ్గటానికిది సాయపడడమే కాకుండా ఇది కండ్ల మీద ఒత్తిడి తగ్గిస్తుంది.-డిస్‌ప్లే సెటింగ్స్ మార్చుకోవడం వల్ల కండ్లకు ప్రయోజనం ఉంటుంది. చుట్టుపక్కల పరిస్థితులకు అనుగుణంగా డిస్‌ప్లే బ్రైట్‌నెస్ మార్చుకోవాలి. వెబ్ పేజీలో తెల్ల భాగాన్ని చూసినప్పుడు కాంతి వస్తున్నట్టు అనిపిస్తే చాలా బ్రైట్‌గా ఉందని.. మసకగా, బూడిద రంగులో కనిపిస్తే డార్క్‌గా ఉందని అర్థం చేసుకోవాలి. టెక్స్ట్‌సైజు, కాంట్రాస్ట్‌నూ సౌకర్యవంతంగా ఉండేలా అడ్జస్ట్ చేసుకోవాలి.-దూరం వస్తువులను 10-15 సెకండ్ల పాటు చూసి, వెంటనే దగ్గర వస్తువుల మీద 10-15 సెకండ్ల సేపు దృష్టి పెట్టాలి. ఇలా పది సార్లు చేస్తే.. తదేకంగా స్క్రీన్‌ను చూసినప్పుడు బిగుసుకున్న కండరాలు వదులవుతాయి.-తరచూ కంటి రెప్పలను ఆడిస్తూ ఉండాలి. ఇలా చేయడం వల్ల కండ్లు పొడి బారకుండా, చికాకు పడకుండా ఉంటాయి. ఒకవేళ కండ్లు తడారితే డాక్టర్‌ను సంప్రదించాలి. కంప్యూటర్ తెరకూ కండ్లకు మధ్య 20 నుంచి 24 అంగుళాల దూరం ఉండేలా చూసుకోవాలి. తెర మధ్య భాగం కండ్లకు సుమారు 10 నుంచి 15 డిగ్రీల దిగువన ఉండేలా కూర్చోవాలి. ఫలితంగా తల, మెడ మరీ కిందికి లేదా పైకి లేకుండా చూసుకోవచ్చు. కండ్ల మీద అతిగా భారం పడకుండా కాపాడుకోవచ్చు.



# పిల్లల బాధ్యత ఎవరిది?



భార్యా భర్త ఇద్దరూ కలిసి జీవించినంత కాలం పిల్లల బాధ్యత తల్లిదండ్రులిద్దరికీ ఉంటుంది. కానీ పరిస్థితులు అనుకూలించకపోయినా, భర్త వేరే సంబంధాలు పెట్టుకొని కుటుంబాన్ని పట్టించుకోకపోయినా, వదిలేసి వెళ్లిపోయినా, విడాకులు తీసుకున్నా పిల్లల్ని చూసుకునే బాధ్యత తల్లిపైనే ఉంటుంది. ఎన్ని కష్టాలు వచ్చినా తల్లి తన బిడ్డలను కంటికి రెప్పలా కాపాడుకుంటుంది. అలాంటి కథనం గురించే ఈ వారం ఐద్వా అదాలత్ (ఐలమ్మ ట్రస్ట్)లో తెలుసుకుందాం...శృతికి దాదాపు 36 ఏండ్లు ఉంటాయి. ఆమెకు మనీష్‌తో పెండ్లి జరిగి 20 ఏండ్లు అవుతుంది. ముగ్గురు పిల్లలున్నారు. బాబు పదో తరగతి, ఒక పాప ఎనిమిది, మరో పాప ఆరో తరగతి చదువుతున్నారు. శృతి ప్రభుత్వ ఆఫీసులో కాంట్రాక్ట్ 'మీ అమ్మ నా ఇంట్లో ఎందుకు ఉండాలి' అని గొడవ పెట్టుకునేవాడు. దాంతో ఆమె రాకుండా ఆగిపోయింది. మనీష్ ప్రవర్తనపై గతంలో నాలుగైదు సార్లు పెద్దల సమక్షంలో పంచాయితీ పెట్టారు. కానీ అతనిలో ఎలాంటి మార్పూ లేదు.

ఇక మనీష్ వాళ్ల అమ్మను పిలిపించి 'అత్తమ్మ.. మనీష్ ఎలాగో ఉద్యోగానికి సరిగ్గా వెళ్లడం లేదు. నేను ఉద్యోగానికి వెళుతుంటే పిల్లల్ని పట్టించుకోలేకపోతున్నాను. పిల్లలు ఏమైపోతారో అని భయంగా ఉంది. మీ అబ్బాయి ఉద్యోగం చేయకపోయినా పర్లేదు. కనీసం పిల్లలను అయినా చూసుకుంటే బాగుంటుంది. కానీ ఆయన చెప్పాపెట్టకుండా వారం పది రోజులు ఇల్లు వదిలి ఎక్కడికో వెళ్లిపోతున్నాడు. నేను అడిగితే 'నా ఇష్టం నేను ఎక్కడ ఉండాలనుకుంటే అక్కడ ఉంటాను. నువ్వెవరు నన్ను అడగటానికి' అంటున్నాడు. మీరైనా పిల్లల్ని చూసుకుంటే నేను ఉద్యోగం చేసుకుంటాను' అంది. అప్పటి నుండి ఆమె పిల్లల్ని చూసుకుంటుంటే శృతి ఉద్యోగానికి వెళుతుంది.

శృతి ఉద్యోగం షిఫ్టులుగా ఉంటుంది. రాత్రి షిఫ్టుల్లో వెళ్లడం, రావడం ఇబ్బందిగా ఉండేది. దాంతో వాళ్ల ఆఫీసుకు దగ్గరలో ఇల్లు తీసుకున్నారు. పిల్లలు కూడా పెద్దవాళ్లయ్యారు. శృతి ఉదయాన్నే లేచి వంట చేసి ఆఫీసుకు వెళ్లేది. వచ్చిన తర్వాత మిగతా పని చేసుకునేది. మనీష్ మాత్రం ఇంట్లో సరిగ్గా ఉండేవాడు కాదు. పైగా శృతికి ఎవరితోనే సంబంధం ఉందని అనుమానించి కొట్టేవాడు. ఇలా చాలా సార్లు జరిగింది. తల్లి కూడా అతన్ని చాలా సార్లు తిట్టింది. దాంతో తల్లిని కూడా ఇంట్లో నుండి గెంటేశాడు. శృతినే బతిమలాడుకొని ఆమెను తిరిగి పిలిపించుకుంది. ప్రస్తుతం చిన్న బాబు ఐదో తరగతి చదువుతున్నాడు. పిల్లలు భయపడి 'నాన్న మనకు వద్దు' అంటూ ఏడుస్తున్నారు. మనీష్ ఏమో ఒక ట్రాన్స్ జెండర్‌తో కలిసి వేరే ఉంటున్నాడు. ఇలాంటి పరిస్థితుల్లో ఆమె సహాయం కోసం ఐద్వా లీగల్ సెల్‌కు వచ్చింది.మేము మనీష్‌ను వాళ్ల అమ్మను పిలిచి మాట్లాడితే 'నేను తప్పు చేశాను. నా కొడుక్కు ఇచ్చి పెండ్లి చేసి ఆ అమ్మాయి జీవితం నాశనం చేశాను. అందుకే నేను ఆమెకే సపోర్ట్ చేస్తున్నాను. మనీష్ బాధ్యత లేకుండా తిరుగుతున్నాడు. నేను శృతితో ఉండి పిల్లల్ని చూసుకుంటాను. మనీష్ గురించి అయితే నాకు తెలియదు. అతను మారతాడనే నమ్మకం కూడా నాకు లేదు. మీరే ఏదో ఒకటి చేయండి. ఎంతైనా తల్లిని కదా.. నా కొడుకూ కోడలు సంతోషంగా ఉండాలనే ఉంది' అన్నది. మనీష్ మాట్లాడుతూ శృతి వేరే వాళ్లతో సంబంధం పెట్టుకుంది. అందుకే నేను వాళ్లందరినీ వదిలి పెట్టి వెళ్లిపోయాను. ఆమె నన్ను కనీసం ఓ మనిషిగా కూడా చూడడం లేదు. చివరకు పిల్లలు కూడా నన్ను తిడుతున్నారు. అలాంటి ఇంట్లో నేను ఎలా ఉంటాను? ఇక నేను ఆమెతో కలిసి ఉండలేను' అన్నాడు.శృతి మాట్లాడుతూ 'నాకు వేరే వాళ్లతో సంబంధం ఉంటే భర్త కావాలని, అతనిలో మార్పు రావాలని ఎందుకు వస్తాను? అత్తమ్మ నా దగ్గర దాదాపు పదేండ్ల నుండి ఉంటుంది. ఆమెకు నేనేంటో తెలుసు. కాబట్టే నాకు సపోర్ట్ చేస్తుంది. కుటుంబాన్ని చూసుకోవడం చేతగాక ఇలాంటి మాటలు మాట్లాడుతున్నాడు. నన్నే తప్పు పడుతున్నాడు. ఈయన నన్ను ఎంత ఇబ్బంది పెట్టినా కేవలం పిల్లలకు తండ్రి కావాలనే ఉద్దేశంతోనే సర్దుకుపోతున్నాను. ఇక అతనితో నేను కలిసి ఉండలేను. ఇప్పుడూ ఆయన మా కోసం చేస్తుంది ఏమీ లేదు. ఏదో చుట్టం చూపుగా వచ్చిపోతున్నాడు. ఇక ఇప్పుడు అది కూడా అవసరం లేదు' అంటూ కన్నీళ్లు పెట్టుకుంది.

మధ్యలో మనీష్ తల్లి కల్పించుకొని 'అయితే నా పేరుతో ఉన్న పొలాన్ని శృతి, పిల్లల పేరుపై రాస్తాను' అంది. దానికి మనీష్ ఒప్పుకోలేదు. 'భార్యా పిల్లలతో ఉండకుండా నీ ఇష్టం వచ్చిన దగ్గర నువ్వు ఉంటే నీకెందుకు రాస్తాను' అంది. మూమే కల్పించుకుని 'చూడు మనీష్.. నువ్వు భార్యా పిల్లలతో కలిసి ఉండనంటున్నావు. ఇక నీకు ఆస్తి ఎలా వస్తుంది? శృతి కష్టపడి పిల్లల్ని పోషించుకుంటుంది. నువ్వు పట్టించుకోకపోతే ముగ్గురు పిల్లల్ని చూసుకోవల్సిన బాధ్యత ఆమెదే కదా. నీకెలా నీకు నచ్చినట్టు జీవించే హక్కు ఉందో, అలాగే శృతికి కూడా ఉంటుంది. శృతికి అండగా మీ అమ్మ, పిల్లలు ఉన్నారు. నీకే ఎవ్వరూ లేరు. రేపు నీ పరిస్థితి ఏమిటో ఒక్కసారి ఆలోచించుకో' అన్నాము. శృతితో 'నీ భర్త మారకుండా ఇలాగే ప్రవర్తిస్తే నీ నిర్ణయం నువ్వు తీసుకో. నీకు మీ అత్తమ్మ తోడు ఉంది. అలాగే మేము కూడా కావల్సిన సహకారం అందిస్తాము' అని ధైర్యం చెప్పి పంపించాము.

# జుట్టు పోషణకు ఈ పాలు చాలా మంచివి?

మన ముఖంపై మొటిమల మచ్చలను వదిలించుకోవడానికి కొబ్బరి పాలు చాలా అద్భుతంగా పనిచేస్తాయి. కొబ్బరి తురుము నుంచి మనం పాలని తయారు చేయవచ్చు.చర్మం, జుట్టు సంరక్షణలో కొబ్బరి పాలు ఖచ్చితంగా ప్రత్యేక పాత్ర పోషిస్తాయి.అలాగే కొబ్బరి పాలలో అధిక మొత్తంలో సంతృప్త కొవ్వు ఆమ్లాలు ఉంటాయి. ఇందులో విటమిన్ సి, బి ఇంకా ఇ కూడా పుష్కలంగా ఉన్నాయి. ఈ పాలలో కాపర్, సెలీనియం, ఐరన్ ఇంకా మెగ్నీషియం వంటి ఖనిజాలు లభిస్తాయి.కాబట్టి ఇది జుట్టు, చర్మ సమస్యలను చాలా సులభంగా తొలగిస్తుంది.ఇంకా అలాగే ఈ కొబ్బరి పాలలో యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు ఉంటాయి. ఇవి చర్మాన్ని ఇన్ఫెక్షన్ నుంచి కాపాడతాయి. ఇంకా అలాగే సహజమైన క్లెన్సర్‌గా పనిచేస్తుంది. కొబ్బరి పాలను తీసుకొని వాటిని మీ ముఖానికి పట్టించాలి. ఆ తర్వాత తడి టవల్‌తో ముఖాన్ని బాగా తుడుచుకోవాలి. కొబ్బరి పాలలో తేనె, బాదం ముద్ద ఇంకా ముల్తానీ మట్టి కలిపి చర్మానికి రాసుకోవచ్చు. ఒక 20 నిమిషాల పాటు అలాగే ఉంచి ముఖం బాగా కడుక్కోవాలి. ఈ ఫేస్ ప్యాక్ ముడతలు, మొటిమలు ఇంకా మచ్చలను తొలగిస్తుంది.ఇంకా అలాగే జుట్టు పెరుగుదలకు కూడా కొబ్బరి పాలు ఉపయోగపడతాయి. కొబ్బరి పాలను తలస్నానంకి ముందు తలకు బాగా పట్టించాలి. ఐదు నిమిషాలు

అలాగే ఉంచి ఆ తర్వాత శుభ్రంగా తలస్నానం చేయాలి. కొబ్బరి పాలు సహజమైన హెయిర్ కండీషనర్‌గా పనిచేసి జుట్టును ఎంతో మృదువుగా చేస్తుంది.అలాగే కొబ్బరి పాలు వడదెబ్బ నుంచి ఉపశమనం కలిగిస్తాయి. ఎండలో కమిలిపోయిన చర్మంపై కొబ్బరి పాలను అప్లై చేస్తే స్కిన్ ఇన్ఫ్లమేషన్ తగ్గించి, చర్మానికి ఇది చల్లదనాన్ని అందిస్తుంది. కొబ్బరి పాలలో ఉండే యాంటీబ్యాక్టీరియల్ గుణాలు మొటిమల సమస్యలను ఈజీగా దూరం చేస్తాయి.కాబట్టి ఖచ్చితంగా ఈ కొబ్బరి పాలని వాడండి. ఎల్లప్పుడూ చర్మాన్ని అందంగా ఇంకా అలాగే ఎంతో ఆరోగ్యంగా ఉంచుకోండి.



## చలికాలంలో చర్మం డల్ అవ్వకుండా ఇలా చెయ్యండి?



మన శరీరంలో విటమిన్స్ లోపించడం వల్ల చర్మం పొడిగా, నిర్జీవంగా మారుతుంది.మన చర్మం కళను కోల్పోయినట్టుగా కనబడుతుంది.అనేక చర్మ సమస్యలు కూడా తలెత్తుతాయి. కాబట్టి మన శరీరంలో విటమిన్స్ లోపం లేకుండా చూసుకోవాలి. శరీరంలో ఏయే విటమిన్స్ లోపించడం వల్ల ఎలాంటి చర్మ సమస్యలు వస్తాయో ఇంకా చర్మ ఆరోగ్యానికి ఏయే విటమిన్లు చాలా అవసరమో ఇప్పుడు మనం తెలుసుకుందాం. మన శరీరంలో విటమిన్ ఇ లోపించడం వల్ల చర్మం పొడిబారడుతుంది. చర్మం చాలా నీరసంగా కనిపిస్తుంది.అలాగే చర్మంలో తగినంత తేమ ఉండదు. కాబట్టి చర్మ ఆరోగ్యానికి విటమిన్ ఇ ఎంతో అవసరం. శరీరానికి తగినంత విటమిన్ ఇని అందించడం వల్ల చర్మం కాంతివంతంగా తయారవుతుంది. పైగా వాతావరణ కాలుష్యం కారణంగా కూడా చర్మం దెబ్బతినకుండా ఉంటుంది. చర్మం ఛాయ పెరుగుతుంది.ఇంకా ఫ్రీరాడికల్స్ కారణంగా చర్మానికి నష్టం కలగకుండా ఉంటుంది. చర్మం చాలా ఆరోగ్యవంతంగా తయారవుతుంది.ఇంకా విటమిన్ డి లోపించడం వల్ల కూడా చర్మ సమస్యలు తలెత్తుతాయి.ఈ విటమిన్ డి లోపించడం వల్ల చర్మం తరుచూ ఇన్ఫెక్షన్ ల బారిన పడుతుంది. తామర, సోరియాసిస్ వంటి చర్మ సమస్యలు వచ్చే అవకాశాలు చాలా ఎక్కువగా ఉంటాయి. చర్మం బాగా పొడిబారుతుంది. కాబట్టి విటమిన్ డి లోపం తలెత్తకుండా చూసుకోవాలి. తగినంత విటమిన్ డి ని అందించడం వల్ల చర్మం రోగనిరోధక శక్తి పెరుగుతుంది.ఇంకా చర్మం పొడిబారకుండా ఉంటుంది. అలాగే వ్యాధి కారక క్రిముల నుండి చర్మానికి హాని కలగకుండా ఉంటుంది.ఇంకా అలాగే చర్మ ఆరోగ్యానికి విటమిన్ సి కూడా ఎంతో మేలు చేస్తుంది. ఖచ్చితంగా ఇది ఒక యాంటీ ఆక్సిడెంట్ గా పని చేసి ఫ్రీరాడికల్స్ నుండి చర్మానికి హాని కలగకుండా కాపాడుతుంది. తగినంత విటమిన్ సి అందించడం వల్ల చర్మం చాలా యవ్వనంగా ఉంటుంది.అలాగే ముడతలు పడకుండా ఉంటుంది. ఇక చర్మ ఆరోగ్యానికి బి విటమిన్స్ కూడా ఖచ్చితంగా చాలా అవసరం. ఎందుకంటే బి విటమిన్స్ లోపించడం వల్ల చర్మం పొడిగా మారుతుంది.ఇంకా పెదాలు పలుగుతాయి. చర్మంపై ముడతలు, మచ్చలు ఇంకా దద్దుర్లు వంటివి వస్తాయి.కాబట్టి చర్మం ఆరోగ్యంగా ఉండాలంటే తగినన్ని బి విటమిన్స్ ఉండడం చాలా అవసరం. బి విటమిన్స్ లో యాంటీ ఇన్ ప్లామేటరీ లక్షణాలు చాలా పుష్కలంగా ఉంటాయి. ఇవి ఇన్ ప్లామేషన్ ను తగ్గించి చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడతాయి.

# పరమహంస..ప్రేమస్పర్శ!

ప్రేమకు ప్రతిరూపం రామకృష్ణ పరమహంస. కృష్ణుడి జ్ఞానవిజ్ఞానాలు, క్రీస్తు దయ కరుణల కలబోత ఆ అవతార పురుషుడు. ఆత్మాన్వేషకులనే కాదు, ఆధ్యాత్మిక గురువులనూ ప్రభావితం చేసిన రామకృష్ణుల జీవితం.. పారమార్థిక సాగరంలో దీపస్తంభం లాంటిది. ఎందరెందరో భక్తులను తన వాత్సల్యంతో ఆకర్షించిన ప్రేమమూర్తి ఆ పరమహంస. ఒకసారి కొందరు శిష్యులు రామకృష్ణుల ధర్మపత్ని శారదాదేవితో 'అమ్మా! గురుదేవుల ఈ సంఘం ఇంత పటిష్టంగా నిలిచి ఉండటానికి కారణం ఏమిటి?' అనడిగారు. ఆధ్యాత్మిక శక్తి, సంఘ నిర్వహణా సామర్థ్యం, సమర్థులైన సాధువులు, అశేష భక్తుల సహకారం.. ఇలా ఏదో ఒకటి కారణమై ఉంటుందని వారు భావించారు. కానీ ఆ దివ్యజనని స్పష్టం చేసిన సమాధానం వాటన్నింటికన్నా భిన్నమైంది. 'ఈ సంఘాన్ని నిరాటంకంగా ముందుకు నడుపుతున్నది శ్రీరామకృష్ణుల అవ్యాజప్రేమ' అన్నారామె.రామకృష్ణులు- పాండితీ ప్రకర్షతోనో, సంక్లిష్ట వేదాంత ప్రబోధాలతోనో భక్తులను ఆకర్షించ లేదు.. తన అచంచల, అనంత వాత్సల్యంతోనే ఆకట్టుకున్నారు. ఆయన జీవన ప్రస్థానం, ఆధ్యాత్మిక శిక్షణల్లోనూ ఆ పరమప్రేమే తొణికిసలాడేది. పారమార్థిక పురోగతిలో సహనం, క్షమ, విశాలత్వం తదితర లక్షణాలతో కూడిన ప్రేమ పాత్రను ఆ అవతారమూర్తి పరోక్షంగా ఈ లోకానికి ప్రకటితం చేశారు. ఆధ్యాత్మిక బోధ.. హాస్యస్ఫోరకంగాసంక్లిష్ట ఆధ్యాత్మిక సత్యాలను కూడా చక్కని హాస్యకథల్లో రంగరించి భక్తుల హృదయాలకు హత్తుకునే రీతిలో బోధించడం రామకృష్ణుల ప్రత్యేకత. తన దగ్గరకు వచ్చిన జిజ్ఞాసువులను పదాల పటాటోపంతో కలవరపెట్టకుండా సరళమైన భావాలతో వివరించేవారే ఉత్తమ గురువని నిరూపించారు. క్లిష్టమైన తాత్విక విషయాలను కూడా హాస్యపూరిత దృష్టాంతాలతో చెప్పేవారు. ముఖంలో మందహాసం లేకుండా, మానసికోల్లాసం కరవై, పాషాణ హృదయాలతో చేసే సాధనలు ఫలించవని ఆచరణలో నిరూపించారు. అందుకే ఆయన సాన్నిధ్యం భక్తులకు నవ్వుల పూదోటలో విహరించినట్లు తోచేది. హాస్యయోగ సాధనలో నిమ్నగమైనట్లు అనిపించేది. సాధారణంగా ఆధ్యాత్మిక సమావేశాల్లో కనిపించే గంభీర వాతావరణానికి భిన్నంగా ఆ సద్గురువు గోష్ఠి హాస్యవల్లరిగా అలరించేది. నేటికీ ఎందరో ఆధ్యాత్మిక గురువులు.. రామకృష్ణులు ఆనాడు చెప్పిన హాస్యకథల్నే ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ప్రస్తావిస్తుంటారు. కళంకితులపైనా కరుణావృష్టిబంకించంద్ర ఛటర్జీ, ఈశ్వరచంద్ర విద్యాసాగర్ వంటి ప్రముఖులనే కాదు, నాటి సమాజం కళంకితులుగా ముద్రవేసిన వారిని సైతం రామకృష్ణులు ప్రభావితం చేశారు. ఉచ్ఛనీచ భేదాలు లేకుండా తనను ఆశ్రయించిన వారందరికీ ఆధ్యాత్మిక అభ్యున్నతి కలిగించారు. అలాంటివారిలో గిరీష్ చంద్రఘోష్ అనే బెంగాల్ నాటక రచయిత ఒకరు. 'నేను చేయని పాపమంటూ లేదు. వాటన్నిటినీ రామకృష్ణులు స్వీకరించి నన్ను పవిత్రుణ్ణి చేశారు. అందరూ పాపప్రక్షాళన కోసం గంగలో స్నానం చేస్తారు. కానీ నేను గంగలో మునిగితే.. ఆ గంగామాతే పవిత్రమయ్యేంత పునీతునిగా చేశారు గురుదేవులు' అంటూ ఆత్మీయులతో పంచుకున్నారాయన.

కళ్లకద్దుకున్న నారాయణగురుపారమార్థిక సాధనలో ఎందరికో మార్గదర్శకులుగా నిలిచిన సంఘసంస్కర్త నారాయణగురు. కేరళలోని ఆ సద్గురువును కలిసిన ఓ ఆధ్యాత్మికసాధకుడు- రామకృష్ణుల ఛాయాచిత్రాన్ని చూపి.. 'వీరి గురించి మీ అభిప్రాయం చెప్పండి స్వామి!' అన్నారు. నారాయణగురు పరమహంస ఆ చిత్రాన్ని కళ్లకద్దుకుని 'సాక్షాత్తూ పరబ్రహ్మ. అవతారపురుషుడు. ప్రేమ, కరుణ, వాత్సల్యం ఉట్టిపడే ఆయన ముఖం శాంతిప్రదాయకం' అని వ్యాఖ్యానించడం విశేషం. మాటకు, మనసుకు అతీతుడునిత్యం రామకృష్ణులకు హారతి ఇస్తూ మఠం ఆలయాల్లో 'ప్రభూ! వాక్కులకూ, మనసుకు అతీతుడివి! వెలుగులకు వెలుగై, మా హృదయ కుహరంలో ప్రకాశించే పరంజ్యోతివి! మా అజ్ఞాన అంధకారాన్ని పారదోలు' అని స్తుతిస్తారు. భగవంతుణ్ణి సంపదలు కాదు, అజ్ఞానాన్ని తొలగించమని వేడుకోవాలని రామకృష్ణుల భక్తులు సూచిస్తున్నారు. స్వయంగా ఆ పరమహంస కూడా తనను ఆశ్రయించిన వారిని లౌకికంగా స్థితిమంతులను చేయటం కన్నా, పారలౌకికంగా శ్రీమంతులను చేయటమే లక్ష్యంగా భావించారు. అజ్ఞానంలో కొట్టుకుపోతున్నవారిలో జ్ఞానదీప్తులు వెలిగించి పారమార్థికంగా సుసంపన్నులను చేశారు. సమత్వమే సాధనప్రపంచాన్ని సాక్షీభావంతో చూడగలిగినవారే ఆధ్యాత్మిక సాధకులని రామకృష్ణులు నిరూపించారు. బంగారాన్నీ, మట్టినీ సమంగా భావించగలిగిన నాడు, ఇక ఎలాంటి ప్రలోభాలకూ లొంగరు- అనటానికి ఆయనే నిదర్శనం. భాగవతం నుంచి బుద్ధుడి వరకూ చెప్పింది ఇలాంటి సమత్వం గురించే. అందుకే ఆ పరమహంసను స్తుతిస్తూ..

మట్టినీ, బంగారాన్నీ సమానంగా చూసే, లేశమాత్రమైనా కోరికలు లేని, స్త్రీలను మాతృమూర్తిగా, కాళీమాతగా భావించే, భక్తులకు జ్ఞానం, ఉపాధి, ముక్తి, నిర్మలమైన బుద్ధిని ప్రసాదించే రామకృష్ణులకు నమస్కరిస్తున్నాను- అని నీరాజనాలు అర్పించారు స్వామి విరజానంద అనే పరమహంస శిష్యులు. స్వామి వివేకానంద 'ఖండన భవబంధన' అని పరమహంసను స్తుతించారు. ప్రాపంచిక బంధాల నుంచి విముక్తి కలిగిస్తారన్నది భావం. తుది గడియల్లోనూ భక్తులకై తపించిరామకృష్ణులు ఆఖరి రోజుల్లో గొంతు క్యాన్సర్‌తో అవస్థపడ్డారు. ఆయన మాట్లాడితే ప్రాణాపాయం- అని వైద్యులు వారించినా లక్ష్యపెట్టక.. భక్తులకు సాంత్వననిచ్చే అమృతవాక్కులు పలికేవారు. ప్రేమపూర్వక మాటలతో, భక్తిగీతాలతో వారికి మనశ్శాంతిని ప్రసాదించేవారు. సేవకులు, శిష్యులు అడ్డుపడుతుంటే 'ఒక్కరికి మేలు చేసేందుకు వెయ్యి జన్మలైనా ఎత్తుతాను. మరణానికి భయపడను' అన్నారాయన.

# భారత పర్యటనకు ఆఫ్ఘనిస్తాన్ టీమ్.. జూన్‌లో కనిపించనున్న రోహిత్, కోహ్లీ







**హైదరాబాద్ పెన్ పవర్:** ఆఫ్ఘనిస్తాన్ క్రికెట్ జట్టు జూన్ 2026లో భారత పర్యటనకు రాబోతుంది. ఈ విషయాన్ని భారత్ క్రికెట్ నియంత్రణ మండలి ధ్రువీకరించింది. ఇందులో భాగంగా ఒక టెస్ట్, మూడు వన్డే మ్యాచ్ లు జరగనున్నట్లు వెల్లడించింది. దీనికి సంబంధించిన పూర్తి షెడ్యూల్ ను రిలీజ్ చేసింది. ఏకైక టెస్ట్ మ్యాచ్ జూన్ 6 నుంచి 10వ తేదీ వరకు న్యూ చండీగడ్ లోని మహారాజా యాదవీంద్ర సింగ్ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం వేదికగా జరగనుంది. ఇదే ఈ మైదానంలో జరగనున్న తొలి ఇంటర్నేషనల్ టెస్ట్ మ్యాచ్ కానుంది. జూన్ 14, 17, 20వ తేదీల్లో వన్డే మ్యాచులు కొనసాగనున్నాయి.

**ఆఫ్ఘానిస్తాన్ జట్టుకు కొత్త కోచ్:**

ఇండియా వర్సెస్ ఆఫ్గనిస్తాన్ మధ్య ఇప్పటి వరకు కేవలం ఒక టెస్ట్ మ్యాచ్ మాత్రమే ఆడాయి. ఆ మ్యాచ్ 2018లో జరిగింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు సుదీర్ఘ ఫార్మాట్లో ఈ రెండు దేశాల క్రికెట్ టీమ్స్ ముఖాముఖి పోటీ పడలేదు. అలాగే భారత్‌తో ఆఫ్ఘానిస్తాన్ చివరిసారి జనవరి 2024లో మూడు టీ20ల సిరీస్‌లో తలపడింది. కాగా ఇప్పుడు మళ్లీ రెండు జట్ల మధ్య మొదటి పూర్తిస్థాయిలో ద్వైపాక్షిక సిరీస్ జరగనుండటం విశేషం. ఇటీవల ఆఫ్ఘానిస్తాన్ అన్ని ఫార్మాట్‌లకు ప్రధాన కోచ్‌గా రిచర్డ్ పైబస్ ను నియమించింది. పాకిస్తాన్, బంగ్లాదేశ్ జట్లకు కోచ్‌గా పని చేసిన ప్యాబస్, ప్రస్తుత కోచ్ జొనాథన్ ట్రాట్ స్థానంలో బాధ్యతలు చేపట్టనున్నాడు. వచ్చే నెల యూఏఈలో శ్రీలంకతో జరిగే వన్డే సిరీస్‌కు ముందు ఆయన జట్టుతో కలుస్తారు.

**షెడ్యూల్:**

టెస్ట్ మ్యాచ్: జూన్ 6 నుంచి 10 వరకు - న్యూ చండీగఢ్

మొదటి వన్డే మ్యాచ్: జూన్ 14: హిమాచల్ ప్రదేశ్ క్రికెట్ అసోసియేషన్ స్టేడియం (హెచ్‌పీసీఏ), ధర్మశాల

రెండో వన్డే: జూన్ 17: భారతరత్న శ్రీ అటల్ బిహారీ వాజ్‌పేయి (దీ=ూాదీఎ) ఏకానా క్రికెట్ స్టేడియం, లక్నో

మూడో వన్డే: జూన్ 20: హీూ చిదంబరం స్టేడియం, చెన్నై

**జూన్ లోనే మైదానంలోకి కోహ్లీ - రోహిత్:**

ఈ వన్డే సిరీస్‌లో భారత స్టార్ బ్యాటర్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ మళ్లీ భారత జట్టు జెర్సీలో కనిపించనున్నారు. వీరు ఇద్దరూ టెస్టులు, టీ20ల నుంచి రిటైర్ అయి ప్రస్తుతం కేవలం వన్డే (50 ఓవర్ల) ఫార్మాట్‌కే పరిమితమయ్యారు.

**ఇంగ్లండ్ పర్యటనకు సిద్ధం:**

ఆఫ్ఘానిస్తాన్ సిరీస్ అనంతరం కోహ్లీ, రోహిత్‌లు ఇంగ్లండ్ తో జరిగే వైట్‌బాల్ పర్యటనలో పాల్గొంటారు. జూలై 1వ తేదీ నుంచి ఐదు టీ20లు, మూడు వన్డేల సిరీస్ ప్రారంభమవుతుంది. వన్డే మ్యాచ్‌లు జూలై 14 నుంచి స్టార్ట్ కానున్నాయి.

# పాక్‌తో ఆ ఫైనలే నా ఫేవరెట్.. ఆ మ్యాచ్‌ను ఏదీ బీట్ చేయలేదు: రోహిత్ శర్మ

**పాకిస్థాన్‌తో ఆడిన మ్యాచ్‌లలో 2007 టీ20 ప్రపంచకప్ ఫైనలే తనకు అత్యంత ఇష్టమైందన్న రోహిత్**

**ఆ మ్యాచ్‌ను ఏదీ అధిగమించలేదని వ్యాఖ్య**

**2022 ప్రపంచకప్‌లో కోహ్లి ఆడిన ఇన్నింగ్స్ అద్భుతమని కొనియాడిన హిట్ మ్యాన్**

**ఆట నుంచి రిటైర్ అయినా, ప్రతీ మ్యాచ్‌కు తాను టెన్షన్ పడతానని వెల్లడి**

**ఆ టెన్షనే తనలో ఆడే ఉత్సాహాన్ని నింపుతుందని వ్యాఖ్య**



**హైదరాబాద్ పెన్ పవర్:** టీమిండియా మాజీ కెప్టెన్, స్టార్ బ్యాటర్ రోహిత్ శర్మ.. భారత్-పాకిస్థాన్ పోరులోని మధుర జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నాడు. 2007లో జరిగిన మొట్టమొదటి టీ20 ప్రపంచకప్ ఫైనల్, పాకిస్థాన్‌పై తనకు అత్యంత ఇష్టమైన మ్యాచ్ అని అభివర్ణించాడు. ఆ మ్యాచ్‌ను మించింది మరొకటి లేదని స్పష్టం చేశాడు. 2026 టీ20 ప్రపంచకప్ ఎడిషన్‌కు అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్న రోహిత్, ఈ సందర్భంగా ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. 2007 నుంచి 2024 వరకు జరిగిన అన్ని టీ20 ప్రపంచకప్‌లలో పాకిస్థాన్‌తో జరిగిన ప్రతీ మ్యాచ్‌లో రోహిత్ శర్మ ఆడటం విశేషం. "పాకిస్థాన్‌తో ఆడిన మ్యాచ్‌లలో 2007 ఫైనల్ నాకు ఎప్పటికీ ఫేవరెట్. ఆ మ్యాచ్‌ను ఏదీ అధిగమించలేదు. ఆ టోర్నీలో మేం ప్రపంచకప్ గెలిచాం" అని రోహిత్ పేర్కొన్నాడు. అదే టోర్నీలో పాక్‌తో జరిగిన లీగ్ మ్యాచ్ కూడా బౌల్-అవుట్‌తో ముగిసిందని, అందులోనూ తామే గెలిచామని, ఆ రెండు మ్యాచ్‌లు తనకు చాలా ప్రత్యేకమని గుర్తుచేసుకున్నాడు. ఇక, 2022 టీ20 ప్రపంచకప్‌లో ఎంసీజీ వేదికగా పాక్‌తో జరిగిన మ్యాచ్‌ను కూడా రోహిత్ ప్రస్తావించాడు. ఆ మ్యాచ్‌లో తాను త్వరగా ఔటయ్యానని, ఆ తర్వాత డ్రెస్సింగ్ రూమ్‌లో కూర్చుని తీవ్రమైన టెన్షన్ అనుభవించానని చెప్పాడు. "ఆట మన చేతుల్లో లేనప్పుడు మైదానం బయట నుంచి చూడటం చాలా నిస్సహాయంగా అనిపిస్తుంది. ఆ మ్యాచ్‌లో నేను అలాగే ఫీల్ అయ్యాను" అని అన్నాడు. 160 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్, ఒక దశలో 31 పరుగులకే 4 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఆ సమయంలో విరాట్ కోహ్లి ఆడిన అద్భుతమైన ఇన్నింగ్స్‌తో భారత్ చారిత్రక విజయం సాధించింది. "ఆ మ్యాచ్‌లో కోహ్లి అద్భుతంగా ఆడాడు. మనం గెలవలేని స్థితి నుంచి జట్టును గెలిపించిన తీరు అమోఘం. క్రికెట్ చరిత్రలోనే అది ఒక గొప్ప మ్యాచ్. ప్రపంచకప్ లాంటి పెద్ద వేదికపై అలాంటి గెలుపు దక్కడం చాలా ప్రత్యేకం" అని రోహిత్ కొనియాడాడు. ఇటీవలే టీ20 ఫార్మాట్ నుంచి రిటైర్మెంట్ ప్రకటించిన రోహిత్, తాను ఆడిన 160 అంతర్జాతీయ మ్యాచ్‌లలో ప్రతీదానికి ఎంతో టెన్షన్ పడ్డానని అన్నాడు. "ఆటగాడిగా మైదానంలోకి అడుగుపెట్టిన ప్రతిసారీ నాకు ఆ టెన్షన్ ఉంటుంది. ఆ భావనే నాలో అత్యుత్తమ ప్రదర్శన ఇవ్వాలనే స్ఫూర్తిని నింపుతుంది" అని రోహిత్ అన్నాడు.

# ఉస్తాద్ PSPK కాలేజ్ బుల్లోడిలా

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ తన గ్రేస్ స్టైల్‌తో మరోసారి బాక్సాఫీస్‌పై దండయాత్రకు సిద్ధమయ్యారు. తాజాగా విడుదలైన -ఉస్తాద్ భగత్ సింగ్- సరికొత్త పోస్టర్‌లో పవన్ లుక్ చూసి అభిమానులు షాక్‌కు గురవుతున్నారు. ఈ ఫోటోలో పవన్ కళ్యాణ్ పాతికేళ్ల నవ యువకుడిలా, ఒక కాలేజీ బుల్లోడిలా మెరిసిపోతున్నారు. గెడ్డం లేకుండా క్లీన్ షేవ్ తో స్టైలిష్ హెయిర్ స్టైల్‌తో ఉన్న ఈ లుక్.. మళ్లీ తమ్ముడు, బద్రి రోజుల్లోకి తీసుకెళ్లింది. పవన్ ముఖకవళికల్లో ఉన్న ఆ దుడుకుతనం, బాడీ లాంగ్వేజ్ ఒక యువకుడి ఆవేశాన్ని తలపిస్తున్నాయి. ఈ సినిమా కోసం పవన్ తన లుక్‌పై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నట్లు తెలుస్తోంది.. అందుకే ఆయన వయసు మళ్ళీ పాతికేళ్ల వెనక్కి వెళ్ళిందా అన్నట్లుగా కనిపిస్తున్నారు. ఈ పోస్టర్ తో సినిమా విడుదలకు కౌంట్‌డౌన్ కూడా మొదలైంది. -పాతిక రోజుల్లోనే బాక్సాఫీస్ పెద్ద పండగ- అంటూ మేకర్స్ ప్రకటించడంతో అభిమానుల్లో ఉత్సాహం రెట్టింపయ్యింది. పోస్టర్‌పై ఉన్న అంకె చూడగానే పవన్ ఫ్యాన్స్ లో పూనకాలు మొదలయ్యాయి. పవన్ మార్క్ మాస్ ఎంటర్‌టైన్మెంట్ కోసం ఎదురుచూస్తున్న ప్రేక్షకులకు ఇది స్పెషల్ ట్రీట్ కానుంది. పవన్ ఈ చిత్రంలో మునుపటి కంటే మరింత ఎనర్జిటిక్ గా యంగ్ లుక్‌తో కనిపించబోతున్నారని ఈ స్టిల్ స్పష్టం చేస్తోంది. ప్రపంచవ్యాప్తంగా ఉస్తాద్ భగత్ సింగ్ చిత్రం మార్చి 26న గ్రాండ్ రిలీజ్ కాబోతోంది. ఈ తేదీ ప్రకటనతో సోషల్ మీడియాలో -ఉస్తాద్- హవా మొదలైంది. మార్చి 26 కోసం పవన్ ఫ్యాన్స్ ఇప్పటికే సంబరాలు ప్లాన్ చేసుకుంటున్నారు. పోస్టర్‌లో పవన్ కూర్చున్న తీరు.. ఆ స్వాగ్ చూస్తుంటే థియేటర్లలో విజిల్స్, గోల గ్యారెంటీ అని అర్థమవుతోంది. హరీశ్ శంకర్ దర్శకత్వంలో వస్తున్న ఈ సినిమా పవన్ అభిమానులకు ఒక ఫుల్ మీల్స్ లాంటి ట్రీట్ ఇవ్వబోతోంది. సినిమా ఆసాంతం పవన్ కళ్యాణ్ ఫుల్ స్వాగ్ మోడ్‌లో కనిపించబోతుంన్నారని, ఇది థియేటర్లలో ఒక రకమైన విస్ఫోటనాన్ని సృష్టిస్తుందని చిత్ర యూనిట్ ధీమా వ్యక్తం చేస్తోంది.






మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ ఈ భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌ను నిర్మిస్తున్నారు. రాక్ స్టార్ దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తుండగా, సినిమాటోగ్రఫీ అయనక బోస్ బాధ్యతలు చేపట్టారు. శ్రీలీల, రాశి ఖన్నా కథానాయికలుగా నటిస్తున్న ఈ చిత్రంలో అశుతోష్ రాణా, గౌతమి వంటి ప్రముఖ నటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.

మొత్తానికి -ఉస్తాద్ భగత్ సింగ్- మార్చి 26న థియేటర్లలోకి రావడం ఖాయమని అధికారికంగా ఖరారయ్యింది. కేవలం 25 రోజులే సమయం ఉండటంతో ఇకపై వరుస అప్‌డేట్స్‌తో ప్రమోషన్స్ హోరెత్తనున్నాయి. పవన్ కళ్యాణ్ తన స్టైలిష్, మాస్ అవతారంతో బాక్సాఫీస్ వద్ద కొత్త రికార్డులను సృష్టించడం ఖాయంగా కనిపిస్తోంది.



Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965